RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 19-08-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 157 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## బహుజనుల పోరాట

- ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ
- చేనేత, గీత కార్మికులకు వంద శాతం పింఛన్లు
- కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి
- అక్టోబర్ 22న అధికారికంగా 'పండుగ సాయన్న' జయంతి వేడుకలు

# స్ఫూర్తి పాపన్న గౌడ్





**హైదరాబాద్, ఆగస్టు 18 (వుదయం) :** తెలంగాణలోని అర్హులైన నేత, గీత కార్మికులందరికీ సంతృప్త (సాచ్యురేషన్) స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సీఎం గురువారం ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వృత్తి రక్షణకు కట్టుబడి ఉన్నాం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గీత కార్మికుల వృత్తి రక్షణకు తమ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందని స్పష్టం చేశారు. గౌడ సోదరుల సంక్షేమం కోసం ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను అందజేశామని, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు ₹5 లక్షల పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్లపై ఈత, తాటి చెట్లను విస్తృతంగా నాటాలని సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. పాపన్న స్ఫూర్తి అమరం పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో పరిమితమైన నాయకుడు కాదని, బహుజనులందరినీ ఏకం చేసి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన యోధుడని సీఎం కొనియాడారు. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీకి ఇచ్చే ప్రాధాన్యతే తెలంగాణలో సర్వాయి పాపన్నకు దక్కుతుందన్నారు. పర్యాటకులు, ప్రజల్లో స్ఫూర్తి నింపేందుకే ట్యాంక్‌బండ్‌పై పర్యాటక శాఖ కార్యాలయాన్ని తరలించి మరీ ఈ విగ్రహాన్ని నెలకొల్పినట్లు వివరించారు. ఇదే క్రమంలో పాలమూరు పోరాట యోధుడు, ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటన చేశారు.చదువుతోనే తరాల భవిష్యత్తు కులవృత్తులను కొనసాగిస్తూనే, పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని తల్లిదండ్రులకు సీఎం పిలుపునిచ్చారు. "మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువొక్కటే మార్గం" అని పేర్కొన్నారు. సంక్షేమ పాఠశాలల్లో సన్న బియ్యం భోజనంతో పాటు పాలు, రాగిజావ, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఏటీసీలలో చేరే విద్యార్థులకు నెలకు ₹2,000 ఉపకార వేతనం ఇస్తున్నామన్నారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా తమ ప్రభుత్వం బీసీ కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను విజయవంతంగా చేపట్టిందని సీఎం వెల్లడించారు.

## తెలంగాణ కీర్తిని చాటిన క్రీడాకారులు

### జాతీయ క్రీడా పురస్కార గ్రహీతలకు ముఖ్యమంత్రి అభినందనలు



**హైదరాబాద్, ఆగస్టు 18 (వుదయం) :** ప్రతిష్ఠాత్మక 'అర్జున' అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్), ధనుష్ శ్రీకాంత్ (షూటింగ్)లను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకున్న వీరిద్దరూ తెలంగాణకే కాకుండా, దేశానికే గర్వకారణంగా నిలిచారని సీఎం కొనియాడారు. దీంతో పాటు, 'జాతీయ క్రీడా పురస్కారాలు-2025' సాధించిన విజేతలందరికీ సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారుల అంకిత భావం, నిరంతర కృషి, పట్టుదల భవిష్యత్ తరాల యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వీరంతా మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి, దేశానికి మరిన్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానానికి బాంబు హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 18 (వుదయం) :** హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం తీవ్ర అలజడి రేగింది. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం బయలుదేరాల్సి ఉన్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు ఇమెయిల్ రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. విమానం రన్‌వేపైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సమయంలోనే ఈ బెదిరింపు సందేశం అందింది. బాంబు హెచ్చరిక రాగానే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) అధికారులు, విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ సాయంతో విమానంతో పాటు పరిసర ప్రాంతాలన్నింటినీ అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ ఘటనతో విమానాశ్రయంలో కొద్దిసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. మరోవైపు, ఈ బెదిరింపు మెయిల్ పంపిన దుండగులను గుర్తించేందుకు నిఘా వర్గాలు విచారణ వేగవంతం చేశాయి. నిందితుల ఆచూకీ కనిపెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని భద్రతాధికారులు స్పష్టం చేశారు.

## హర్మూజ్.. యూఎస్ కొత్త ప్రదేశం




**అమెరికా :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరిన వేళ, వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిపై తమకే పూర్తి నియాంత్రణ ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ట్రూత్ సోషల్' వేదికగా హర్మూజ్ జలసంధి మ్యాప్‌ను షేర్ చేసిన ఆయన, దానిపై 'హర్మూజ్.. అమెరికా కొత్త ప్రదేశం' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా బలగాలు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఇరాన్‌తో ఎటువంటి చర్చలు లేదా సంప్రదింపులు జరగడం లేదని ట్రంప్ తేల్చి చెప్పారు. జలసంధిలో ఇరాన్ అమర్చిన పేలుడు పదార్థాలను తమ దళాలు తొలగించడమో లేదా పేల్చివేయడమో చేశాయని, నావిగేషన్ మార్గం తెరిచే ఉందని ఆయన వెల్లడించారు. అయితే, ఇరాన్ నౌకలపై దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**డిమాండ్లు నెరవేర్చాల్సిందే: ఇరాన్ పార్లమెంట్ స్పీకర్**

మరోవైపు అమెరికా వైఖరిపై ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు హర్మూజ్ జలసంధిపై పట్టు సడలించేది లేదని మంగళవారం స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం తమపై విధించిన చమురు ఆంక్షలను వెంటనే తొలగించాలని, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయడంతో పాటు సైనిక చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- పోలీసుల తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- నర్సంపేటలో అర్ధరాత్రి పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు
- విగ్రహాల తొలగింపు కాంగ్రెస్ పాశవికత్వానికి నిదర్శనం



**హైదరాబాద్, ఆగస్టు 18 (వుదయం)** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని నర్సంపేటలో అర్ధరాత్రి వేళ తొలగించడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన దమనకాండకు, పాశవికత్వానికి ఈ ఘటన ద్వారా మరోసారి నిదర్శనంగా నిలిచిందని మండిపడ్డారు. నర్సంపేట మట్టిలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం నిలబడితేనే రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో వణుకు మొదలవుతోందని, అందుకే పోలీసులను ముందుపెట్టి దొంగచాటుగా ఈ చర్యకు ఒడిగట్టారని ఆరోపించారు.

**పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలి**

కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లే నడుకోవద్దని, చట్టాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని కేటీఆర్ హితవు పలికారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని పాలకులు, అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. విగ్రహ తొలగింపును నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడం, గృహనిర్బంధాలు విధించడాన్ని ఖండించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న నాటి నిరంకుశత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరావృతం చేస్తోందని విమర్శించారు.

**అరెస్టయిన నేతలను**

వెంటనే విడుదల చేయాలి శాసనసభ విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహా పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తల అరెస్టులను కేటీఆర్ తప్పుబట్టారు. అక్రమంగా నిర్బంధించిన బీఆర్‌ఎస్ శ్రేణులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలతో మరింత వేధించవద్దని హితవు పలికారు. భవిష్యత్తులో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, అప్పుడు నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టడంతో పాటు ఆయన వీరోచిత పోరాటానికి తగిన శాశ్వత గౌరవం కల్పిస్తామని స్పష్టం చేశారు.

### చిన్నారులపై లైంగిక కంటెంట్‌పై


## సహించేది లేదు

### ఏఐ వీడియోలపై కేంద్ర ఐటీ శాఖ ఆందోళన
### భారత్ సాంస్కృతిక సున్నితత్వాలు పాటించాలి
### 'మెటా'కు కేంద్రం తీవ్ర హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఎఎంస్) :** ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల్లో బాలల లైంగిక వేధింపుల సమాచారం (CSAM) వ్యాప్తి చెందుతుండటంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం 'మెటా' ప్రతినిధులతో భేటీ అయి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఎలాంటి కంటెంట్‌ను ఎంతమాత్రం సహించేది లేదని తేల్చిచెప్పింది. సీఎస్ఏఎమ్ నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, వ్యక్తులు చట్టపరమైన రక్షణను (సేఫ్ హార్బర్) కోల్పోతారని స్పష్టం చేసింది. భారతీయ సంస్కృతికి అనుగుణంగా మోడరేషన్ కంటెంట్ మోడరేషన్ విషయంలో భారత్‌లోని వివిధ భాషలు, సాంస్కృతిక, సామాజిక సున్నితత్వాలను సోషల్ మీడియా సంస్థలు పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం సూచించింది. భావప్రకటనా స్వేచ్ఛ కీలకమైనదే అయినప్పటికీ, వివిధ దేశాల పరిస్థితులు, సంస్కృతులు వేర్వేరుగా ఉంటాయని గుర్తుచేసింది. అదే సమయంలో సోషల్ మీడియాలో విపరీతంగా పెరుగుతున్న ఏఐ జనరేటెడ్ వీడియోలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, కంటెంట్‌ను ఏఐ రూపొందించిందా లేదా మనుషులు చేశారా అనేది స్పష్టంగా తెలిసేలా లేబుళ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దేశ చట్టాలను గౌరవించాల్సిందే మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఏదైనా ఖాతా తొలగించాలని ఆదేశిస్తే ఆ విషయాన్ని, దానికి గల చట్టపరమైన కారణాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేసేలా 'ఎక్స్' (X) సంస్థ నూతన విధానాన్ని తీసుకువచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రతిస్పందిస్తూ.. ఏ సోషల్ మీడియా మాధ్యమైనా దేశంలో కార్యకలాపాలు సాగించాలంటే స్థానిక చట్టాలకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉండాల్సిందేనని పునరుద్ఘాటించింది.




## ఇంతే కదా...!








# మున్సిపాలిటీలో కమిషనర్ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

**కోహీర్ ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)**

కోహిర్ మున్సిపాలిటీ పట్టణంలో మున్సిపల్ కమిషనర్.చికినే శశిధర్ పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల హాజరు, విధుల నిర్వహణ, వారికి కేటాయించిన పనులు మరియు బాధ్యతలను కమిషనర్ పరిశీలించి, ప్రతి ఒక్కరూ తమ విధులను సమయపాలనతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన చీపుర్లు, పారలు, ఇతర పారిశుద్ధ్య సామగ్రి గురించి వారితో చర్చించి, అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచే చర్యలపై సూచనలు చేశారు.

అదేవిధంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా సమస్యలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో, నీటి లీకేజీలు ఎక్కడ ఉన్నాయో పరిశీలించారు.తదుపరి వాటర్ లైన్ సిబ్బంది మరియు మిషన్ భగీరథ సిబ్బందితో సమావేశం నిర్వహించి, పట్టణంలోని వాటర్ ట్యాంకులను పరిశీలించారు. నీటి పైపులైన్లలో ఉన్న లీకేజీలను గుర్తించి, వాటిని వెంటనే సరిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజలకు నిరంతరాయంగా సురక్షితమైన త్రాగునీరు అందేలా సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ వాటర్ లైన్ మరియు మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు.పట్టణంలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు.

## వానలు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పైర్లు

# తీవ్ర ఆర్థిక నష్టాల్లో రైతన్నలు

**కోహీర్ ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్రంగా కుంగదీస్తున్నాయి. ఆశలతో విత్తనాలు వేసి సాగు చేసిన మొక్కజొన్న పంటలు వర్షాలు లేక కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.పంట సాగు కోసం రైతులు ఎకరాకు వేల రూపాయలు వెచ్చించారు .



నేలను సిద్ధం చేయడానికి దుక్కి దున్నడం, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయడం, విత్తడం వంటి పనులకు భారీగా ఖర్చు చేశారు.

పైరు పెరిగే క్రమంలో గడ్డి, కలుపు తీయించడానికి కూలీలకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. పంట ఏపుగా పెరగాలనే ఆశతో అధిక ధరలకు డిఎపి, యూరియా వంటి ఎరువులను కొనుగోలు చేసి చల్లారు. వర్షాల ముఖం,చాటు, ఎరువులు వేసి పంటను కాపాడుకుందామనుకున్న సమయంలో వర్షాలు పూర్తిగా ముఖం చాటేశాయి.ఆకాశంలో మబ్బులు పడుతున్నా వర్షం కురవకపోవడంతో పైర్లు తేమ లేక రోజురోజుకూ వాడిపోతున్నాయి.మొక్కజొన్న చేన్లు పచ్చగా కప్పేయాల్సిన సమయంలో ఎండిపోయి పశువుల మేతగా మారే దుస్థితికి చేరుకున్నాయి.పంట చేతికి వస్తే అప్పులు తీర్చుకోవచ్చనుకున్న రైతులకు, ఇప్పుడు పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.విత్తనాల నుండి ఎరువులు, కూలీల వరకు ప్రతి పనికీ వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. దిగుబడి సున్నాకి పడిపోవడంతో ఆ అప్పులను ఎలా తీర్చాలో తెలియక రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు అడుగుకి పడిపోయాయి.

పండిన కాస్త పంటనైనా కాపాడుకుందామని రైతులు అదనంగా అప్పులు చేసి కొత్తగా బోర్లు వేయిస్తున్నా నీళ్లు పడటం లేదు.ఆల్టర్నేటివ్ తడులు ఇవ్వడానికి డీజిల్ ఇంజన్లు, మోటార్లు వాడటంతో ఇంధన ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.నీటి ఎద్దడి వల్ల మొక్కల నిరోధక శక్తి తగ్గి, పంటలపై కత్తెర పురుగు, ఇతర తెగుళ్లు తీవ్రంగా దాడి చేస్తున్నాయి.తెగుళ్ల నివారణకు ఖరీదైన పురుగుమందులు పిచికారీ చేసినప్పటికీ, వర్షం లేకపోవడంతో ఆ మందులు కూడా పనిచేయడం లేదు.సొంత భూమి లేక ఎకరాకు వేల రూపాయలు కౌలు చెల్లించి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

ఒకవైపు భూయజమానికి ఇవ్వాల్సిన కౌలు డబ్బులు, మరొకవైపు పంట పెట్టుబడులు రెండూ పోయి పూర్తి స్థాయిలో దివాళా తీసే పరిస్థితికి వచ్చారు. వారికి ప్రభుత్వ పథకాలు లేదా ఇన్స్యూరెన్స్ అందుతుందో లేదోనన్న భయం వెంటాడుతోంది.పంటలు నష్టపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల మానసిక స్థితి క్షీణిస్తోంది.పంట చేతికొస్తే అప్పులు కడతామని చెప్పిన రైతులపై ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఒత్తిడి పెరుగుతోంది.

ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక రైతన్నలు తీవ్ర మానసిక కుంగుబాటుకు గురవుతున్నారు.

వర్షాభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన మొక్కజొన్న రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే చేసి గుర్తించాలి. ఎకరాకు తగిన నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించి, ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి. అలాగే బ్యాంక్ రుణాల రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయడం ద్వారా రైతాంగానికి కస్తాఅయిన ఊరట లభించినట్టు అవుతుందని రైతులు తమని ఆదుకోవాలని ప్రభుత్వని.వేడుకొంటున్నారు.



# స్కేటింగ్‌లో జాతీయ రికార్డు సాధించిన వనపర్తి చిన్నారులు

**వనపర్తి ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)**

స్కెటింగ్ లో జాతీయ స్థాయి రికార్డ్ సాధించిన 32 మంది చిన్నారులను అభినందించిన జిల్లా ఎస్పీ:

సునిత రెడ్డి, ఐపీఎస్.,80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్‌తో వనపర్తి విద్యార్థుల అరుదైన రికార్డ్స్కేటింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న చిన్నారులుక్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలకు ప్రతీకగా నిలిచిన 32 మంది విద్యార్థులువనపర్తి,ఆగస్టు18: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బౌరంపేట్‌లో మిషన్ స్కేటింగ్ అకాడమీ పూణే వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ ఈవెంట్‌లో వనపర్తి జిల్లాకు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొని అరుదైన జాతీయ స్థాయి రికార్డ్ సాధించారు. ఎటువంటి విరామం లేకుండా 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేస్తూ విద్యార్థులు తమ అద్భుత ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణను చాటుకున్నారు. ఈ ఘనతకు గుర్తింపుగా విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే మంచి ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయి రికార్డు సాధించడం వనపర్తి జిల్లాకు గర్వకారణం. మీలో కనిపిస్తున్న క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎంతో అభినందనీయం" అని ప్రశంసించారు.క్రీడలు కేవలం గెలుపు కోసం మాత్రమే కాదు.. క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప సాధనం. 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేసి జాతీయ స్థాయి రికార్డ్ సాధించడం సాధారణ విషయం కాదు. ఇది మీ కృషి, మీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వానికి నిదర్శనం. ఈ విజయంతో సంతృప్తి చెందకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి వనపర్తి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ రాథోడ్ కిషన్, నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు ఇదే క్రీడాస్ఫూర్తి, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగి భవిష్యత్‌లో మరిన్ని ప్రపంచస్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వనపర్తి చిన్నారుల స్కేటింగ్ ప్రతిభకు జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా ఎస్పీ స్వయంగా ప్రశంసలు అందించడం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై, మంజునాథ్ రెడ్డి, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, ఎస్సై జగన్ మోహన్, స్కేటింగ్ కోచ్, కిషన్ స్కేటింగ్ చిన్నారులు, చిన్నారుల తల్లి దండ్రులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కార్యదర్శిగా పగిడిమర్రి శ్రీనాథ్ నియామకం

**సంగారెడ్డివుదయం :**

భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షురాలు గోదావరి గారికి, సంగారెడ్డి పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారికి, ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారికి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు విట్టల్ గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలతో కలిసి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



# బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **అమ్మాయి పల్లి గ్రామంలో ఘనంగా 376వ జయంతి వేడుకలు**

**చిన్నంబావి మండలం 18 (వుదయం రిపోర్టర్)**

తెలంగాణ గడ్డపై అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మంగళవారం అమ్మాయి పల్లి గ్రామంలో గౌడ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1650 ఆగస్టు 18న ప్రస్తుత జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో జన్మించిన పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకమైన పోరాట చరిత్ర. ఈ ఏడాది ఆయన 376వ జయంతి సందర్భంగా ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన



పాపన్న చిన్ననాటి నుంచే అన్యాయాన్ని, దోపిడీని ప్రశ్నించే ధైర్యాన్ని ప్రదర్శించారు. అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారిని సంఘటితం చేసి పోరాటానికి నడిపించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన తన సహచరులతో కలిసి సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని పలు కోటలను స్వాధీనం చేసుకున్నట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. ఖిలాషాపూర్ కేంద్రంగా తన పరిపాలనను విస్తరించారు.అందుకే ఆయనను తెలంగాణ చరిత్రలో తొలి బహుజన రాజుల్లో ఒకరిగా పలువురు చరిత్రకారులు, సామాజిక ఉద్యమకారులు గుర్తిస్తున్నారు. పాపన్న జీవిత చరిత్రలోని మరో విశేషం ఆయనతో కలిసి వివిధ వృత్తులు, సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు పోరాడటం. సమాజంలోని అణగారిన వర్గాలను ఏకం చేసి, వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆయన ధైర్యం నేటికీ ప్రజలను ఆకట్టుకుంటోంది. ప్రతి సంవత్సరం ఆగస్టు 18న పాపన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడంతో పాటు సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2026లో 376వ జయంతి సందర్భంగా కూడా ఆయన చరిత్రను భావితరాలకు పరిచయం చేయాలని పలువురు పిలుపునిస్తున్నారు.పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వ భావనలను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి. చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోవడానికి కారణం ఇదే. ఈ కార్యక్రమంలో అమ్మాయిపల్లి గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగాసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

- **బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం.....**

**అడిషనల్ కలెక్టర్ పాండు**

**సంగారెడ్డి, ఆగస్టు 18:--వుదయం**

సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ పాండు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల కోసం ధైర్యంగా నిలబడిన ఆయన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గద్వాల గట్టుకు సర్కారు తెగువ!

- **సాగునీటి కల నెరవేరేలా భారీ నిర్ణయం: 15 టీఎంసీలకు గుడ్డెందొడ్డి.. 3 టీఎంసీలకు గట్టు ఎత్తిపోతల!**
- **రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు జలకళ.. రైతులలో వెల్లివిరిసిన ఉత్సాహం**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఘన సన్మానం**
- **"గద్వాలను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం – సీఎం భరోసా**

**గద్వాల ఆగస్టు 18 (వుదయం బ్యూరో)**

దశాబ్దాలుగా ఎండమావిగా మారిన గద్వాల ఆయకట్టు దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసింది. గద్వాల నియోజకవర్గాన్ని రత్నగర్భగా మార్చేలా గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ల సామర్థ్యాన్ని భారీగా పెంచుతూ అసాధారణ నిర్ణయం తీసుకుంది. గట్టు ఎత్తిపోతల సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.9 టీఎంసీల నుంచి ఏకంగా 15 టీఎంసీలకు విస్తరించేందుకు సర్కారు పచ్చజెండా ఊపింది. ఈ జలవిప్లవాత్మక నిర్ణయంపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ ప్రజాప్రతి నిధులు హైదరాబాద్‌లోని ఎంసి హెచ్ ఆర్ డిలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను పొన్నాడ శాలువాతో సత్కరించి నియోజకవర్గ రైతాంగం తరపున ధన్యవా దాలు తెలియజేశారు. మానవపాడు నుంచి గట్టు దాకా.. కట్టకడపటి ఎకరానికీ నీళ్లు! ఈ నిర్ణయంతో గద్వాల నియోజకవర్గం లోని వ్యవసాయ రంగానికి నవశకం ప్రారంభం కానుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహ న్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గద్వాల అభివృద్ధి బాధ్యత నాదే: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాంతీయ అసమానతలను తొలగించి గద్వాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని రంగాల్లోనూ శీఘ్రగతిన అభివృద్ధి సాధిస్తామని హామీ ఇచ్చారు.అభివృద్ధిలో నంబర్‌వన్ స్థానమే ధ్యేయం గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రానికే ఆదర్శంగా, నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు అహరహం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రక ప్రాజెక్టుల విస్తరణ నిర్ణయంపై ప్రజలు, రైతాంగం తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లా సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, రైతు ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్దిపేటను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, 18 ఆగస్టు (వుదయం బ్యూరో)**





సిద్దిపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే అధికారులు వెంటనే స్పందించి నిరోధించాలని ఆదేశించారు.గ్రామాల్లో సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, ఫంక్షన్ హాళ్లు, దేవాలయాల్లో పెళ్లిళ్లకు వధూవరుల వయస్సు ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించేలా చర్యలు చేపట్టాలని డీపీఓను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కన్వర్జెన్సీ సమావేశాలు, మంగళ, గురువారాల్లో నిర్వహించే శానిటేషన్ డ్రైవ్‌ల సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు బడికి క్రమం తప్పకుండా హాజరయ్యేలా డీఈఓ పర్యవేక్షించాలని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాలకు ఉపాధి ప్రయోజనాలు కల్పించేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన వాయిస్ ఓవర్, వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్వో నాగరాజమ్మ, డీఎంహెచ్ఓ ధనరాజ్, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీపీఓ రవీందర్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాలు కొనసాగించాలి

- **చిరు వ్యాపారస్తుల డబ్బాలు తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు**
- **కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి**
- **మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి**
- **మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి**

**చిన్నంబావి మండలం 18 (వుదయం రిపోర్టర్)**



కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించి పేద కుటుంబాలకు అండగా నిలవాలని కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీ సంగతి దేవుడెరుగు.. కనీసం పేదింటి ఆడపిల్లల కళ్యాణమైనా జరిగేలా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. సోమవారం చిన్నంబావి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదింటి ఆడపిల్లల వివాహాల కోసం 2014లో అప్పటి సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ పథకాల కింద అందించే ఆర్థిక సహాయాన్ని క్రమంగా పెంచారని తెలిపారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసులు పేద వ్యాపారులను సెటిల్‌మెంట్లకు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. భయపెట్టి, ఒత్తిడి తెచ్చి సమస్యలను పరిష్కరించాలనుకోవడం సరికాదన్నారు. భూములు దేవాదాయ శాఖకు చెందినవైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, పేదలపై దౌర్జన్యాలకు పాల్పడవద్దని అధికారులను కోరారు. బాధిత వ్యాపారులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.210 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి జీవో 98 కింద అర్హులైన 210 మంది నిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తన హయాంలో అర్హుల జాబితాను సిద్ధం చేసి ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించి అర్హులైన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్, మాజీ జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణ, చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ ఎంపిటిసి తగరం లక్ష్మి కురుమయ్య, చిన్నమారు గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్, ఉప సర్పంచ్ పింజరి భాష, చెల్లపాడు సర్పంచ్ నరసింహ, వెలగొండ సర్పంచ్ శరత్ రెడ్డి, వడ్డేమాన్ రామకృష్ణ, పసుపుల రంజిత్ కుమార్, ఉప సర్పంచ్ బిచ్చన్న, దేగ సేకర యాదవ్, జయరాం రెడ్డి, రాజారెడ్డి, సంకటి మద్దిలేటి, జింకల రమేష్, సంపంగి మద్దిలేటి, బిసన్న, విజయ్‌కుమార్, ఆటో తగరం కురుమయ్య, మాజీ ఉప సర్పంచ్ కురుమయ్య, సంపంగి మద్దిలేటి, గంగేశ్వర్‌గౌడ్, మద్దిలేటి నాయుడు, గూడెపు శివారెడ్డి, గుండ వెంకటస్వామి, తదితర నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోకపై భూమి లేకున్నా,రికార్డులో పేరు లేకున్నా, పాసుబుక్ లు జారి

- **దొంగ పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి**
- **మదన్నగోపాల చారి వారసులు కే కే ప్రశాంతి**

**చిన్నంబావి మండలం 18 (వుదయం రిపోర్టర్)**



చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్ద దగడ గ్రామ శివారులో సర్వే నెంబర్ 445, 446, 447, 448, 449, 450, 451, 452, 453, నెంబర్లలో శాలి ఇన్నాం పట్టాదారు కేకే అలివేలమ్మ భర్త గోపాల చారీ పేరు మీద 1954 సంవత్సరము నుంచి 2023 సంవత్సరం వరకు వారి పేర్లు రికార్డు నమోదయి ఉన్నది. కేకే అలివేలమ్మ భర్త గోపాల చారి మరణం అనంతరం వారి వారసుడైన మదన గోపాల చారి పేరు మీద రికార్డు నమోదయి ఉన్నది. మదన గోపాల చారి మరణం అనంతరం వారి భార్య కే కే చుడామణి 2018 సంవత్సరంలో ఓఆర్సి రికార్డు నమోదు చేయాలని చిన్నంబావి మండల తాహసిల్దార్, వనపర్తి ఆర్డిఓ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. 2018 సంవత్సరంలో ఫామ్ వన్, ఫామ్ టు, నోటీసులు ఇవ్వడం జరిగింది. మదన గోపాల చారి వారసులు ఈ రోజు వరకు వారిని పోలీస్ స్టేషన్ చుట్టూ, ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ మరియు కోర్టు చుట్టూ తిప్పుతూ ఆ కుటుంబాన్ని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయము కోర్టులో ఉన్నది. కోర్టులో ఉన్న విషయాన్ని పక్కకు పెట్టి ఇతరులకు రికార్డు నమోదు చేసిన అధికారులు. మదన గోపాల చారి వారసులు కేకే ప్రశాంతి మాట్లాడుతూ తాతల కాలం నుంచి సుమారు కొన్ని ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సా గిస్తున్న తమపై కొందరు అక్రమంగా హక్కులు కల్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పెద్దదగడకు చెందిన బాధి తురాలు కే కే ప్రశాంతి ఆరోపించారు. ఆమె పెద్దద గడలో విలేకరులతో మాట్లాడారు. తమను కొన్నేళ్లుగా పట్టించుకోని వారు ఇప్పుడు తామూ వారసులమేనంటూ 14ఎకరాల వ్యవసా య భూమిపై హక్కులు కోరుతున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై స మగ్ర విచారణ జరిపి అక్రమంగా పట్టా ఎక్కించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని మోకపై లేకుండా అక్రమంగా రికార్డులు ఎక్కించుకున్న వారి పేర్లను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# అమరవాయికి 'మురుగు'బంధనం విముక్తి

- **ఏళ్ల నాటి సమస్యపై ప్రజాప్రతినిధి సమరశంఖం!**

**మానవపాడు ఆగస్టు 18 (వుదయం కరస్పాండెంట్)**



మురుగు కష్టాలతో నిత్యం నరకం చూస్తున్న అమరవాయి బస్టాండ్ రూపురేఖలు మారిపోయాయి. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామ బస్టాండ్‌ను ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్న డ్రైనేజీ పూడిక సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మురుగు నీరు నిలిచిపోయి, దుర్వాసనతో స్థానికులు, ప్రయాణికులు, వ్యాపారులు పడుతున్న అవస్థలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో యంత్రాంగం కదిలింది. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు గ్రామస్థుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సర్పంచ్ పి. హుస్సేన్ ప్రజాసమస్య పరిష్కారానికి నడుం బిగించారు. మంగళవారం ఉదయం 8 గంటలకే క్షేత్రస్థాయికి చేరుకున్న ఆయన, బస్టాండ్ ప్రాంతంలో స్వయంగా తిష్టవేసి పారిశుధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రజాసమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్థులు జయజేజెలు పలికారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీర్, నాయకులు రాఘవేంద్ర గౌడ్, కే. లక్ష్మన్న, వార్డు సభ్యుడు మధు, లింగం తదితరులు పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ భారత్: మనూర్‌లో ప్రత్యేక ఎక్స్‌రే క్యాంప్

- **టీబీని తరిమేద్దాం: టీబీ రహిత మనూర్ లక్ష్యంగా 45 మందికి ఉచిత ఎక్స్‌రే**

**వుదయం.మనూర్**

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "టీబీ ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మనూర్ మండలాన్ని టీబీ రహిత మండలంగా మార్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో మనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మనూర్ గ్రామంలో ప్రత్యేక ఎక్స్‌రే క్యాంప్ నిర్వహించారు. **45 మందికి స్క్రీనింగ్-**




ఈ క్యాంపులో మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 45 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. "గ్రామాల్లో ఒక్క టీబీ కేసు కూడా లేకుండా చేయడమే మా లక్ష్యం. 2 వారాలకు పైగా దగ్గు ఉంటే వెంటనే దగ్గరలోని పిహెచ్ సి లో పరీక్ష చేయించుకోవాలి" అని ఆయన ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమ్య సిద్ధా రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ ప్రకాష్, ఎంఎల్హెచ్పీలు శ్రావణి, అరుణ, ప్రతిభ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, పీహెచ్ఎన్ అనుకరుణ, ఆశా కార్యకర్తలు అనిత, సుజాత, మరోని బాయి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా ఇలాంటి క్యాంపులు నిర్వహిస్తామని పీహెచ్ సీ వైద్యాధికారి పేర్కొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్





## ప్రజాసేవకు గుర్తింపుగా ముషీరాబాద్ ఎమ్మెల్యేకు డాక్టరేట్

**ముషీరాబాద్,ఆగస్టు 18(వుదయం):** ప్రజలకు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ (HSCU) ముషీరాబాద్ ఎమ్మెల్యేకు డాక్టరేట్ ప్రదానం చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసానికి ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ముచ్చకుర్తి పద్మ దంపతులు వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉంటూ చేస్తున్న సేవలకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముచ్చకుర్తి ప్రభాకర్, ముచ్చకుర్తి పద్మ దంపతులు మాట్లాడుతూ.. ప్రజాసేవకు లభించిన ఈ డాక్టరేట్ ముషీరాబాద్ నియోజకవర్గానికే గర్వకారణమని, ఎమ్మెల్యేకు భవిష్యత్తులో మరెన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు, పురస్కారాలు దక్కాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, అవకాశం ఎమ్మెల్యేకు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రజాసేవను గుర్తించి డాక్టరేట్ అందించిన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ (HSCU) యాజమాన్యానికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## HIV/AIDS అవగాహన కోసం రంగారెడ్డి జిల్లాలో భారీ బైక్ ర్యాలీ



- **ర్యాలీని ప్రారంభించిన DM&HO డాక్టర్ స్వర్ణ కుమారి**

**రంగారెడ్డి, ఆగస్టు 18(వుదయం):** మంగళవారం నాడు HIV/AIDSపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో Intensified IEC Campaign లో భాగంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ బైక్ ర్యాలీని రంగారెడ్డి జిల్లా DM&HO డాక్టర్ స్వర్ణ కుమారి ప్రారంభించారు, అదనపు DM&HO డాక్టర్ పాప రావు, DTO డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. District Integrated Strategy for HIV/AIDS (DISHA) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీలో TGSACS ICTC ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సెంటర్స్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే ఆరోగ్య శాఖ సిబ్బంది, యువత, ASHA కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, NACO ప్రతినిధులు తదితరులు ర్యాలీలో పాల్గొని HIV/AIDSపై ప్రజలకు అవగాహన కల్పించారు.బైక్ ర్యాలీలో HIV/AIDS నివారణ, సురక్షిత జీవన విధానం, పరీక్షలు, చికిత్స, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం వంటి అంశాలపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. బైక్‌లపై అవగాహన పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ HIV/AIDSపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. HIVతో జీవిస్తున్న వారిని వివక్షకు గురిచేయకుండా వారికి గౌరవం, అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.HIV/AIDSకు సంబంధించిన సందేహాలు, సలహాల కోసం 1097 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ను వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో TGSACS ICTC ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సెంటర్స్ సిబ్బంది, జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, NACO ప్రతినిధులు, ASHA కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



**చేవెళ్ళ,ఆగస్టు18(వుదయం)** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద (వార్డు) గ్రామ మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వార్డు అంబేద్కర్ సంఘం యువకుడు హనోక్‌ఆనంద్ తన మిత్రులతో కలిసి పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు.

అభిమానంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని మధుసూదన్ గుప్తా అభినందిస్తూ,గ్రామ యువకులు సేవా కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తల్లపల్లి నర్సిములు,

మాజీ ఉప సర్పంచ్ మాల వెంకటయ్య,మాజీ బాబు జగ్జీవన్ రామ్ అధ్యక్షులు డప్పు రాజు ,యువకులు గ్రామస్తులు,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సంగీత,

ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సామాజిక సమానత్వానికి ప్రతీక

- **సర్వాయి పాపన్న గౌడ్ వీరపోరాటం**
- **బడుగు–బలహీన వర్గాల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**



**రంగారెడ్డి జిల్లా ,ఆగస్టు 18(వుదయం):** సామాజిక సమానత్వం, బడుగు-బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి పిలుపునిచ్చారు. ంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆమె సూచించారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, హక్కులు లభించేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. సర్వాయి పాపన్న గౌడ్ జీవితం, ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఆయన చూపిన ధైర్యం, సామాజిక స్పృహ, సమానత్వ భావనలను నేటి తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సామరస్యం, సోదరభావం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేషురామ్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గౌరిగే మల్లేష్‌యాదవ్, టీపీసీసీ కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు మంగమ్మ, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎగ్గిడి సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి రవి గౌడ్, కసర మౌని కృష్ణ యాదవ్, శ్యామ శంకర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ సుధాకర్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

- **నీరుడు సర్వేష్ ముదిరాజ్**
- **బండ్లగూడ–కిస్మత్పూర్ రోడ్డు వెడల్పు వెంటనే చేపట్టాలి నీరుడు సర్వేష్ ముదిరాజ్**
- **ప్రమాదానికి కారణమైన రహదారి సమస్యను పరిష్కరించాలి — నీరుడు సర్వేష్ ముదిరాజ్**



**గండిపేట్ ఆగస్టు 18 (వుదయం):** బండ్లగూడ నుంచి కిస్మత్పూర్ వెళ్లే ప్రధాన రహదారిపై సరస్వతి విద్యాపీఠం పాఠశాల సమీపంలో నిన్న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రమేష్ రెడ్డి అనే వ్యక్తి మృతి చెందడం, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లడం అత్యంత విషాదకరమని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు నీరుడు సర్వేష్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సరైన వెడల్పుతో లేకపోవడం, ఎన్నో రోజులుగా రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో ఉండటమే ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారి సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజేంద్రనగర్ జోన్ GHMC పరిధిలో రహదారి విస్తరణ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నీరుడు సర్వేష్ ముదిరాజ్ తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రమేష్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం, GHMC అధికారులు తక్షణమే అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదే విధంగా తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కుమారుడికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబం ఆపన్న స్థితిలో ఉన్నందున అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ నేపథ్యంలో ఈరోజు జోనల్ కమిషనర్ GHMC అధికారిని కలిసి వినతిపత్రం అందజేసిన నీరుడు సర్వేష్ ముదిరాజ్, రహదారి విస్తరణ పనులను ఇకపై ఆలస్యం చేయకుండా అత్యవసర ప్రాతిపదికన ప్రారంభించాలని కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయే కుటుంబాలకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రహదారి విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో ప్రమాదాలను కూడా నివారించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు.ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు నీరుడు సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు స్పందించి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. బండ్లగూడ-కిస్మత్పూర్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి విస్తరణ, ప్రమాద నివారణ చర్యలు, బాధిత కుటుంబాలకు పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని నీరుడు సర్వేష్‌ముదిరాజ్ కోరారు. జై తెలంగాణ... జై కవితమ్మ... రాజేంద్రనగర్ నియోజకవర్గం.

## 22A జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం

- **రంగారెడ్డి జిల్లా. ఆగస్టు 18 (వుదయం):**



ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి22A జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు మరియు చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22A జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22A జాబితాకు సంబంధించిన అంశాలు, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, భూ రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.

నంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ 22A జాబితాలో నమోదైన భూములకు సంబంధించి కొన్ని సందర్భాల్లో పాత సర్వే నంబర్లు, కొత్త సర్వే నంబర్లకు జరిగిన మార్పులు, సరిహద్దులు, భూముల విభజన తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. పాత సర్వే నంబర్ల ఆధారంగా ఉన్న భూములు, అనంతరం వచ్చిన సర్వే నంబర్లలో మిగిలిపోయిన భూములు, సరిహద్దుల ఆధారంగా స్పష్టత అవసరమైన అంశాలను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే హైకోర్టు, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల తీర్పుల ఆధారంగా సంబంధిత భూములకు వర్తించే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించి పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే నంబర్లు, సర్వే రికార్డులు, ఇతర సంబంధిత ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. కేవలం ఒక రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, సంబంధిత అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.ULC భూములపై ప్రత్యేక పరిశీలన పట్టణ ప్రాంతాల్లో గతంలో Urban Land Ceiling (ULC)కు సంబంధించిన భూములు కూడా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా GO 765 వంటి ఉత్తర్వుల ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, డిప్రెషన్/విముక్తి తదితర అంశాలను పరిశీలించి, అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో భూ రికార్డులను సవరించుకోని వారు లేదా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయని వారు నిబంధనల ప్రకారం సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ భూ రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.HMDA పరిధిలోని భూముల పైనా పరిశీలన HMDA పరిధిలోని భూములకు సంబంధించి కూడా రికార్డులను పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు, ప్రభుత్వ ఆస్తులు మరియు చట్టపరంగా 22A పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే సంబంధిత నిబంధనల ప్రకారం గుర్తించి జాబితాలో ఉంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "జెన్యూన్ పట్టా భూమి ఏదైనా పొరపాటున 22A జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా త్వరలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు మరియు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, అందుబాటులో ఉన్న పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహద్దులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం

### పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్, వీధిదీపాలకు అత్యంత ప్రాధాన్యత, ఎమ్మెల్యే జి ఎం ర్

- **పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**

**అమీనాపూర్ ఆగష్టు 18, వుదయం**



అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య పరిస్థితులపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణ, తరలింపులో సంబంధిత రాంకీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.వర్షాకాలంలో చెత్త పేరుకుపోవడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చెత్త సేకరణలో ఒక్క కాలనీ కూడా నిర్లక్ష్యానికి గురికాకూడదని, రాంకీ సంస్థ పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శానిటేషన్ సిబ్బంది, డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి కాలనీలో పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు.

**ప్రతి వీధిలో వెలగాల్సిందే వీధిదీపం**

నూతన కాలనీలు, బస్తీల్లో వీధిదీపాల సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వీధిలో వీధిదీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని లైట్లను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు.కొత్త కాలనీలకు మౌలిక వసతులు మరియు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు మంచినీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, యూజీడీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమం రూపొందించాలని, నిధుల కొరత ఏర్పడితే సీఎస్ఆర్ ద్వారా అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలకు నిధులు**

పటాన్చెరు, అమీన్పూర్ సర్కిళ్ల పరిధిలో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు.

**పింఛన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

చేయూత పింఛన్లకు సంబంధించిన అంశాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్.. మంచినీరు.. పరిశుభ్రత.. ప్రజలకు అత్యవసరమైన ఈ మూడు అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించినప్పుడే నిజమైన ప్రజాపాలన అందించినట్లు అవుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు జనార్ధన్, కుమార్ గౌడ్, ప్రమీల, సుష్మ, సుమలత, డిప్యూటీ కమిషనర్లు ప్రదీప్ కుమార్,

జ్యోతి రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డీఈ బాల గోపాల్, ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్లు వెంకట కిషన్, అజయ్ రెడ్డి, తాన్య, దశరథ్, నరేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డీఈలు కృష్ణవేణి, సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**చేవెళ్ల,ఆగస్టు18 (వుదయం)** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మొయినాబాద్‌లో మంగళవారం గౌడ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ (INTUC) ప్రధాన కార్యదర్శి భానూరి శివ శంకర్ గౌడ్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి సామాన్య ప్రజలు, బహుజన వర్గాలను ఏకం చేసి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన పోరాట వీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు.నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం కోసం పాపన్న ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ప్రజలకు శుభవార్త

- **సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (POPSK) ఏర్పాటు దిశగా అడుగులు వేయడం శుభపరిణామం**
- **యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టుశ్రీధర్**

**పటాన్చెరు (వుదయం):** సంగారెడ్డి ప్రధాన తపాలా కార్యాలయాన్ని ఆదర్శ తపాలా కార్యాలయంగా ఆధునీకరించడంతో పాటు ప్రత్యేక పార్సెల్ నిర్వహణ విభాగం మరియు పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ గారు స్పందించి, సంబంధిత శాఖకు పంపడం శుభపరిణామమని యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టుశ్రీధర్ అన్నారు.యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టుశ్రీధర్ సంయుక్తంగా మాట్లాడుతూ, సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్‌పై గతంలో ప్రజలు, విద్యార్థులు, యువత నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ గారికి, అలాగే ఈ అంశంపై చొరవ తీసుకున్న మెదక్ ఎంపీ శ్రీ రఘునందన్ రావు మాధవనేని గారికి యువజన సంఘాల సమితి తరపున మెట్టుశ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటైతే జిల్లాలోని విద్యార్థులు, విదేశాలకు వెళ్లే యువత, సాధారణ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గి స్థానికంగానే పాస్‌పోర్ట్ సేవలు పొందే అవకాశం కలుగుతుందని మెట్టు శ్రీధర్‌అన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు18 (వుదయం)** అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వైద్య కేంద్రంలోని వైద్య సేవలు, రోగుల నమోదు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, శుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అవసరమైన మందుల నిల్వ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సిబ్బంది సేవలు అందించాలని సూచించారు.

ఈ ఆకస్మిక తనిఖీలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE: RANGAREDDY DISTRICT AT LB NAGAR**

O.S.No. 500 of 2026

**Between :**

1. Irwin Rajeen Lall S/o Late P.S Lall, Aged about 72 Years, Occ: Retired, R/o Flat No. 102, Plot No. 969, Road No. 35, Defence Colony, Secunderabad, Telangana, 500094.
2. Sarah Sruti W/o Daniel Anandraj Samuel Garnipudi, Aged about 43 years, Occ: Pvt Employee,Permanent Address- Flat No. 102, Plot No. 969, Road No. 35, Defence Colony, Secunderabad, Telangana, 500094. Presently R/o 48, Coral Mist Apartments,12 North Mada Street, Srinagar Colony, Saidapet, Chennai, 600015.
3. Esther Preeti Lall Durowoju W/o Olatunde Amoo Durowoju,Aged about 41 years, Occ: Pvt employee R/o Flat No. 102, Plot No. 969, Road No. 35,Defence Colony, Secunderabad,Telangana, 500094. ...Plaintiffs

**AND**

1. Deputy Commissioner of the GHMC, Hayathnagar
2. The Tahsildar, RTC Supervisors Colony, Hayathnagar_Khalsa
3. All Concerned ...Defendants

This notice is for the above said defendant,

That the above Plaintiff no 1 to 3 have filed the above suit for suit for declaration of legal heirs for Late Vijayalakshmi Rajeen Lall who died on 18/11/2013, due to ill health, before this THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, RANGAREDDY DISTRICT AT LB NAGAR Thereafter this Hon'ble Court has directed for this public publication.

**SUIT SCHEDULE PROPERTY**

Plot Vide No. 542, in Survey No's 530, 531, 532, 524, 525, 540, 541, 542, 547, 537, 538, 529 and 539, admeasuring 311 Sq. Yards or 260.02 Sq. Mtrs., situated at Nadergul Village, Hayathnagar Taluk and Gram Panchayat, Rangareddy District, Bounded by: North: Plot No. 541 South: 25' Wide Road East: Plot No. 503 West: 25' Wide Road

Therefore, the General Public are hereby informed that if any person or persons have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on 01/09/2026 at 10.30 am through counsel or in person, failing which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)

**Sd/-**
**MUKESH AGARWAL,**
**Advocate**
**H. No. LIG- B- 86, Dr. A.S.Rao Nagar,**
**Medchal Malkajgiri District, 500062**
**Ph- 9100411204**




ఇదేం ప్రజాస్వామ్యం...?

"హైదరాబాద్‌లో బీఎల్‌ఓలు ఎవరి ఇంటికీ వెళ్లలేదు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉంది? కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుంది. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలి. రాష్ట్రంలో అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేసింది. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు వల్ల 2002 నాటి వివరాలు సరిగా లేవు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా?'"

**- మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు**

## వే'మన' పద్యం

**హీనగుణమువాని నిలుజేరనిచ్చిన**
**నెంతవానికైన నిడుము గలుగు**
**ఈఁగ కడుపు జొచ్చి యిట్టట్టు సేయదా**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

## ఎదిరించాల్సిందే.. తిరగబడాల్సిందే....

ఎక్కడైనా, ఎప్పుడైనా తిరుగుబాటు మీదటే స్వాతంత్ర్యం. ప్రాణ త్యాగాలతోనే స్వేచ్ఛ పొందగలిగామని చరిత్ర చెబుతున్న సత్యం. ఎందరో త్యాగధనులు జీవితాలను అర్పించి, పోరాటంలో బలిదానాలు చేసి సంపాదించినదే మన దేశ స్వాతంత్ర్యం. బ్రిటీష్‌వారిని తరిమికొట్టిన ఆ సమరం, మనందరికి స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని అందించిందా! అనుభవించటానికి అవకాశమిస్తున్నదా! అంటే, అందుకోసం నిరంతరంగా పోరుసల్పవలసే వస్తున్నది. ఎనభై ఏండ్లలోకి అడుగిడుతున్న స్వాతంత్ర్య దినోత్సవ ప్రకటన ఆనంద ప్రతీకగా ఎగురవేస్తున్న త్రివర్ణ పతాక సాక్షిగా మరోమారు స్వేచ్ఛ కోసం ప్రతినబూనాల్సి వస్తున్నది. 'క్విట్ ఇండియా' పిలుపుతో నాడు ఉద్యమించిన సమరవీరుల స్ఫూర్తితో కార్మిక, కర్షక జనం హక్కులకై జైళ్ళకు తరలాల్సి వస్తూనే ఉన్నది. ఎన్నో ఆశలతో ఆకాంక్షలతో సాధించుకున్న స్వరాజ్యాన సామాన్యుని జీవనం, ఇంకాదరిచేరని నావలాగే లాగబడుతున్నది.

ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అటుంచి, దేశ సార్వభౌమత్వము, స్వతంత్రత కూడా కోల్పోతున్న ఛాయలు కనపడుతున్నాయి. నాడు ప్రత్యక్షంగా ఆంగ్లేయులు మనపై ఆధిపత్యం వహించి దోచుకుంటే, నేడు మన పాలకులు అమెరికా కనుసన్నలలో మెలుగు తూ ఏది చెబితే అది విని దాసోహమంటున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో అగ్ర రాజ్యానికి దేశ సంపదను దోచిపెడుతున్నారు.

సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా నిలిచిన పోరాడిన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి భిన్నంగా అమెరికా దౌర్జన్య యుద్ధానికి, దాని మిత్ర నియంత రాజ్యాలకు మద్దతు తెలపటం ఎంత దిగజారుడుతనం. ఎక్కడ మనం చమురు కొనాలో, ఎంత పన్ను కట్టాలో, ఏమి కొనాలో కూడా వాళ్లు చెబుతుంటే, జీ హుజూర్ అంటూ వింటున్నాం. తలలూపుతున్నాం. ఇంతకన్న బానిసత్వమేమున్నది! ఇదంతా స్వాతంత్ర్య సమరంలో ఏ సంబంధంలేని వారసత్వం సాగిస్తున్న పాలనలో జరుగుతున్నది. అంతేకాదు, స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా నిలబడ్డ వాళ్ల వారసులు వెలగబెడుతున్న పాలన ఇది. మొన్న మొన్నటి వరకు వీళ్లకు త్రివర్ణ పతాకంపై నమ్మకం లేదు. ఎగరవేయనూలేదు. స్వతంత్ర రాజ్యాంగముపై కూడా విశ్వాసం లేదు. అట్లాంటి వాళ్లు దేశభక్తులమని చెబుతున్నారు. నిలదీసి, ప్రశ్నించి పోరాడి సాధించిన స్వాతంత్ర్య దేశాన, ప్రశ్నించడం నేరంగా దేశద్రోహంగా చూడబడుతున్నది. ఎన్ని నిర్బంధాలు, నిరంకుశత్వాలు ఎదురైనా ప్రశ్నించే స్వేచ్ఛను వదలుకోమని ఇటీవలి జెన్‌జీ ఉద్యమం నిరూపించింది. ఎనభై ఏండ్ల తర్వాత కూడా మన పిల్లలకు సరైన విద్యను ఇవ్వలేకపోయామన్న పరిశీలనే పాలకులకు లేకపోయింది. స్వాతంత్ర్యం ఏమిచ్చిందిమనకు అంటే, భావితరాలకు చదువుకునే సరైన బడిని ఇవ్వలేకపోయింది. చదివిన వాళ్లకు కొలువును ఇవ్వలేకపోతున్నది. విశ్వగురుత్వాన్ని నిర్వహిస్తున్నాననుకుంటున్న వారి పాలనలోనే 97 వేల పాఠశాలలు మూసివేసారు. వేలాది పాఠశాలలకు భవనాలే లేవు కానీ వేల కోట్లు ఖర్చు చేసి విగ్రహాలు పెడతారు. అందుకే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశానికి అన్నం పెడుతున్న రైతు ఇన్నేండ్లుగా అగచాట్లు పడుతూనే ఉన్నాడు. మరింత వారికి ఉరిబిగించే ప్రయత్నం చేస్తూనే ఉన్నది. ప్రభుత్వం నిత్యం చెమటను చిందించే కార్మికునికి కనీస భద్రత లేకుండా కొత్త చట్టాలను తెచ్చి మరింత అణచివేస్తున్నారు. వాళ్లు సృష్టించే సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు. సమాజాన సగభాగంగా ఉన్న మహిళ వివక్ష కొనసాగుతూనే ఉన్నది. దాడులు హింస మరింత పెరిగింది. ఆడవారిని బలహీనులుగా చూసే మనువాద ఆలోచనలు విస్తరిస్తున్నాయి. ఆదివాసీల సాంస్కృతిక జీవనాన్ని విధ్వంసమొనరించే చర్యలు ప్రభుత్వాలే చేపడుతున్నాయి. దళితులపై దాష్టీకాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించబడుతున్నాయి. పత్రికా స్వేచ్ఛ పాతాళానికి పడిపోయింది. పార్లమెంటులో చర్చలు లేవు. సమాధానాలు రావు. జవాబుదారీతనం లేదు. పేదలు మరింత పేదలవుతున్నారు. రెండు పూటలా తిండి దొరకడం లేదు. ఆరోగ్య భద్రతలేదు. ఆవాసాలు లేవు. ధరలు పెరుగుతున్నాయి. ఆదాయం తరుగుతోంది. రూపాయి విలువ పడిపోయింది. ఇన్ని అనర్థాలనటుంచి మధ్యయుగాల ఆలోచనలతో దశాబ్దాల వెనక్కి జారిపోతాం. ఇదా మన వీరుల త్యాగఫలం! ఇన్ని బాధలు, ఇన్నిన్ని సవాళ్ల దేశం, ప్రజలు ఎదుర్కొంటుంటే, పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి.

మనిషికీ మనిషికీ మధ్య మత గోడలు నిర్మిస్తున్నాయి. ఉన్మాదాన్ని ఉసిగొల్పుతున్నాయి. జనమిప్పుడు ఆలోచించాలి. మన అభివృద్ధికి మార్గమేమిటో, ఎలా ముందడుగేయాలో చైతన్యయుతంగా పరామర్శించుకోవాలి. ప్రశ్నను బలోపేతం చేయాలి. స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాడాలి. అప్పుడే స్వాతంత్ర్య ఉత్సవానికి సార్థకత.

## రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలు, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పలు భావాల సమాహారం ఫోటోగ్రఫీ

నాగరికంగా మనిషి ఎదగటం మొదలైన దశలో మానవుడికి తాను చూస్తున్న వాటిని వారసత్వ సంపదగా అందించాలనే కోరిక ఉండేది. కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫోటోగ్రఫీ. ఎక్కడో రాతి గుహల గోడల మీద సూర్యకాంతి పడిన చోట నల్లగా మారటం గమనించి, కొన్ని రసాయ నాలు వెలుతురు పడిన మేర నల్లటి ఆకృతిని ఏర్పరుస్తాయన్న విషయం అర్థంచేసుకుని క్రమంగా ఫోటోగ్రఫీ ఆవిర్భావానికి బీజం వేసాడు మానవుడు.

ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫోటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫోటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫోటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫోటోగ్రఫీ అంటారు.

రెండు గ్రీకు పదాల కలయికే ఫోటోగ్రఫీ. "ఫోటో అంటే చిత్రం", "గ్రఫీ అంటే గీయడం" అని అర్థం. ఫోటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు తెలుపులతో ప్రారంభమైన ఫోటోగ్రఫీ కాల క్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జే.ఎం.డాగ్యూరే 1837లో ఫోటోగ్రఫీ ప్రాసెస్‌ను కనుగొన్నారు. 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యురే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది. పూర్తి రూపం ఇచ్చి ఫోటోగ్రఫీ అనే ప్రక్రియను ప్రపంచానికి తెలియ జెప్పేందుకు ఆ తర్వాత మరో 280 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యలో ఎందరెందరో పరి శోధకులు ప్రయోగాత్మకంగా దృశ్యాన్ని లోహం మీద బంధించేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ చివరికి ఆ ఖ్యాతి దక్కింది ఎల్.జె.ఎల్.కు, 1837 ఫ్రెంచి ప్రభుత్వం అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ముందు డాగురే తాను కనుగొన్న ఒక కొత్త పరికరాన్ని ప్రదర్శించాడు. బయటవున్న చిత్రాన్ని ఒక నల్లటి ఫలకంపై ముద్రించి, ఆ పైన దానిని ప్రాసెస్' చేసి ఆ చిత్రాన్ని శాశ్వతంగా ప్రదర్శించ గలిగినదే ఆ ప్రక్రియ. అది జరిగింది జనవరి 9, 1839. ఆ అద్భుత మైన ఆవిష్కారానికి హక్కులు పరిశోధకుడికి ఇచ్చారు.




అయితే ఇది ఒక వ్యక్తి హక్కు కాకూడదని భావించిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆ పాటోగ్రఫీ పేటెంట్ తాను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహుమతిగా ప్రకటించిన తేదీ ఆగష్టు 19, 1839. అలా ప్రపంచమంతా ఫోటోలు తీసుకునే హక్కును పొందిన ఆ తేదీని ప్రపంచ పాటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటారు. తొలిరోజుల్లో ఫోటోలు తీయించుకొనేందుకు మనుషులు భయపడే వారంటే నమ్మగలరా! తొలినాటి కెమెరా ఫోటో కావాలంటే దాని ఎదురుగా మనిషి 45 నిమిషాలపాటు కదలకుండా కూర్చోవాలి. అయితే ఆ 'రాకాసీ' (కెమెరా) మనిషిలోని శక్తిని లాగేస్తుందని, ఫోటో తీయించుకుంటే జీవ శక్తి తగ్గిపోయి త్వరగా మరణిస్తారని భావించి నాడు ప్రజలు భయంతో దూరంగా సాగి పోయారు. ఫోటోలు తీయించుకుంటే ఆయుర్దాయం తగ్గుతుందనే నమ్మకం మన దేశంలోనూ చాలాకాలం ఉండేది. మనదేశంలో 1857 వరకు ఫోటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించేవారు. 1977 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్టమొదటిసారిగా లాలా దీనదయాళ్ ఫోటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫోటో లేని జీవితం ఊహించుకోలేం. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫోటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫోటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది.

అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి, అంతిమ యాత్ర వరకు ప్రతి దశ కెమెరాతో బంధించాల్సిందే. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ ఒక కెమెరా. సెల్ ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఫోటోగ్రాఫిలో నైపుణ్యం పొందుతున్నారు. ఫోటోగ్రాఫర్ తీసే ఫోటో చూస్తే కలిగే ఆనందం వేరు. నలుపు తెలుపు అయినా, సప్త వర్ణాలతో తీసింది అయినా మనసును తట్టి తీరుతుంది. అలా ఆవిర్భవించిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవానికి ఏయేటి కాయేడు ఆదరణ పెరుగుతోంది. ఎందరెందరో కెమెరాతో ట్రిక్కులు చేస్తున్నారు.

తమ సృజనను ప్రదర్శి స్తున్నారు. ప్రతి సంవత్సరపు ఫోటో గ్రాఫిక్ దినోత్సవం కొత్త కొత్తగా కొనసాగుతోంది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఏటా నిర్వహి స్తున్నారు.

ఉత్సవాల్లో భాగంగా ఫోటో ప్రదర్శనతో పాటు, ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో గెలుపొందిన వారికి అవార్డులను ప్రధానం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# స్వాతంత్ర్య ఫలాలు అందాయా?

స్వాతంత్ర్య దినోత్సవ వైభవం ముగిసింది. దేశం సాధించిన విజయాలను గర్వంగా స్మరించుకున్నాం. అయితే ఆ సంబరాల తర్వాత కూడా మన ముందున్న ఒక ప్రశ్నను విస్మరించలేం. అభివృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయి? స్వతంత్రం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో జీవించే అవకాశమూ దాని విస్తృత భావనలో భాగమే. ఇది ఏ ప్రభుత్వానికీ, ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకమైన ప్రశ్న కాదు. అభివృద్ధి, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే అంశంపై సమాజం చేసుకోవాల్సిన ఆత్మపరిశీలన. భారత రాజ్యాంగంలోని 48ఏ అధికరణం పర్యావరణం, అడవులు, వన్యప్రాణుల పరిరక్షణకు రాష్ట్రం కృషి చేయాలని సూచిస్తే, 51ఏ(జి) అధికరణం ప్రకృతి పట్ల కరుణతో వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా పేర్కొంటుంది. న్యాయ వ్యవస్థ కూడా జీవించే హక్కును



ఆరోగ్యకరమైన పర్యావరణంతో అనుసంధానిస్తూ వచ్చిన నేపథ్యంలో, అభివృద్ధిని కేవలం ఆర్థిక గణాంకాలతో కాకుండా పౌరుడు పీల్చే గాలి, తాగే నీరు, పిల్లలు పెరిగే పరిసరాలు, నగరాల్లో పచ్చదనం వంటి అంశాలతోనూ అంచనా వేయాల్సిన అవసరం ఉంది.

**అభివృద్ధి వేగం.. పర్యావరణంపై ఒత్తిడి!**

ప్రజాస్వామ్యంలో రాజకీయ చర్చ అనివార్యం. ఎన్నికలు, విధానాలు, అధికార-ప్రతిపక్ష వాదనలు ప్రజా జీవితంలో సహజమైన భాగాలే. అయితే డిజిటల్ వేదికలపై ఏ అంశం ఎంత వేగంగా వైరల్ అవుతుందో, అదే అంశం ప్రజా చర్చలో ఎంతకాలం నిలుస్తుందో కూడా మారుతోంది. రాజకీయ అంశాలు తక్షణ దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో గాలి, నీరు, అడవులు, వాతావరణ మార్పు, ప్రజారోగ్యం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెనుకబడే అవకాశం ఉంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్ 2026లో భారత్‌కు సంబంధించిన సర్వేలో వార్తలపై విశ్వాసం 39 శాతంగా నమోదైందని, ఆన్‌లైన్‌లో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై ఆందోళన వ్యక్తం చేసిన వారి వాటా 58 శాతంగా ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాలను పూర్తిగా ప్రతికూలంగా చూడటం కూడా సరైంది కాదు. అవే వేదికలు పర్యావరణ అవగాహన, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, స్థానిక సమస్యలకు ప్రజా దృష్టి తీసుకురావడంలో ఉపయోగపడుతున్నాయి. అసలు అవసరం వైరల్ సమాచారాన్ని వెంటనే నిజమని నమ్మడం కాదు. మూలాలను పరిశీలించడం, శాస్త్రీయ ఆధారాలను గౌరవించడం, ధృవీకరించిన సమాచారాన్నే ముందుకు తీసుకెళ్లడం. దేశంలో రహదారులు, పరిశ్రమలు, పట్టణాలు, డిజిటల్ సేవలు విస్తరిస్తున్న కొద్దీ వాటి పర్యావరణ ప్రభావాలను ముందుగానే అంచనా వేసి తగ్గించడం కూడా అవసరం.

# ఈ బెదిరింపులు ఇంకెంతకాలం?

రష్యాపట్ల పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న అర్థం లేని శత్రుత్వ వైఖరికి ఇప్పటికే అటు ఉక్రెయిన్, ఇటు రష్యా చాలా మూల్యాన్ని చెల్లించాయి. ఇంకా చెల్లిస్తూనేవున్నాయి. ఇన్ని ప్రాణాలను బలి తీసుకోవడం సబబేనా అన్న సవాలు ఎదురైనప్పుడు సమర్థించుకోవడానికి ఈ దేశాలు రష్యా దురాక్రమణ వ్యూహాన్ని తిప్పికొట్టవలసిన అవసరం ఉందంటూ సాకు చూపుతున్నాయి. కానీ అటువంటి ఆరోపణకు ఎటువంటి ఆధారాలూ లేవు. ఈ యుద్ధం వెనుక పశ్చిమ దేశాల వ్యూహం ఒక్కటే. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత రష్యాలో అపారంగా ఉన్న సహజ వనరులను కొల్లగొట్టడమే ఆ వ్యూహం. వ్లాదిమిర్ పుతిన్ అధికారం చేపట్టాక అటువంటి ఎత్తులు పని చేయడం లేదు. అందుకే ఈ విధంగా ఉక్రెయిన్ ను ఎగదోసి యుద్ధానికి పురికొల్పాయి సామ్రాజ్యవాద దేశాలు.

ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపించి రష్యా కు వ్యతిరేకంగా అమెరికా ఏకపక్షంగా ఆంక్షలు ప్రకటించింది. రష్యా నుండి ఏ దేశమైనా గనుక చమురును కొనుగోలు చేస్తే ఆ దేశం మీద 100 శాతం వరకూ అపరాధ సుంకాన్ని విధించేందుకు అమెరికన్ ప్రభుత్వానికి అధికారం ఇస్తూ తాజాగా ఆగస్టు 7 న అమెరికన్ సెనేట్ ఒక తీర్మానాన్ని చేసింది. దానికి అనుకూలంగా 86, వ్యతిరేకంగా 11 ఓట్లు పడ్డాయి. రష్యా నుండి ప్రస్తుతం చమురును గణనీయమైన పరిమాణంలో కొనుగోలు చేస్తున్న అయిదు దేశాలను ఈ తీర్మానం తన లక్ష్యంగా చేసుకుంది. ఆ దేశాలు ఇవిఇండియా, చైనా, హంగేరీ, స్లోవాకియా, అజర్‌బైజాన్. ఉక్రెయిన్ మీద సాగిస్తున్న యుద్ధానికి కావలసిన ధనాన్ని ఈ చమురు

అమ్మకాల ద్వారా రష్యా సమకూర్చుకుంటోందని, అందుచేత అక్కడినుంచి చమురు కొనుగోలు చేయడం అంటే రష్యా పై తాము విధించిన ఆంక్షలను ఉల్లంఘించడమేనని అమెరి కన్ ప్రభుత్వం వాదిస్తోంది.

ఈ మధ్య కాలంలో ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా మరింత ఎక్కువగా కూరుకుపోయింది. అందుకే ఉక్రెయిన్ బరితెగింపు మరింత ఎక్కువైంది. ఈ మధ్య రష్యన్ భూభాగంలోకి బాగా చొచ్చుకునిపోయి ఉక్రెయిన్ విమానాలు దాడులు చేయగలుగుతున్నాయంటే దానికి కారణం అమెరికన్ గూఢచర్యం ద్వారా అది చాలా ముఖ్యమైన సమాచారాన్ని పొందగలగడమే. యూరప్ దేశాల శత్రుపూరిత వైఖరి కూడా ఏమాత్రమూ తగ్గలేదు. జర్మనీ ఈ మధ్య తన సైనిక వ్యయాన్ని బాగా పెంచడం కూడా తోడైంది. ఈ కారణాల రీత్యా, ఉక్రెయిన్ యుద్ధం మరింత ఎక్కువగా కొనసాగుతోంది. ఈ యుద్ధం అణుయుద్ధంగా పరిణమించే ప్రమాదం కూడా పెరిగింది.

రష్యాపట్ల పశ్చి మ దేశాలు అనుసరిస్తున్న అర్థం లేని శత్రుత్వ వైఖరికి ఇప్పటికే అటు ఉక్రెయిన్, ఇటు రష్యా చాలా మూల్యాన్ని చెల్లించాయి. ఇంకా చెల్లిస్తూనేవున్నాయి. ఇన్ని ప్రాణాలను బలి తీసుకోవడం సబబేనా అన్న సవాలు ఎదురైనప్పుడు సమర్థించుకోవడానికి ఈ దేశాలు రష్యా దురాక్రమణ వ్యూహాన్ని తిప్పికొట్టవలసిన అవసరం ఉందంటూ సాకు చూపుతున్నాయి. కానీ అటువంటి ఆరోపణకు ఎటువంటి ఆధారాలూ లేవు. ఈ యుద్ధం వెనుక పశ్చిమ దేశాల వ్యూహం ఒక్కటే. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత రష్యాలో అపారంగా ఉన్న సహజ వనరులను కొల్లగొట్టడమే ఆ వ్యూహం. వ్లాదిమిర్ పుతిన్ అధికారం చేపట్టాక అటువంటి ఎత్తులు పని చేయడం లేదు. అందుకే ఈ విధంగా ఉక్రెయిన్ ను ఎగదోసి యుద్ధానికి పురికొల్పాయి సామ్రాజ్యవాద దేశాలు.

ఇలా ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతూనేవుంది, పశ్చిమ దేశాలు రష్యాపై ఏకపక్షంగా ఆంక్షలను విధిస్తూనేవున్నాయి. కానీ అవే దేశాలు అదే రష్యా నుంచి సహజ వనరులను కొనుగోలు చేస్తూనేవున్నాయి. అమెరికా అనుసరిస్తున్న వైఖరి లో నిజాయితీ లేనితనం బలంగా కనిపిస్తోంది. రష్యా నుండి కొనుగోళ్ళు చేయవద్దంటూ ఇండియాను, తక్కిన దేశాలను ఒత్తిడి చేస్తూనే, మరోవైపు అమెరికాయే స్వయంగా రష్యా నుండి దిగుమతులను కొనసాగిస్తోంది. 2021 నాటికి అమెరికా రష్యా నుండి 1700 కోట్ల డాలర్ల ముడిచమురును దిగుమతి చేసుకునేది. దానిని తర్వాత నిలిపివేసిన మాట వాస్తవమే. కానీ ఇప్పటికీ రష్యా నుండి కొన్ని కీలక సరుకులను దిగుమతి చేసుకుంటూనేవుంది. ఆ దిగుమతులు తగ్గుతున్నది కూడా ఏమీ లేదు. వాస్తవానికి 2021 తర్వాత రష్యా నుండి ఎరువులు, పల్లాడియం, యురేనియం అనే మూడు ముఖ్యమైన సరుకుల దిగుమతి పెరిగింది. అమెరికా రష్యా నుండి దిగుమతి చేసుకునే మొత్తం సరుకుల్లో ఈ మూడూ దాదాపు 90 శాతం ఉంటాయి. డొనాల్డ్ ట్రంప్ " అమెరికా రష్యాతో ఎటువంటి వ్యాపారమూ చేయడం లేదు" అని చేసిన ప్రకటన కు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది.

ఉక్రెయిన్ యుద్ధం ఒకపక్క కొనసాగుతున్నప్పుడే అమెరికా తన చమురు వ్యాపారాన్ని విస్తరించాలని ప్రయత్నిస్తోంది. ఇదే అమెరికా వాస్తవ వ్యూహం. అదే సమయంలో రష్యా నుండి తనకు అవసరమైన సరుకులను దిగుమతి చేసుకుంటూనేవుంది. ఇంకా రష్యన్ భూ భాగంలో ఉన్న సహజ వనరులను ఎలాగైనా కొల్లగొట్టాలన్న ప్రయత్నాలనూ కొనసాగిస్తోంది. అక్కడ ఉన్న చమురు, సహజ వాయువుల నిల్వల మీద కూడా అమెరికా కన్ను వేసింది.

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం కన్నా అమెరికా నుంచి కొనుగోలు చేయడం ఇండియా వంటి దేశానికి పెను భారంగా ఉంటుంది. ప్రస్తుతం తాను ఎదుర్కొంటున్న ఆంక్షలను తట్టుకోడానికి రష్యా చమురు మీద డిస్కౌంట్ ఇస్తోంది. అటువంటి డిస్కౌంట్ ఏదీ లేని సాధారణ పరిస్థితుల్లో కూడా రష్యా నుంచి కొనే బదులు అమెరికా నుండి చమురు కొనుగోలు చేయడం వల్ల మన దేశం మీద ఏటా 900 నుండి 1200 కోట్ల డాలర్ల మేరకు అంటే దాదాపు 1,15,000 కోట్ల రూపాయల మేరకు అదనంగా భారం పడుతుంది. నిజానికి ఇండియా ఇటీవలిదాకా తన చమురు కొనుగోళ్లలో 35 నుండి 40 శాతం దాకా రష్యా నుండి కొనుగోలు చేసింది. అంతర్జాతీయ ధరల కన్నా తక్కువకే రష్యా అమ్మజూపడం వల్ల మన దేశం 1700 కోట్ల డాలర్ల మేరకు విలువైన విదేశీ మారక ద్రవ్యం ఆదా అయింది. ఇప్పుడు అమెరికా బెదిరింపులకు లొంగితే మన దేశం చాలా ఎక్కువ ధరకు అమెరికన్ చమురును కొనవలసివస్తుంది. యుద్ధం కారణంగా రష్యా డిస్కౌంట్ కు అమ్మజూపుతున్నప్పుడు ఆ దేశం నుండి కొనుగోలు నిలిపివేయడం మనకు మరింత భారం కానుంది. ఈ డిస్కౌంట్ ద్వారా నిజానికి రష్యా అమెరికన్ ఆంక్షలను ఎదుర్కొంటూనే తన చమురు మార్కెట్ ను పెంచుకోగలిగింది. దానిని కట్టడి చేయడం అమెరికా లక్ష్యం. అందుకోసం ఇతర దేశాలకు నష్టం వాటిల్లినా అది పట్టించుకోదు.

రష్యన్ చమురు కొనుగోలు నిలిపివేస్తే భారతదేశంలో అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. మొదటి కారణం చమురు దిగుమతి ఖరీదు పెరగడం, దానిని వినియోగదారులమీద మోపడం వల్ల పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణాన్ని పెంచడం జరుగుతుంది. రెండవ కారణం చమురు కొనుగోలుకు వెచ్చించవలసిన విదేశీ మారకద్రవ్యం పెరుగుతుంది. ఎక్కువ మొత్తంలో డాలర్లు బైటకు పోతాయి. అప్పుడు రూపాయి మారకపు విలువ డాలర్ తో పోల్చితే మరింత తగ్గుతుంది. అప్పుడు ఇతర దిగుమతుల ధరలు మరింత పెరుగుతాయి. ఈ ద్రవ్యోల్బణాన్ని నివారించడానికి ప్రభుత్వం చమురు ధరల అదనపు భారాన్ని సబ్సిడీ ద్వారా తానే భరించవచ్చు. కానీ అప్పుడు ఇతర పద్దులమీద ప్రభుత్వం చేసే ఖర్చు తగ్గిపోతుంది. ప్రజల కొనుగోలు శక్తి మీద మరో రూపంలో దాడికి అది దారి తీస్తుంది. అదే విధంగా అమెరికన్ చమురు కొనుగోలు కోసం ప్రభుత్వం తనవద్ద ఉన్న విదేశీ మారక నిల్వలనుండి ఖర్చు చేయవచ్చు. కానీ అది రూపాయి మారకపు విలువ భవిష్యత్తు లో మరింత పడిపోనుంది అన్న స్పెక్యులేషన్ కు దారి తీసి సమస్యలు సృష్టించవచ్చు. ఎలా చూసినా రష్యా నుండి కొనుగోలు మానేసి అమెరికా నుండి కొనుగోలు చేయడం మన దేశ ప్రజలకు భారంగా మారుతుంది. ఎలాగైనా సరే రష్యాలోని సహజవనరుల మీద పెత్తనం సంపాదించాలనే అమెరికా వ్యూహం అటు ఉక్రెయిన్, రష్యా దేశాల్లో వేలాది మంది ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఇటు అదే సమయంలో కోట్లాది భారత ప్రజల బ్రతుకులనూ భారంగా మారుస్తోంది.

అమెరికాఇజ్రాయిల్ ద్వయం ఇరాన్ మీద యుద్ధంలో మునిగివున్నప్పుడు హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా నిలిపివేయబడింది. దాని వల్ల చమురు రవాణా ఖర్చు బాగా పెరిగి ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, మాంద్యం ఆవరించే ముప్పు ఏర్పడింది. అప్పుడు అమెరికా రష్యా మీద ఆంక్షలను సడలించి ఆ దేశం నుండి చమురు కొనుగోళ్ళకు ఇతర దేశాలను అనుమతించింది. అంటే ఏ దేశం ఎవరినుంచి ఎప్పుడు ఏది కొనుగోలు చేయాలో నిర్ణయించే అధికారాన్ని అమెరికా తనకు తాను ఆపాదించుకుని పెత్తనం చేయాలని చూస్తోంది. తనకు ఏది సౌకర్యంగా ఉంటుందో అదే ఇతర దేశాలన్నీ అనుసరించాలనే ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోంది.

అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టడానికి చైనా సరైన విధానాన్ని అనుసరించింది. చైనా మీద అధిక సుంకాలను విధిస్తానని ట్రంప్ బెదిరించినప్పుడు చైనా నుండి అమెరికా కు ఎగుమతయే 'అరుదైన ఖనిజాల' విషయంలో చాలా నిబంధనలను విధించి వాటి ఎగుమతులను కట్టడి చేసింది. ఈ 'అరుదైన ఖనిజాల' మార్కెట్ లో చైనా దాదాపు గుత్తాధిపత్యం సాధించింది. దాంతో అమెరికా దిగివచ్చి చైనాతో ఒక అవగాహన కుదుర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూడా చైనా అటువంటి ఎత్తుగడలనే చేపట్టే అవకాశం ఉంది. ఇండియా కూడా అదే మాదిరిగా అమెరికా ఒత్తిడి ని తిప్పికొట్టే విధానాన్ని అనుసరించడం ఇప్పుడు అవసరం. అయితే, అమెరికాకు చైనా మాదిరిగా ఎగుమతి చేసే సరుకుల విషయంలో ఇండియాకు ఎటువంటి అవకాశమూ లేదు.

కానీ ఇప్పుడు ఇండియాఅమెరికా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ట్రంప్ ఏకపక్షంగా గతంలో ప్రకటించిన సుంకాలు చెల్లవంటూ అమెరికన్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ సారి కుదిరే ఒప్పందం అసమాన ఒప్పందంగా ఉండకూడదు. ముఖ్యంగా మన వ్యవసాయ రంగానికి ముప్పుగా పరిణమించే ఎటువంటి అంశాలూ ఆ ఒప్పందంలో ఉండకూడదు. అమెరికన్ రైతులకు అక్కడి ప్రభుత్వం భారీగా ఇచ్చే సబ్సిడీల వల్ల అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడికి తెచ్చి చౌకగా అమ్మవచ్చు. ఆ పోటీకి మన రైతులు తట్టుకుని నిలవలేరు. మన ప్రభుత్వం వారికి ఇచ్చే సబ్సిడీలను ఇప్పుడు నిరాకరిస్తోంది. ఈ పరిస్థితిలో మనం వాణిజ్య ఒప్పందం మీద చర్చలు జరిపేటప్పుడు దేశీయ వ్యవసాయ రంగాన్ని కాపాడుకుంటూ, అసమాన షరతులు లేని విధంగా ఒప్పందం ఉండేట్టు చూడాలి. అదే సమయంలో ఈ చర్చలు జరుపుతూ మరోపక్క ఏకపక్షంగా మనమీద ఆంక్షలు విధించడాన్ని ఎదిరించాలి. ఎటువంటి ఆంక్షలూ లేని నేపథ్యంలో మాత్రమే వాణిజ్య చర్చలు జరగాలని పట్టుబట్టాలి. రష్యా నుంచి చమురు కొనుగోళ్ళను యథాతథంగా కొనసాగించాలి.

ఇరాన్ మీద జరుగుతున్న దాడి, దానిని ఇరాన్ ప్రతిఘటిస్తున్న తీరు చూస్తే అమెరికన్ ప్రభుత్వపు పరిమితులేమిటో మనకు స్పష్టం అవుతోంది. ఇటువంటి పరిస్థితిలో కూడా ఇండియా అమెరికాను ఎదిరించి దేశ ప్రయోజనాల కోసం నిలబడలేకపోతే, సామ్రాజ్యవాద ఒత్తిళ్ళకు తలొగ్గితే అంతకన్నా విషాదం మరొకటి ఉండదు.

**రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం కన్నా అమెరికా నుంచి కొనుగోలు చేయడం ఇండియా వంటి దేశానికి పెను భారంగా ఉంటుంది. ప్రస్తుతం తాను ఎదుర్కొంటున్న ఆంక్షలను తట్టుకోడానికి రష్యా చమురు మీద డిస్కౌంట్ ఇస్తోంది. అటువంటి డిస్కౌంట్ ఏదీ లేని సాధారణ పరిస్థితుల్లో కూడా రష్యా నుంచి కొనే బదులు అమెరికా నుండి చమురు కొనుగోలు చేయడం వల్ల మన దేశం మీద ఏటా 900 నుండి 1200 కోట్ల డాలర్ల మేరకు - అంటే దాదాపు 1,15,000 కోట్ల రూపాయల మేరకు అదనంగా రష్యా నుండి కొనుగోలు చేసింది.**




## కు(క)మిలి పోతున్నా..!

**నువ్వు గులాబీ అయితే..**
**నేను తెంపి చేజిక్కించుకుంటా**
**నువ్వు సమాధానం అయితే..**
**నేను ప్రశ్నను అవుతా**
**నాకు తాగే అలవాటు లేకపోయినా..**
**నువ్వు సారా అయితే నే**
**తాగుబోతునవుతా !**

**గుండెల నిండా కన్నీళ్లు నింపుకొని..**
**పెదాలపై నవ్వులను అలంకరించి..**
**నీ ప్రేమ పుస్తకంలో..**
**నాకు ఒక్క పేజీ ఇవ్వకపోయినా..**
**నీ కోసం నేను ప్రేమ దీవానా అవుతా !**

**నీ ఫోటో నేటికీ నవ్వుల్ని**
**వెదజల్లుతోంది..**
**నీ జ్ఞాపకాల సెగకు క(కు)**
**మిలిపోతున్నా..**
**కన్నీరు పెట్టనిదే రాత్రి గడవడం లేదు..**
**ప్రేమ ఎంత మధురమే కదా..**
**విరహం సదా పుచ్చోడిని చేస్తుంది !**

**నిన్ను పొందడమనేదే నా ఏకైక లక్ష్యం**
**నాకు మరే కోరిక లేనే లేదు**
**నావల్ల నీకు ఏ తప్పు జరగదు**
**నీకు ఇంత అందాన్ని అద్ది..**
**ఆ దేవుడే చేసాడు ఓ పెద్ద తప్పు !**



మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## 17 మందికి అర్జున అవార్డులు



- ప్రకటించిన కేంద్రం
- ఈసారి ఖేల్ రత్న లేనే లేదు
- అరుమినాయకంకు 'జీవిత సాఫల్య' పురస్కారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఎ.ఎం.ఎస్) :** దేశంలోని అత్యుత్తమ క్రీడాకారులకు ఇచ్చే అత్యున్నత పురస్కారాలలో ఒకటైన అర్జున అవార్డులను కేంద్రం మంగళవారం ప్రకటించింది. ప్రపంచ కప్ విజేత చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్, డెకాథ్లాన్ క్రీడాకారుడు తేజస్విన్ శంకర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గాయత్రి గోపీచంద్, మలయాళీ క్రీడాకారిణులు మహమ్మద్ అఫ్జల్, థెరిసా జాలీలతో సహా 17 మంది క్రీడాకారులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు.

జాతీయ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. థెరిసా జాలీ బ్యాడ్మింటన్ డబుల్స్ భాగస్వామి గాయత్రి గోపీచంద్ కూడా అర్జున అవార్డును గెలుచుకున్నారు. ఈసారి ఖేల్ రత్న పురస్కారాన్ని ఎవరికీ ఇవ్వలేదు. అవార్డు గ్రహీతలలో ప్రఖ్యాత చెస్ గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ, గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత బాక్సర్ నరేంద్ర, చెవిటి రైఫిల్ షూటర్ ధనుష్ శ్రీకాంత్ ఉన్నారు. అదనంగా, 1962 ఆసియా క్రీడలలో స్వర్ణ పతక విజేత అయిన మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఐ. అరుమినాయకం, క్రీడలకు చేసిన విశేష సేవలకు గాను 'జీవిత సాఫల్య' విభాగంలో అర్జున అవార్డుతో సత్కరించనున్నారు. క్రీడలు, ఆటలలో విశేష సేవలందించిన కోచ్‌లు పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్), ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్), నేహా నంద్‌కుమార్ చవాన్ (షూటింగ్)లకు 'ద్రోణాచార్య అవార్డు' లభించింది. జార్జియాలోని బటుమిలో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ద్వారా దివ్య దేశ్‌ముఖ్ భారతదేశపు నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచారు. కామన్వెల్త్ గేమ్స్‌లో డెకాథ్లాన్‌లో కాంస్య పతకం సాధించిన తొలి భారతీయుడిగా నిలిచినందుకు తేజస్విన్ శంకర్ ఈ అవార్డును గెలుచుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వారి అత్యుత్తమ ప్రదర్శనలకు గుర్తింపుగా భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ థెరిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 2025 సంవత్సరపు 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం' పుణెలోని 'ఆర్మీ పారాలింపిక్ నోడ్'కు ప్రదానం చేశారు. క్రీడల ప్రోత్సాహం, అభివృద్ధి రంగంలో విశేష కృషి చేసిన కార్పొరేట్ సంస్థలకు (ప్రభుత్వ లేదా ప్రైవేట్), స్వచ్ఛంద సంస్థలకు (NGOలు) ఈ పురస్కారాన్ని అందజేస్తారు. అవార్డు అందుకోనున్న క్రీడాకారుల జాబితా : తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), మహమ్మద్ అజ్మల్ వరియాతోడి (అథ్లెటిక్స్), ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), ట్రీసా జాలీ (బ్యాడ్మింటన్), గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్), నరేందర్ (బాక్సింగ్), విదిత్ సంతోష్ గుజరాతీ (చెస్) , దివ్య జితేంద్ర దేశ్‌ముఖ్ (చెస్) ధనుష్ శ్రీకాంత్ (డెఫ్ షూటింగ్) , లాల్‌రెమ్ సియామి (హాకీ), రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్ (కబడ్డీ), పూజ (కబడ్డీ), రుద్రాంశ్ ఖండేల్‌వాల్ (పారాషూటింగ్), ఏక్తా భయన్ (పారాషూటింగ్), అరవింద్ సింగ్ (రోయింగ్) మరియు అఖిల్ షెరాన్ (షూటింగ్)

## టెన్షన్.. టెన్షన్...

- ఏ నిమిషానికి ఏమి జరుగునో...
- ముగిసిన కాల్పుల విరమణ ఒప్పందం
- పొడిగింపు ప్రశ్నే లేదు... విజయం మాదే : ఇరాన్
- తాజా శాంతి చర్చలపై అనుమానాలు



**టెహ్రాన్, ఆగస్టు 18 :** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించే ఉద్దేశంతో అమెరికాఇరాన్ మధ్య కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం (ఇస్లామాబాద్ ఎంఓయూ) గడువు సోమవారం ముగిసింది. ఒప్పందాన్ని పొడిగించేందుకు చర్చలేవీ జరగడం లేదని ఇరాన్ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. యుద్ధాన్ని అన్ని రకాలుగా ముగించేందుకు, సైనిక చర్యలను తక్షణమే శాశ్వతంగా నిలిపివేసేందుకు ఉద్దేశించిన అవగాహనా ఒప్పందంపై జూన్‌లో అమెరికా, ఇరాన్ సంతకాలు చేసిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి ఒప్పందం మనుగడ ప్రతి రోజూ దినదిన గండంగానే గడిచింది. గత నెల 7వ తేదీన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రకటన చేస్తూ ఒప్పందం ముగిసిందని ప్రకటించారు. మరోవైపు ఎంఓయూలో ఇచ్చిన హామీలను అమెరికా పదే పదే ఉల్లంఘిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. తాత్కాలిక ఒప్పందం కుదిరిన 48 గంటల లోనే అమెరికా దానిని ఉల్లంఘిం చిందని, ఆ తర్వాత కొద్ది రోజులకే ఒప్పందం నుంచి వైదొలిగిందని ఇరాన్ వర్గాలు తెలియ జేశాయి. అందుకే ఒప్పందం పొడిగింపుపై చర్చలు జరపడం లేదని చెప్పాయి.

కాల్పుల విరమణను పొడిగించే ప్రశ్నే లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఎంఓయూను ఉల్లంఘిస్తున్న అమెరికా తమ పై దాడులు చేస్తూనే ఉన్నదని ఆరోపించారు. తుది ఒ ప్పందంపై చర్చలకు అవకాశం కల్పించేందుకే ఎంఓయూను కుదుర్చుకున్నాం తప్ప దానిని కాల్పుల విరమణకు గడువుగా భావించలేదని చెప్పారు. కాగా ఇరాన్ ఇటీవల తన జాతీయ భద్రతా యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసింది. భవిష్యత్తులో జరిగే చర్చలకు ఇరాన్ అనుసరించబోయే కఠిన వైఖరిని ఇది సూచిక అని పరిశీలకులు తెలిపారు. అమెరికాతో రాజీ పడేందుకు ఇరాన్ ఏ మాత్రం సుముఖంగా లేదు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి విషయంలో తన పట్టు వీడడం లేదు.

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలపై తాము పూర్తి విజయం సాధించామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ తెలిపారు. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించే సమయంలో తాము నిర్దేశించుకున్న తొమ్మిది లక్ష్యాలలో ఏ ఒక్క దానినీ ఆ దేశాలు సాధించలేకపోయాయని ఎద్దేవా చేశారు. సైనిక, రాజకీయ కోణాలలో తమదే విజయమని చెప్పారు. అయితే దీనర్థం అమెరికా లేదా ఇజ్రాయిల్ సేనలను భౌతికంగా నిర్మూలించినట్లు కాదని వివరణ ఇచ్చారు. 'అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు నిర్దిష్ట, స్పష్టమైన లక్ష్యాలతో మాపై దాడి చేశాయి. ఆ లక్ష్యాలను వారు అధికారికంగా ప్రకటించారు. లిఖితపూర్వకంగా తెలియజేశారు. అయితే ఏ స్థాయిలోనూ వాటిని సాధించలేకపోయారు. ఇది అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు అతి పెద్ద, ఘోర పరాజయం' అని వివరించారు. ఇదిలావుండగా అమెరికాఇజ్రాయిల్ సేనలను పూర్తిగా ఓడిస్తామని, మధ్యప్రాచ్యంలో శత్రువులు పూర్తిగా మట్టికరిచే వరకూ వెనుదిరిగే ప్రశ్నే లేదని ఇరాన్ సైన్యం ప్రకటించింది. 1980 1988 మధ్య ఇరాన్, ఇరాక్ మధ్య యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 1990 ఆగస్ట్ 17వ తేదీ నుంచి ఇరాన్ యుద్ధ ఖైదీలు ఇరాక్ నుంచి స్వదేశానికి రావడం ప్రారంభమైంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఇరాన్ సైనిక దళాల జనరల్ స్టాఫ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ 'నాడు ప్రపంచంలో అత్యంత భారీ ఆయుధాలను కలిగిన సేనలకు వ్యతిరేకంగా నిలబడిన ప్రతిఘటన వారసత్వాన్ని కొత్త తరం ఇరానీయులకు అందిస్తున్నాం' అని తెలిపింది. శత్రువు పూర్తిగా లంగిపోయే వరకూ దేశం యొక్క చట్టబద్ధమైన హక్కులు, నాయకత్వ డిమాండ్లను ఇరాన్ కొనసాగిస్తుందని చెప్పింది. ఇరాన్ సాయుధ దళాలకు లభిస్తున్న ప్రజా మద్దతును ప్రశంసించింది. మధ్యప్రాచ్యంలో అమెరికా దురాక్రమణలకు పాల్పడుతోందని విమర్శిస్తూ దాని ఆధిపత్య ధోరణిని దుయ్యబట్టింది.

## ఉత్తరాఖండ్‌లో టన్నెల్ ప్రమాదం



- ఏడుగురు కార్మికులు మరణం
- 14 మందికి గాయాలు

**డెహ్రాడూన్, ఆగస్టు 18 (ఎ.ఎం.ఎస్) :** ఉత్తరాఖండ్ చమోలి జిల్లాలో గురువారం హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లోకి ఒక్కసారిగా భారీగా వర్షం నీరు చేరడంతో శిథిలాలు కూప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు మృతి చెందారు.

ఘటన సమయంలో ప్రాజెక్టు ప్రాంతంలో 22 మంది పనిచేస్తుండగా, 14 మంది గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు శిథిలాలను తొలగిస్తూ చిక్కుకున్న కార్మికుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

తాజాగా టెన్నెల్ లో మంగళవారం సహాయక చర్యలు, గాలింపు చర్యలు ముగిశాయి. ప్రమాద సమయంలో గల్లంతు అయిన ఇద్దరి కార్మికుల ఆచూకీ లభ్యమైందని విపత్తు దళాల ఇంచార్జీ కరన్ సింగ్ తెలియజేశారు. దీంతో గాలింపు చర్యలను నిలిపివేసినట్లు మంగళవారం ఆయన మీడియాకు తెలియజేశారు. ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య 10కి చేరిందన్నారు. ఈ ఘటనలో 12 మంది కార్మికులు గాయపడగా, వారిలో ఇద్దరు చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని తెలియజేశారు.

## పారిశుధ్య కార్మికుడు దారుణ హత్య

- తూర్పు ఢిల్లీలో ఉద్రిక్తత



**న్యూఢిల్లీ, ఆగస్టు 18 :** తూర్పు ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. కళ్యాణ్‌పురిలో ఓ పారిశుధ్య కార్మికుడు దారుణ హత్యకు గురైయ్యాడు. దీంతో ఆగ్రహించిన తోటి కార్మికులు జాతీయ రహదారిపై ఆందోళన బాట పట్టారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన కార్మికులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఉపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆందోళనకారులను అదుపు చేయడానికి భారీగా పారామిలిటరీ బలగాలు మోహరించాయి. వారి ఆందోళనలకు మద్దతుగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆయనను పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. కల్యాణ్‌పురిలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ లో అనిల్ కుమార్ అనే పారిశుధ్య కార్మికుడు విధులు నిర్వహిస్తున్నాడు. డ్యూటీలో ఉండగానే నిహాల్ అనే వ్యక్తి అతనిపై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలియజేశారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. వ్యక్తిగత కక్ష కారణంగానే నిందితుడు ఈ నేరానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు.

## ఎన్టీయేలో 50 మందికి పైగా సిబ్బందిపై వేటు



- నీట్ పేపర్ లీకేజీ ఫలితం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీక్ లతో గుణపాఠం నేర్వని ఎన్టీఏ నీట్ యూజీ 2026 పేపర్ ప్రశ్నాపత్రంలో తీవ్ర నిర్లక్ష్యం బయటపడింది. ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులలో తప్పులు దొర్లాయంటూ పలువురి నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో సర్వత్ర విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో 50 మందికి పైగా సిబ్బందిని తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వీటిలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, టెస్ట్ సెక్యూరిటీ జనరల్ మేనేజర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ సైకోమెట్రిక్స్ జనరల్ మేనేజర్ వంటి పోస్టులు ఉండనున్నాయి. సైబర్‌సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్ర రూపకల్పన, ఇతర ప్రత్యేక రంగాల కోసం ఎన్టీయే ప్రైవేట్ రంగం నుండి డొమైన్ నిపుణులను కూడా తీసుకోనున్నట్లు సమాచారం.

## మీకు సహకరించేదే లేదు

- అమెరికాకు తేల్చి చెప్పిన దక్షిణ కొరియా
- ఇరాన్‌కే మద్దతిస్తామంటూ వెల్లడి

**వాషింగ్టన్, ఆగస్టు 18 :** ఇరాన్‌ను అణ్వస్త్ర రహిత దేశంగా మార్చేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు సహకరిం చాల్సిందిగా అమెరికా చేసిన అభ్యర్థనను దక్షిణ కొరియా తోసిపుచ్చింది. దీంతో సియోల్‌తో సంయుక్త సైనిక విన్యాసాలను తగ్గించుకోవాలని పెంటగాన్‌ను దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. ఈ విషయాలను ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు లేకుండా చేయాలన్న తన ప్రయత్నాలకు సహకరిస్తారా అని ఇటీవల దక్షిణ కొరియా అధ్యక్షుడిని అడిగానని, అందుకు ఆయన 'నో' చెప్పారని ట్రంప్ ఆ పోస్టులో వివరించారు. దక్షిణ కొరియాతో సంయుక్తంగా చేపట్టే సైనిక విన్యాసాలను పూర్తిగా రద్దు చేసుకునేందుకు ఇప్పుడు సమయం లేనందున ఆ వార్షిక విన్యాసాలను కుదించుకోవాలని రక్షణ కార్యాలయాన్ని ఆదేశించానని తెలిపారు. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, విన్యాసాలలో పాల్గనడం పట్ల తన అసంతృప్తికి అది ఓ కారణమని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు. సైనిక విన్యాసాలు చాలా ఖర్చుతో కూడినవని అంటూ అవి ఉత్తర కొరియాకు అనుచితమైన, శతృత్వ భావనను కలిగించే సంకేతాలు పంపుతున్నాయని తెలిపారు. తన అధ్యక్ష పదవీ కాలంలో ఉత్తర కొరియా ఎలాంటి బెదిరింపులకు పాల్పడకుండా గౌరవప్రదంగా వ్యవహరిస్తోందని చెప్పారు. దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాల నిర్వహణపై చాలా కాలం క్రితమే నిర్ణయం జరిగినందున వాటిని గణనీయంగా తగ్గించాలని రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్‌కు సూచించానని తెలియజేశారు. కాగా ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ సాగిస్తున్న ఘర్షణలు, టెహ్రాన్ అణు కార్యక్రమంపై ఒత్తిడి కోసం భాగస్వాములను సమీకరించేందుకు వాషింగ్టన్ చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, దక్షిణ కొరియా మధ్య ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్ విన్యాసాలు సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ జరగాల్సి ఉంది. ఇందులో 18,000 మందికి పైగా దక్షిణ కొరి యా



సైనిక సిబ్బంది పాల్గంటారని అంచనా. డ్రోన్లను ఎలా ఎదుర్కోవాలి, జీపీఎస్ సిగల్స్‌ను ఎలా అడ్డు కోవాలి, సైబర్ దాడులు జరిగితే ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై ప్రదర్శనలు జరుపుతారు.



## ప్లీజ్.. మమ్మల్ని ఇక్కడే ఉండనివ్వండి

- స్పెయిన్‌లో వేలాది మంది వలసదారుల ప్రదర్శన

**మాడ్రిడ్. ఆగస్టు 18 :** స్పెయిన్‌లో ఉత్తర ఆఫ్రికా తీరంలోని సెయుటాలో ఇటీవల ప్రవేశించిన వేలాది మంది వలసదారులు ఆదివారం ఓ అర్బన్ బీచ్‌లో ప్రదర్శన నిర్వహించారు. తమకు ఆశ్రయం కల్పించాలని, మొరాకోకు తిప్పిపంపవద్దని వారు స్పెయిన్ అధికారులను కోరారు. రెండు వారాల క్రితం మొరాకో నుంచి 72 వేల మంది వలసదారులు సరిహద్దును దాటి స్పెయిన్ భూభాగమైన సెయుటాకు చేరుకున్నారు. సెయుటా జనాభా కేవలం ఎనభై వేలు మాత్రమే. వలసదారులలో కొందరు స్వచ్ఛందంగా తిరిగి మొరాకో వెళ్లినా ఇప్పటికీ ఐదు వేల నుంచి ఎనిమిది వేల మంది వరకూ సెయుటాలోనే ఉన్నారని అంచనా. నగరంలో మౌలిక సదుపాయాల కొరత అధికం కావడంతో వలసదారులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బీచ్‌లోనూ, నగర శివారు ప్రాంతంలోనూ కాలం గడుపుతూ యూరప్‌లో ప్రవేశించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

'సముద్రం పక్కనే నిద్రపోతున్నాం. చలి వేధి స్తోంది. దుర్వాసన వస్తోంది. అనేక ఇబ్బందులు పడుతున్నాం' అని ఓ వలసదారుడు చెప్పారు. నగరంలో ప్రవేశించకుండా తమను పోలీసులు అడ్డుకుం టున్నారని వాపోయారు. 'మేము మొరాకో తిరిగి వెళ్లాలని అనుకోవడం లేదు', 'మేము కూడా మనుషులమే' అని రాసి ఉన్న ప్లకార్డులు ధరించి వారంతా ప్రదర్శనలో భాగస్వా ములయ్యారు. తాము అలసిపోయామని, పరిష్కారం కోరుతున్నామని నినాదాలు చేశారు.

## ఉరి వద్దు.. విషపూరిత ఇంజెక్షన్ ఇవ్వండి..

- మరణశిక్షపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- అయితే ప్రస్తుతానికి ఉరే ప్రామాణికమంటూ మెలిక
- ప్రత్యామ్నాయ పద్ధతుల పిటిషన్ కొట్టేసిన న్యాయస్థానం
- కేంద్ర ప్రభుత్వానికి పూర్తి స్వేఛ్ఛ ఉందంటూ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఎ.ఎం.ఎస్):** మరణశిక్ష పడిన దోషులకు ఉరిశిక్ష వేస్తూ.. ఆ శిక్షను అమలు చేస్తోంది మన దేశం. అయితే ఈ పద్ధతి రాజ్యాంగబద్ధమైనదే అయినప్పటికీ.. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ నొప్పితో కూడిన విషపు ఇంజెక్షన్ లేదా ఇతర ఆధునిక మార్గాలను ప్రవేశ పెట్టాలని కోరుతూ సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయింది. దాన్ని విచారించిన న్యాయస్థానం.. ఉరిశిక్షే రాజ్యాంగ బద్ధమైనదని చెబుతూ.. సదరు పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రస్తుతానికి దేశంలో మరణశిక్ష అమలుకు ఉరిశిక్షే ప్రామాణిక పద్ధతిగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.


జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. మరణశిక్ష పడిన ఖైదీకి తక్కువ నొప్పి కలిగిస్తూ, వారి గౌరవానికి భంగం కలగకుండా చూసేందుకు ఉరిశిక్షకు బదులుగా ఇతర మార్గాలను అవలంబించాలని కోరుతూ న్యాయవాది రిషి మల్హోత్రా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయితే ఈ అంశంపై గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన మూడు వేర్వేరు తీర్పులను లార్జర్ బెంచ్‌కు నివేదించాలని పిటిషనర్ కోరినప్పటికీ.. అలా చేయడానికి తగిన ప్రాతిపదికలు లేవని బెంచ్ స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 354(5) కింద ఉరి తీయడం అత్యంత బాధాకరమైనది, అమానుషమైనదని పిటిషనర్ పేర్కొన్నారు.

ఉరి తీసిన తర్వాత మరణాన్ని ధృవీకరించడానికి దాదాపు 40 నిమిషాలు పడుతుందని, అదే లైథల్ ఇంజెక్షన్, గ్యాస్ ఛాంబర్ లేదా కాల్చి చంపడం వంటి మార్గాల్లో అయితే కేవలం 5 నిమిషాల్లో ప్రాణం పోతుందని విన్నవించారు. ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన మరణం పొందే హక్కు ప్రాథమిక హక్కు అని వాదించారు. అందుకే ఉరి శిక్షకు బదులుగా వీటిలో ఏదో ఒక దాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. అయితే విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ఉరి శిక్షే అమలు చేస్తామని తేల్చి చెప్పింది. అయితే ఈ పిటిషన్‌ను తిరస్కరించినంత మాత్రాన భవిష్యత్తు పరిశోధనలకు తలుపులు మూసుకుపోయినట్లు కాదని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

భవిష్యత్తులో ఉరిశిక్షకంటే మెరుగైన, శాస్త్రీయమైన, వైద్యపరమైన ఆధారాలు లభిస్తే.. రాజ్యాంగ పరంగా ఈ అంశాన్ని మళ్లీ పరిశీలించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. మరణశిక్ష అమలుకు సంబంధించి ప్రత్యామ్నాయ పద్ధతులపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర సమీక్ష జరిపే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొంది. ఈ కేసు విచారణ సమయంలో కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరయ్యారు.. ఈ అంశంపై సమీక్షించేందుకు ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని కోర్టుకు తెలిపారు.

అయితే ఖైదీలకు ఉరిశిక్ష లేదా విషపు ఇంజెక్షన్ ఎంచుకునే అవకాశాన్ని ఇవ్వాలనే సూచనను ప్రాక్టికల్‌గా అమలు చేయడం సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఈ పాత విధానాన్ని మార్చేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై గత విచారణల్లో కోర్టు కొంత అసహనం వ్యక్తం చేసినప్పటికీ.. ప్రస్తుతానికి ఉరిశిక్ష విధానాన్నే సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

## చైనా వైపా..? మావైపా...?




- ఎటుంటారో తేల్చుకోండి
- భాగస్వామ్య దేశాలకు అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్, ఆగస్టు 18 :** కృత్రిమ మేధ (ఏఐ) రేసులో చైనా వైపు ఉంటారా లేక తమ పక్షాన నిలుస్తారా అన్నది తేల్చుకోవాలని భాగస్వామ్య దేశాలకు అమెరికా హెచ్చరికలు జారీ చేయబోతోంది. ఒకవేళ వారు బీజింగ్ వైపు ఉంటే అమెరికా నేతృత్వంలోని ఏఐ కూటమి నుంచి బహిష్కరిస్తామని చెబుతోంది. చైనాతో సాంకేతిక పోరు తీవ్రమైన నేపథ్యంలో ఏఐ నమూనాలు, సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల సరఫరాలను సురక్షితం చేసే ఉద్దేశంతో అమెరికా గత సంవత్సరం పాక్స్ సిలికా కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో సుమారు పాతిక దేశాలు చేరాయి. ఈ కార్యక్రమంలో చేరిన కజకిస్తాన్ అటు చైనా కూటమిలోనూ ఉంది.

ఈ పరిణామం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ ఓ ముసాయిదా లేఖను తయారు చేసింది. జూన్‌లో అమెరికా రూపొందించిన 'ఏఐ అవకాశాల ప్రకటన'పై సంతకాలు చేసిన 35 దేశాలకు ఈ లేఖలు పంపుతారు. చైనా, అమెరికాలలో ఏదో ఒక పక్షాన్ని ఎంచుకునేలా మిత్ర దేశాలపై ఒత్తిడి తేవడం ద్వారా సైనిక లేదా ఆర్థిక ఆధిపత్యం కోసం ఉపయోగపడే ఆధునిక ఏఐ రూపకల్పనలో బీజింగ్‌తో పోటీ పడి, దానికి వనరుల కొరతను సృష్టించాలని అమెరికా భావిస్తోంది.

## పరిశుభ్రమైన మున్సిపల్ వార్డుకు రూ.కోటి నజరానా

- ఢిల్లీ ప్రభుత్వ కీలక నిర్ణయం
- అక్టోబరు 2 నుంచి ప్రారంభం
- పారిశుధ్యం ఉమ్మడి బాధ్యతన్న సీఎం రేఖాగుప్తా

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఎ.ఎం.ఎస్):** దేశ రాజధాని ఢిల్లీని స్వచ్ఛ నగరంగా మార్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయాన్ని తీసుకుంది. ముఖ్యంగా నగరంలోని అత్యంత పరిశుభ్రమైన మున్సిపల్ వార్డుకు ప్రతీ నెలా కోటి రూపాయల చొప్పున ఏడాదిపాటు ప్రత్యేక నిధులు అందజేయనున్నట్లు సీఎం రేఖా గుప్తా సోమవారం ప్రకటించారు. అయితే ప్రజల నుంచి లేదా నెటిజెన్ల నుంచి ఏదైనా వార్డుకు సంబంధించిన చిన్న సమస్యను వారు ఫిర్యాదు చేసినా.. ఈ పోటీ రేసు నుంచి సదరు వార్డును తప్పిస్తారు. మిగతా వాటిని మాత్రమే పరిశీలించి అందులో ఏది పూర్తి స్వచ్ఛతగా ఉంటుందో దానికే రూ.1 కోటి నగదును అందజేస్తారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎమ్‌సీడీ) ప్రధాన కార్యాలయంలో 'ఢిల్లీ కో కూడే సే ఆజాదీ స్వచ్ఛతా అభియాన్ 2026' ప్రచారాన్ని సీఎం రేఖా గుప్తా ప్రారంభించారు. సాధారణ పారిశుద్ధ్య ప్రచారం అక్టోబర్ 2వ తేదీ వరకు సాగనుండగా.. వార్డుల మధ్య పోటీ మాత్రం పూర్తి ఏడాదిపాటు కొనసాగుతుందని సీఎం వెల్లడించారు. ప్రతీనెలా అత్యుత్తమంగా నిలిచే వార్డు.. సీఎం అభివృద్ధి నైతిక నిధుల (సీఎండీఎఫ్) నుంచి రూ.కోటి చొప్పున, సంవత్సరంలో గరిష్టంగా రూ.12 కోట్ల వరకు అదనపు నిధులను గెలుచుకోవచ్చు.

ఢిల్లీలో ల్యాండ్‌ఫిల్ కుప్పల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం "4 Cs" (కలెక్షన్, క్లీనింగ్, కన్వర్షన్, సర్క్యులర్ ఎకానమీ) విధానాన్ని తీసుకొచ్చింది. సోర్స్ సెగ్రిగేషన్, వ్యర్థాల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు 70 మెకానికల్ స్వీపింగ్ మిషన్లు, 125 వ్యర్థాల సేకరణ కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. దీంతో పాటు రాబోయే వారాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రై



వ్‌లను నిర్ణయించారు. ఆగస్టు 23, 30, సెప్టెంబర్ 6, 13 తేదీల్లో మురికి వాడల్లో ప్రత్యేక శుభ్రత చేపట్టనున్నారు.

వారాంతాల్లో ప్రజా మరుగుదొడ్లను, సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు పార్కుల్లోని వ్యర్థాలను తొలగిస్తారు. సెప్టెంబర్ 17వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రుల్లో, అలాగే సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పాఠశాలల్లో 'మేరా స్కూల్, సబ్సే సుందర్' పోటీలను నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రగతి నివేదికలను ప్రతినెలా సోమవారం సమర్పించాలని అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆదేశించింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## తెలంగాణలో నల్లగొండ మున్సిపల్ నెంబర్ వన్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతా

- **రూ.23.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**నల్గొండ జిల్లా, వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 18**



నల్గొండ పట్టణం కేంద్రంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని మంత్రి తెలిపారు.మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. ముందుగా మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయల తో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా మంత్రి ఆయా డివిజన్ లలో మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని, పట్టణానికి తాగునీటికై ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్ల రూపాయలు తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకతీతంగా నల్గొండ కార్పొరేషన్ ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, పట్టణంలో రహదారుల ఏర్పాటుతో పాటు, డివైడర్లు ,సెంట్రల్ లైటింగ్, హైమాస్ లైటింగ్, సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభను తీసుకొస్తుందని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, కార్పొరేటర్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, కార్పొరేటర్లు యమ కవిత, కేసాని వేణు గోపాల్ రెడ్డి, మల్లీశ్వరి తదితరులు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తహసిల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, కార్పొరేటర్లు స్వాతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్,3వ వార్డు ఇంచార్జ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి**
- **సింగరేణి మండలం రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ**

**ఖమ్మం వుదయం బ్యూరో సింగరేణి, ఆగస్టు - 18**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. మంగళవారం సింగరేణి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కారేపల్లి– రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల ప్రవేశాలు, విద్యా ఫలితాలు, వారికి అందుతున్న భోజనం, వసతులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్ బోధనా తీరును పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో ఆసక్తి చూపుతున్నారు, వారి భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి, ఉన్నత విద్యలో ఏ కోర్సులను ఎంచుకోవాలని భావిస్తున్నారు, భవిష్యత్‌లో ఏ రంగాల్లో స్థిరపడాలనుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. పాఠశాలలోని లైబ్రరీ, మ్యూజిక్ రూమ్, ఆర్ట్స్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యాలయ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రగతి, మౌలిక వసతులు, సిబ్బంది, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. సుమారు 9.57 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు అధిక ప్రయోజనాలు



**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి) :**

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల సాగు ఖర్చులు తగ్గి రైతులకు అధిక లాభాలు సమకూరుతాయని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం లింగాల ఘనపురం మండలంలోని సిరిపురం గ్రామంలో మైలారపు వెంకన్న, పద్మ దంపతులు నిర్వహిస్తున్న 10 ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద ఏర్పాటు చేసిన బయో రిసోర్స్ సెంటర్ (BRC)ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో సాగు చేస్తున్న పందిరి కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్, వరి పంటలను పరిశీలించి, రసాయనాల్లేకుండా స్వచ్ఛమైన ఆహారోత్పత్తులు సాధిస్తున్న రైతు దంపతులను కలెక్టర్ అభినందించారు. జీవ ఇన్‌పుట్ల తయారీ, దేశవాళీ ఆవుల పేడ, గోమూత్రం, వేప, పుల్లటి మజ్జిగలతో తయారుచేసే జీవామృతం, ఘణ జీవామృతం, వేప కషాయం పంటల పెరుగుదలకు, పురుగుల నివారణకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీతో పాటు పలువురు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బల్క్ ల్యాండ్ సర్వే పనులను వేగవంతం చేయాలి

- **అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి**
- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి :ఆగస్టు 18(వుదయం విలేకరి)**



బల్క్ ల్యాండ్ సర్వే పనులను వేగవంతం చేసి, అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి బల్క్ ల్యాండ్ సర్వే నంబర్ల సర్వే, భూముల రీ–సర్వే, సాదా బైనామా అంశాలపై భూపాలపల్లి రెవెన్యూ డివిజన్ రెవెన్యూ అధికారులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించి సర్వే, సర్వే పూర్తి అయిన భూముల నివేదికల ప్రగతిని మండలాల వారిగా తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, భూసేకరణకు సంబంధించిన వివరాలపై సమగ్ర నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. బల్క్ ల్యాండ్ సర్వే ప్రక్రియను పూర్తి చేసి, భూముల స్థితిగతులు, హద్దులు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.సర్వే పనులను పూర్తి చేసి నివేదికలు అందించిన సర్వేయర్లకు వేతనాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్హులైన రైతులకు నిబంధనల మేరకు పట్టాలు అందించడం మన జీవితంలో అత్యంత పెద్ద సంతృప్తిని కలిగించే అంశమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు అందేలా అధికారులు పనిచేయాలని కోరారు.బల్క్ ల్యాండ్ సర్వే పనుల పూర్తికి అదనపు కలెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. మండలాల వారీగా సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తి చేసిన భూములకు సంబంధించి నివేదికలు అందచేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అర్హులైన రైతులకు పట్టాలు జారీ చేసేందుకు చేపట్టిన సర్వే ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి డివిజన్ మండలాల తహసీల్దార్ పాల్గొన్నారు.

## ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలకు మంత్రి ప్రశంసలు

- **119 ఏటీసీల విద్యార్థులతో రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ పోటీలు**
- **టాటా సంస్థ ద్వారా 100 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

**ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)**



మణుగూరు ప్రభుత్వ ఐటీఐ–అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మణుగూరు ఐటీఐ–ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణల అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ విధానం, పాత వాహనాల విడిభాగాల పునర్వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం, పనితీరు తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మణుగూరు వంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సృజనాత్మకతతో ఇలాంటి ఆవిష్కరణలు చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసి వాణిజ్య వాహనాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల ప్రాజెక్టులు కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో ఉపయోగపడే ఉత్పత్తులుగా మారేలా పరిశ్రమల సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ఠ, ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్ సెంటర్స్ జాయింట్ డైరెక్టర్ నగేష్, టామ్‌కామ్ ఈవో గౌస్ పాషా, రతన్ టాటా ఆర్డీడీ కోటేశ్వరరావు, ఏటీసీ కళాశాల ప్రిన్సిపాల్ సారంగపాణి, తహసీల్దార్ అద్దంకి నరేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలి



**డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి**

**వరంగల్ టౌన్, ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి) :**

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (DMHO) డా. బి. రాజారెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఆశా నోడల్ సూపర్‌వైజర్లు, MCH సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భధారణ ముందస్తు నమోదు & ANC: ప్రసూతి సేవల్లో ఎర్లీ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి గర్భిణీకి కనీసం 4 సార్లు ఏఎన్సీ చెకప్‌లు పూర్తయ్యేలా చూడాలి. 102 వాహనాల ద్వారా 3, 4వ తనిఖీలకు గర్భిణీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలి.

నెలవారీ పర్యవేక్షణ: ప్రతి నెల 9న 'ప్రధానమంత్రి మాతృ సంరక్షణ యోజన' కింద డ్రాప్‌ఔట్, హై–రిస్క్ గర్భిణీలను గుర్తించి పరీక్షలు అందించాలి. సాధారణ ప్రసవాల ప్రోత్సాహం: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలి. అవసరం లేని సిజేరియన్లను తగ్గిస్తూ, సాధారణ ప్రసవాల ప్రాముఖ్యతను వివరించాలి.

తల్లి–శిశు సంరక్షణ: హైరిస్క్ గర్భిణీల ఫాలోఅప్, ఐరన్–ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ప్రసవానంతర సంరక్షణ (PNC)తో పాటు నవజాత శిశువుల సకాలంలో వ్యాక్సినేషన్‌పై దృష్టి పెట్టాలి. HPV వ్యాక్సినేషన్ & U–WIN: 14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణకు HPV వ్యాక్సిన్ ఇచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. టీకా వివరాలను వెంట వెంటనే 'యు–విన్' (U–WIN) పోర్టల్‌లో నమోదు చేయాలి. డేటా నాణ్యత, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ఆశాల పనితీరును సూపర్‌వైజర్లు నిరంతరం సమీక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ DMHO డా. ప్రకాష్, MCH ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సజిదా, డెమో వెంకటేశ్వర్లు, SO ప్రసన్న కుమార్, DPHN మనోజ, DPO అర్చన తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, ఆగస్ట్ 18 (వుదయం ప్రతినిధి) :**



ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, వసతి గదులతో పాటు ఫిర్యాదుల బాక్సులోని దరఖాస్తులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించిన కలెక్టర్, ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మెనూ ప్రకారం సమయానికి నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని వేడివేడిగా వడ్డించాలి. తాగునీటి శుద్ధి ప్లాంట్, పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆరోగ్య విషయంలో ఎలాంటి అలసత్వం వహించ వద్దు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలి. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేర పరిశోధనకు వేగం: సూర్యాపేటలో మొబైల్ ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రారంభించిన ఎస్పీ నర్సింహ



**సూర్యాపేట ఆగస్టు 18: వుదయం ప్రతినిధి**

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు అత్యాధునిక మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పోలీసు శాఖ కేటాయించిన ఈ వ్యాన్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పోలీసు అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ..నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారం అత్యంత కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ద్వారా సంఘటనా స్థలం నుండే నేరుగా ఫోరెన్సిక్ ఆధారాలను వేగంగా సేకరించవచ్చని తెలిపారు.

సాంకేతిక పద్ధతులను ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చని, వారు చట్టం నుండి తప్పించుకోకుండా కఠిన శిక్షలు పడేలా చేయవచ్చని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డి సి ఆర్ బి డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, రాజశేఖర్, సాయిరాం మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్‌పై బ్యాటరీ వాహన సేవలు ప్రారంభం

- **వైద్య విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **భవిష్యత్ తరాలకు అటవీ సంపదను అందించాలి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ, ఆగస్టు 18 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం రోజున పలు అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, వైద్య విద్యార్థులు తమ ఐదేళ్ల చదువుతో పాటు ఒక్కో మొక్కను దత్తత తీసుకుని పెంచాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. నగరానికి కేఎంసీ ప్రాంగణం కీలకమైన 'గ్రీన్ స్పేస్' అని, నాటిన మొక్కలను వచ్చే ఏడాది వరకు సంరక్షిస్తే వాటి మనుగడ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. ఉచితంగా మొక్కలు అందించిన అటవీ శాఖ అధికారులను ఈ సందర్భంగా అభినందించారు.

భద్రకాళి బండ్‌పై బ్యాటరీ వెహికల్

సందర్శకుల సౌకర్యార్థం భద్రకాళి బండ్‌పై నూతనంగా బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ సేవలను ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ తన సీఎస్ఆర్ (CSR) నిధుల కింద కొనుగోలు చేసిన ఈ వాహనాన్ని కుడా (KUDA) అధికారులకు అందజేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ వాహనంలో ప్రయాణించి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, సీనియర్ వైద్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి: ఆగస్టు 18(వుదయం జిల్లా ప్రతినిధి)**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం మల్హర్ మండలంలోని కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థినుల వసతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, భద్రత, క్రీడలు తదితర సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు విద్యార్థినులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించేందుకు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.విద్యార్థినులు ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

యూనిఫారాలు పంపిణీని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరుగుదొడ్లు నిర్మాణాలను పరిశీలించి న ఆయన నెల రోజుల్లో పూర్తి చేసేలా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ బావుందని వంట సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కాటారం ఆర్డిఓ రవీందర్, డీఈఓ రాజేందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ రవి కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్‌ను సన్మానించిన టీజీఓస్ శాఖ

**ములుగు, ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి) :**



నగరంలో ఉమ్మడి సమీకృత కార్యాలయాల భవన ప్రారంభోత్సవం, పంచాయతీ రాజ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు గానూ ములుగు జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ల చేతుల మీదుగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ జిల్లా అధ్యక్షులు ఎం. సంపత్ రావు, కలెక్టర్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి పూలమాలలతో గౌరవించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జీ ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఓస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల జీవన్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కొమరయ్య, ఉపాధ్యక్షులు కే. శిరీష, విజయ భాస్కర్, ఏ. రాజ్ కుమార్, బి. యశ్వంత్, జాయింట్ సెక్రెటరీలు రఫీక్, శైలజ, డి. రాజు, రహీముద్దీన్, నాయకులు ప్రేమలత, ధర్మానాయక్, కృపాకర్, సంజీవ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకం

- **జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్**

**యాదాద్రి భువనగిరి: ఆగస్టు 18(వుదయం జిల్లా ప్రతినిధి)**



బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బి.సి.సంక్షేమ అధికారి బి.సుబ్బా రెడ్డి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ శ్యాంసుందర్, కలెక్టరేట్ అంజిరెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది మరియు కల్లుగీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు రాంపల్లి సోములు, జిల్లా కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, బొల్లేపల్లి మాజీ సర్పంచ్ గోదా శ్రీనివాస్ గౌడ్, బి.సి సంఘం, అధక్షుడు కె.బాలరాజు, సామాజిక కార్యకర్త కె.వెంకటేష్, జి.సోములు, కె..అశోక్, ఆర్.కొండల్, ఆర్,చంద్రయ్య, పి.మైసయ్య, యన్.ఆంజనేయులు, బి,సత్తయ్య, కె.మధు, కె.వెంకటేష్, బి.శంకర్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

## కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు





# రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్













# తులం బంగారం ఎగ్గొట్టేందుకే కళ్యాణలక్ష్మికి ఎసరు





# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## అల్ట్రా రన్నర్ నూనెగాని రాజుకు ఘన సన్మానం



వుదయం, సిద్దిపేట ప్రతినిధి

సిద్దిపేట జిల్లా రన్నర్ అసోసియేషన్ అధ్యక్షులు నూనెగాని రాజు పూణే నుంచి భారమతి వరకు 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను విజయవంతంగా పూర్తి చేసి సత్తా చాటారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో రాయపోల్ మండల బీజేపీ అధ్యక్షుడు మంకిడి స్వామి, ధర్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కాసమల్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముత్యాలు నూనెగాని రాజును శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 కిలోమీటర్ల సుదీర్ఘ పరుగును విజయవంతంగా పూర్తి చేయడం సాధారణ విషయం కాదని, పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతోనే ఇలాంటి విజయాలను సాధించగలరని అన్నారు. నూనెగాని రాజు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. నూనెగాని రాజు సాధించిన విజయం సిద్దిపేట జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి నీల స్వామి, నాయకులు ఉల్లి నరసింహులు, కృష్ణ గౌడ్, ఆకుల చంద్రమౌళి, వార్డు మెంబర్ జక్కుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండపై బడుగుల జెండా ఎగరేసిన సమరయోధుడు సర్వాయి పాపన్న

- దొరల గద్దెలను ఊపేసిన ధీరుడు.. గద్వాలలో ఉప్పొంగిన ఆత్మగౌరవ స్ఫూర్తి

గద్వాల ఆగస్టు 18 (వుదయం కరస్పాండెంట్)

సామాజిక ఆధిపత్యాల సంకెళ్లను తెంచి, అణగారిన వర్గాల ఆత్మగౌరవ పతాకాన్ని గోల్కొండ కోటపై ఎగరేసిన అగ్నికణం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. బడుగు, బలహీన వర్గాలపై సాగిన దోపిడీ, అణచివేతలపై గర్జించిన విప్లవ సింహం ఆయన" అని టీపీసీసీ గద్వాల నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధరూర్ రవి తీవ్ర స్థాయిలో ఉద్ఘాటించారు.సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని గద్వాల జిల్లా కేంద్రంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి విప్లవాత్మక వాతావ



రణంలో అంజలి ఘటించారు.కోటల పునాదులను కదిలించిన గెరిల్లా వ్యూహం ఈ సందర్భంగా ధరూర్ రవి తీవ్ర స్వరంతో మాట్లాడుతూ.. "నా చేయి తాటి చెట్టు మీద కాదు.. గోల్కొండ కోట మీద పడాలి" అని పాపన్న గౌడ్ చేసిన సింహగర్జన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకే దిశా నిర్దేశం చేసిందన్నారు. ఏ అధికార బలం, అపార సైన్య సంపత్తి లేకపోయినా.. కేవలం బడుగుల బలంతో, పదునైన గెరిల్లా వ్యూహాలతో నాటి నిరంకుశ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీరోదాత్త చరిత్ర ఆయనదని కొనియాడారు. కుట్రదారులు, అప్పటి పాలకులు చరిత్ర పుటల్లో ఆయనను ఏ విధంగా తక్కువ చేసి చూపాలని చూసినా.. ప్రజల గుండెల్లో మాత్రం పాపన్న గౌడ్ తిరుగులేని ప్రజా నాయకుడిగా, విప్లవ రాజై చిరస్థాయిగా నిలిచిపోయారని తెగేసి చెప్పారు. సమరశంఖం పూరించడమే నిజమైన నివాళి! నేటికీ సమాజంలో నయా భూస్వామ్య, ఆధిపత్య ధోరణులు నడుస్తున్నాయని, వాటిపై పాపన్న గౌడ్ స్ఫూర్తితో పోరాట సమరశంఖం పూరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. బడుగుల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పోరాట నివాళి కార్యక్రమంలో గద్వాల జిల్లా గౌడ సంఘం కాంగ్రెస్ నాయకులు అచ్చన్న గౌడ్, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, పాతపాలెం ఆనంద్ గౌడ్, శెట్టిఆత్మకూరు కృష్ణయ్య గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లత్తిపురం వెంకట్రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆక్రోశాన్ని, ఆత్మగౌరవ స్పృహను చాటుకున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం హాజరు ఉండాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 18 (వుదయం కరస్పాండెంట్)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మండల విద్యాధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సెలవు తీసుకోవాల్సి వస్తే సంబంధిత ఎంఈఓ లేదా డీఈఓ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు 100 శాతం నమోదయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను గణనీయంగా పెంచేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో పాఠశాలల అభివృద్ధికి వినియోగించాలని, నిధులు తిరిగి వెళ్లకుండా అవసరమైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పోషణ్ యాప్ నమోదు, ఆహార రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎల్పీజీ సౌకర్యం ఉన్న పాఠశాలల వివరాలను పోషణ్ యాప్‌లో అప్‌డేట్ చేయడంతో పాటు భోజనం నాణ్యతపై పాఠశాల కమిటీ అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పాములు, ఇతర విషపురుగులు పాఠశాల ప్రాంగణంలోకి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి పాఠశాలలో భద్రత, పరిశుభ్రత పర్యవేక్షణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. బవిత కేంద్రంలో నిర్వహించే స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని విద్యార్థులకు ఉపయోగకరంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీని వేగవంతం చేసి సెప్టెంబర్ 5లోగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యూనిఫాంలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణ, మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు పాఠశాలలను తరచూ తనిఖీ చేసి విద్యా ప్రమాణాలను పర్యవేక్షించాలని, జిల్లాలోని అన్ని కోచింగ్ సెంటర్లను ఎంఈఓలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని తెలిపారు.

మెమోలు, టీసీలు వెంటనే జారీ చేయాలిఅలంపూర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు మెమోలు, టీసీలు జారీ చేయకుండా పెండింగ్‌లో ఉంచిన అంశంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. సమస్యను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు మెమోలు, టీసీలు జారీ చేయాలని సంబంధిత ఎంఈఓను ఆదేశించారు. విద్యార్థులకు మెమోలు ఇవ్వని పాఠశాల యాజమాన్యంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణమే సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, అన్ని మండలాల విద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భిన్న దృక్కోణాల ద్వారా మానసిక సవాళ్లను పరిష్కరించాలి

- గీతం సదస్సులో అభిప్రాయపడ్డ సైకాలజీ నిపుణులు

పటాన్చెరు (వుదయం):

మానసిక పరిశోధన యొక్క విస్తరిస్తున్న పరిధిని, సంక్లిష్టమైన మానవ, సామాజిక సవాళ్లను అంతర్‌విభాగ దృక్కోణాల ద్వారా పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందని మానసిక శాస్త్ర నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'అనిశ్చితి కాలంలో మనస్తత్వ శాస్త్రం: అంతర్‌విషయ దృక్పథం, ఆవిష్కరణ, ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల సదస్సును 1718 తేదీలలో నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సు హైబ్రిడ్ పద్ధతిలో జరిగింది. ఇందులో మనస్తత్వశాస్త్రం, దాని అనుబంధ విభాగాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.అనిశ్చితి అనేది వ్యక్తిగత జీవితాలు, కార్యాలయాలు, విద్య, ఆరోగ్యం, సాంకేతికత, సమాజాన్ని అంతకంతకూ ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, వేగంగా మారుతున్న ఈ వాస్తవాలను మనస్తత్వ శాస్త్రం



ఎలా స్పందించగలదో పరిశీలించడానికి సైకాన్ '26 ప్రయత్నించింది. ఈ సదస్సు సమకాలీన మనస్తత్వ శాస్త్ర పరిశోధన, బోధన, ఆచరణపై విభిన్న దృక్కోణాలను ఒకచోట చేర్చి, అంతర్‌విభాగ సంభాషణకు ఒక వేదికను కల్పించింది .ఈ సదస్సులో క్లినికల్ సైకాలజీ, సైకోఅనాలిసిస్, సైకోఅనలిటిక్ సైకోథెరపీ, ఆర్గనైజేషనల్ సైకాలజీ, ఎడ్యుకేషనల్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, లీగల్‌ఫోరెన్సిక్ సైకాలజీ, కాగ్నిటివ్‌ఎక్స్ పెరిమెంటల్ సైకాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైకాలజీ, హెల్త్ సైకాలజీ, టెక్నాలజీఏఐ వంటి అనేక రంగాలకు సంబంధించిన పరిశోధన పత్రాలను సమర్పించారు. బెర్లిన్ లోని మాక్స్ ప్లాంక్ ఇన్ స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్ మెంటుకు చెందిన సెంటర్ ఫర్ అడాప్టివ్ బిహేవియర్ అండ్ కాగ్నిషన్ (ఏబీసీ) డైరెక్టర్ డాక్టర్ గెర్డ్ గిగెరెంజర్ కీలకోపన్యాసం చేశారు. ఆయన భాగస్వామ్యం ఈ సదస్సుకు ఒక అంతర్జాతీయ దృక్కోణాన్ని తీసుకొచ్చింది. అనిశ్చిత వాతావరణంలో మనస్తత్వ శాస్త్రం, నిర్ణయాలు తీసుకోవడం, మానవ ప్రవర్తనపై చర్చలకు నాంది పలికింది.ఈ సదస్సులో మనస్తత్వ శాస్త్రం, దాని అనుబంధ రంగాలలోని విభిన్న విభాగాలకు చెందిన ప్రముఖ వక్తలు కూడా పాల్గొన్నారు. వారిలో కోల్ కతాలోని ప్రదీప్ సెంటర్ ఫర్ ఆటిజం మేనేజ్ మెంట్ డైరెక్టర్, సైకాలజిస్ట్ డాక్టర్ మల్లికా బెనర్జీ; కలకత్త విశ్వవిద్యాలయం, సైకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిందితా చౌధురి; ముంబై విశ్వవిద్యాలయం, అనువర్తిత మనస్తత్వశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ బెల్హేకర్; క్లినికల్ సైకాలజిస్ట్, ఇన్నర్ హొరైజన్స్ వ్యవస్థాపకురాలు సుజాత అమేయ తదితరులు మనస్తత్వ శాస్త్రంలోని సమకాలీన ప్రశ్నలతో మమేకమయ్యేలా పండితోపన్యాసాలు, చర్చల ద్వారా ఇందులో పాల్గొన్న వారికి తోడ్పడ్డారు.

సైకాన్ '26 విద్యార్థులకు, పరిశోధకులకు వారి పరిశోధనలను ప్రదర్శించడానికి, సుప్రసిద్ధ పండితులు, నిపుణులతో సంభాషించడానికి, సాంప్రదాయ విజ్ఞాన శాస్త్ర పరిధులను దాటిన దృక్కోణాలతో మమేకమవ్వడానికి అవకాశాలను కల్పించింది. విద్య, వృత్తి, సాంకేతిక, సామాజిక సందర్భాలలో తలెత్తుతున్న సవాళ్లు, ఆవిష్కరణలో మానసిక శాస్త్ర పరిజ్ఞానాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను ఈ సదస్సు ప్రత్యేకంగా ప్రస్తావించింది.

అప్లైడ్ సైకాలజీ విభాగ అధ్యాపకుల సహకారంతో డాక్టర్ రానితా బసు, డాక్టర్ శ్రీస్నిగ్ధ దిట్టకవి ఈ సదస్సును నిర్వహించారు. వారి సమిష్టి కృషి సైకాన్ '26 విజయవంతమైన నిర్వహణకు, ఈ విజ్ఞాన శాస్త్రంలో అర్థవంతమైన, విద్యాపరమైన చర్చలకు ఒక వేదికను అందించింది.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం చిరస్మరణీయం



- జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీను

నారాయణపేట ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించే దిశగా ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.డీ సీ రాజేందర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న, గౌడ సంఘం నాయకులు సతీష్ గౌడ్, రఘురామయ్య, వెంకటేష్, గుర్నాథ్, కలాల్ ఆనంద్ గౌడ్ (సాక్షి),సర్పంచి శేఖర్ గౌడ్, ఉట్కూర్ మండలానికి చెందిన గౌడ సంఘం నాయకులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

వనపర్తి ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి)

అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖిమ్యా నాయక్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖిమ్యా నాయక్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్, అదనపు కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి సర్దార్



సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడిన గొప్ప యోధుడిగా చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ ప్రజల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. తన ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజా సంక్షేమం పట్ల అంకితభావంతో నాటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు.అన్యాయాన్ని ఎదిరించి, ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఆయన చూపిన ధైర్యం, సమానత్వం, ఆత్మగౌరవం వంటి విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ అన్నారు. ఆయన జీవిత చరిత్ర, సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న జీవితంపై సామాజిక చైతన్య కళాకారుడు రాజారాం ప్రకాష్ పాడిన పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి మధు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ నాయకులు గంధం నాగరాజు, వెంకటేష్, గౌడ సంఘం నాయకులు, ఇతర ప్రజాసంఘాల, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాపన్న గౌడ్ ఆశయాలను ఆచరించాలి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి
- నాగర్ కర్నూల్ లో జయంతి వేడుకలు - విగ్రహానికి పూలమాలలు

నాగర్ కర్నూల్, ఆగస్టు 18, (వుదయం ప్రతినిధి):

బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు, ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. పాపన్న గౌడ్ తన కాలంలోనే సామాజిక సమానత్వం, ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు అని పేర్కొన్నారు.అణగారిన వర్గాలకు అండగా నిలిచి, పేద ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవ భావనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటానికి ప్రత్యేకమైన స్థానం ఉందని, ఆయన సేవలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆకాంక్షించారు.

## బృందావన్ కాలనీ రహదారి దుస్థితి



- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- గుంతలమయమైన రోడ్డు. బురదలో నరకయాతన
- వర్షం పడితే రాకపోకలకు బ్రేక్..
- ప్రమాదాల ముప్పుతో ప్రజల ఆందోళన.
- కలెక్టరేట్ ఎదుట కాలనీ వాసుల నిరసన

సంగారెడ్డి, ఆగస్టు 18:వుదయం:

సంగారెడ్డి పట్టణంలోని 12వ వార్డు బృందావన్ కాలనీలో రహదారి దుస్థితి ప్రజలకు శాపంగా మారింది. బైపాస్ రోడ్డు నుంచి దువా హాస్పిటల్ వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయమై, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రహదారి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు.

**అధికారుల కళ్లు తెరిపించేందుకు కలెక్టరేట్ ముట్టడి**

సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కాలనీ వాసులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, వృద్ధులు పాల్గొని నినాదాలు చేశారు. రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలని, ప్రజల ఇబ్బందులను ఇకనైనా అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రధాన రహదారి ఇంత దారుణంగా మారినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని, వెంటనే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.


ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ అధ్యక్షులు సంగమేశ్వర్, బృందావన్ కాలనీ డెవలప్మెంట్ జనరల్ సెక్రటరీ కె. నరేందర్ యాదవ్‌తో పాటు కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాపన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం
- జయంతి వేడుకల్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల, ఆగస్టు 18

బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో అసమానతలను ఎదుర్కొం టూ సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాపన్న త్యాగం మరువలేనిది ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సర్దార్ పాపన్న గౌడ్ తన జీవితాన్నే అంకితం చేశారని అన్నారు. అణగారిన ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం, ప్రదర్శించిన ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, వివిధ శాఖల అధికారులు, గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతి నిధులు, పాల్గొన్నారు.





## సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ఆగస్టు 18(వుదయం ప్రతినిధి)

సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ లోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

మెదక్ జిల్లా /ఆగస్టు18 అల్లదుర్గం వుదయం (ప్రతినిధి)

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల్ గడీ పెద్దాపూర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మరువెల్లి కృష్ణగౌడ్ మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ ఒక సామాన్యుడిగా పుట్టి పెత్తందారుల రాజ్యాలపై వారి వ్యవస్థపై తిరుగుబాటు చేసి బహుజన రాజ్యాధికారానికి బాటలు వేసి ఆదిపత్య రాజ్యాలపై గోల్కొండ వరంగల్ భువనగిరి కోటలను ఆక్రమించి, మొగల్, రాజ్యానికి ఎదురు నిలిచిన ధీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన రాజ్యాధికారం కోసం పోరాడి పెత్తందారుల వ్యవస్థను రద్దు చేసి గొరిల్లా,సైన్యాన్ని స్థాపించాడు, పాపన్న గౌడ్ బాటలో నడవాలని అతని ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో మరువెల్లి కృష్ణ గౌడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు...



## కోహెడ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**కోహెడ ఆగస్టు 18 : వుదయం ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను కోహెడ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వీరత్వం,సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం, బహుజనుల కోసం అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కోహెడ మండల గౌడ సంఘం ప్రతినిధులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## భూసారం కాపాడాలి నానో యూరియా వాడాలి

- **వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు.. ఆయిల్‌పామ్‌తో రైతులకు అదనపు ఆదాయం: కలెక్టర్**

**మల్దకల్ గద్వాల ఆగస్టు 18 (వుదయం బ్యూరో)**

విచ్చలవిడిగా యూరియా వినియోగంతో భూసారం దెబ్బతింటోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పంటల సాగులో నానో యూరియా వినియోగాన్ని పెంచేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఇతర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. మంగళవారం మల్దకల్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్, రైతు అగ్రో ట్రేడర్స్ దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు, ధరలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేస్తూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వరికంటే ఆరుతడి పంటలే మేలు వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరికి బదులుగా కూరగాయలు, ఇతర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి, ఆదాయం వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పామ్‌లో అంతర పంటలు.. అదనపు ఆదాయం అమర వాయి, పెద్దొడ్డి గ్రామాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో కలెక్టర్ ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. దీంతో పామ్ ద్వారా ఆదాయం వచ్చే వరకు అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుం దన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేలా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నీటి కుంట, డ్రిప్ ఇరిగేషన్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్, రాజశేఖర్, ఆయిల్‌ఫెడ్ అధికారులు కరుణశ్రీ, మంజునాథ్, అమరవాయి సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ రంగన్న, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## 'వంద శాతం' కోసం పకడ్బందీ ప్రణాళిక

- **వెనుకబడిన విద్యార్థులకు అదనపు బోధన.. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి**
- **అర్హులందరికీ చేయూత.. ఇంకుడు గుంతలు, నీటి కుంటలకు పెద్దపీట**

**మల్దకల్ ఆగస్టు 18 (వుదయం కరస్పాండెంట్)**

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. క్రమశిక్షణతో చదివి, తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పాఠశాల నుంచి టాపర్ల సంఖ్య పెరగాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ర్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, గైర్హాజరైతే ముఖ్యమైన పాఠ్యాంశాలను కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎఫ్ఏ1 ప్రోగ్రెస్‌ను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై ఆరా తీశారు.మెనూలో రాజీ వద్దు పాఠశాల వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూలో నిర్దేశించిన విధంగా గుడ్లను తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు ప్రయోజనం అందేలా చూడాలన్నారు. జల సంరక్షణకు ఊతం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, కూలీల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ ఆదాయానికి గండి పడొద్దు గ్రామపంచాయతీ స్థలాల్లో అనధికారికంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు పొందిన వారు నిర్దేశిత అద్దెలను సక్రమంగా చెల్లించేలా చూడాలని సూచించారు. పంచాయతీకి అందుబాటులో ఉన్న ఆదాయ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను తెలుసుకున్న కలెక్టర్, వారికి జీతాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 18 (వుదయం బ్యూరో):**



సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం సమాజానికి చిరస్మరణీయమని కొనియాడారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని తెలిపారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తినిస్తుందన్నారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు లభించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన చూపిన సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలన్నారు. సమాజంలో వివక్షకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, బిసి సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గౌడ కుల సంఘాల నాయకులు, ఇతర ప్రముఖులు తదితరులుపాల్గొన్నారు.

## తు తు మంత్రగా మండల ప్రజా పరిషత్ సమావేశం

- **"సమావేశానికి ఆసక్తి చూపని ప్రజా ప్రతినిధునిధులు"**
- **"హాజరు కానీ ఆయా శాఖల అధికారులు"**
- **"అన్నిరంగాలలో అభివృద్ధి. అంతత మాత్రమే"**

**కోహీర్ ఆగస్టు 18 (వుదయం ప్రతినిధి )**



కోహీర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల అభివృద్ధి సమీక్షా సమావేశం కేవలం ఒక ఆచారంలాగా, 'తు తు మంత్రగా' ముగిసింది. ఎంపీడీఓ ఉమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమీక్షా సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఆశించిన స్థాయిలో హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.స్థానిక సమస్యలను సమర్థవంతంగా చర్చించి పరిష్కరించాల్సిన కీలకమైన ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం గ్రామ ప్రజల నిరాశకు కారణమైంది. అలాగే వివిధ శాఖలకు చెందిన ముఖ్య అధికారులు సైతం సమావేశానికి గైర్హాజరై, తమ స్థానంలో కింది స్థాయి సిబ్బందిని పంపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.హాజరైన కొద్దిమంది ప్రభుత్వ అధికారులు మండలంలో ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను సభకు వివరించారు. ఆయా శాఖలకు ప్రభుత్వం కేటాయించిన పథకాలు, విడుదలైన నిధుల వ్యయ వివరాలను అధికారుల ముందుంచారు.సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు తమ గ్రామాలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ కరెంట్ ఆర్టికల్చర్ వైద్యం శానిటేరి మిషన్ భగీరథ వివిధ శాఖల ముఖ్యమైన వంటి ప్రాథమిక సమస్యలను ప్రస్తావించి అధికారుల నుంచి వివరణలు కోరారు. అయితే, ముఖ్య అధికారులు లేకపోవడంతో సమస్యలకు తగిన స్పష్టత లభించలేదు.అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్ల మండలంలో అన్నిరంగాలలో అభివృద్ధి 'అంతంత మాత్రమే'గా మిగిలిపోతోందని మండలం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో పనులు మందకొడిగా సాగుతున్నాయని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమీక్షా సమావేశాలకు క్రమం తప్పకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోహీర్ మండలం నివాసులు డిమాండ్ చేస్తున్నాయి.

## మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- **కొల్లాపూర్‌లో సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్**

**కొల్లాపూర్, ఆగస్టు 18, (వుదయం ప్రతినిధి):**



మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేని పల్లి గ్రామ శివారులో సోలార్ ప్లాంట్ కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119లో ఉన్న సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలతపై అధికారులతో చర్చించారు.సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థల స్వరూపం, రహదారి సౌకర్యం, విద్యుత్ ప్రసార అవకాశాలపై కలెక్టర్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వారికి స్థిరమైన ఆదాయ వనరు ఏర్పడుతుందని తెలిపారు. అందుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.
సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందన్నారు. ప్రతిపాదిత సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యాసాధ్యాలను అంచనా వేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్రసారం తదితర అంశాలపై పూర్తి వివరాలతో ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ పర్యటనలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీ లాల్, ఎంపీడీఓ, ఐకేపీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- **కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 18, (వుదయం ప్రతినిధి):**



జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.జిల్లా కమిటీ సర్వేలో గుర్తించిన సమస్యలపై కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు.
ఆసుపత్రుల్లో: జిల్లా ఆసుపత్రిలో 169 మంది డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, శానిటేషన్ సిబ్బంది భర్తీ చేయాలి. లిఫ్టులు, మంచినీరు, మందులు, ఓపీ సమయం పెంపు అవసరం. అచ్చంపేటలో డెంటల్ డాక్టర్, స్కానింగ్ పరికరాలు; కోడేరు, బిజినపల్లి, వంగూర్, తాడూరు, ఉప్పునుంతల పీహెచ్‌సీలలో డాక్టర్లు, నర్సులు, పరికరాలు, భవనాలు లేవు. కొల్లాపూర్ 150 పడకల ఆసుపత్రికి సిబ్బంది కావాలి.
పాఠశాలలు, హాస్టళ్లలో: అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జూనియర్ కళాశాలల్లో భవనాలు, లెక్చరర్ పోస్టులు ఖాళీ. ఎస్సీ, బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు, ప్రహరీ గోడలు, మరమ్మతులు అవసరం. బిజినపల్లి హాస్టల్‌లో ఫ్యాన్లు, బాత్రూమ్‌లు, దుప్పట్లు లేవు. కోడేరులో బీసీ హాస్టల్ భూమి స్వాధీనం, బస్సు సౌకర్యం కోరారు. ఏజెన్సీలో 14 పాఠశాలలు మూతపడ్డాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు మాట్లాడుతూ ఖాళీ పోస్టులు భర్తీ చేసి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాస్, దేశ్యనాయక్, కే.గీత, బి.ఆంజనేయులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు

## మహిళలు గౌరీ పూజను ఎందుకు జరుపుకుంటారు

- **దాని ప్రాముఖ్యత ఏంటి.....**
- **పెద్ద గోని జిన్నారం రమాదేవి....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 18...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ ధర్మపత్ని పెద్దగోని జిన్నారం రమాదేవి నేడు శ్రావణమాసం మంగళవారం మంగళ గౌరీ వ్రతం స్త్రీలు ఎందుకు చేసుకుంటారని అంశం మీద ఆమె ఇలా వివరించారు.గౌరీ పూజ ప్రధానంగా వివాహిత, అవివాహిత స్త్రీలు ఇద్దరికీ సంబంధించిన పండుగ.
గౌరీ పూజ వివాహిత, అవివాహిత స్త్రీలకు సమానంగా ముఖ్యమైనది. వైవాహిక సామరస్యం, సంతాన సాఫల్యం మరియు కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు ఈ రోజున ఉపవాసం పాటిస్తారు. అవివాహిత యువతులు తమకు తగిన జీవిత భాగస్వామి లభిస్తుందనే ఆశతో దీనిని పాటిస్తారు. ఈ రోజున గౌరీ దేవిని పూజించడం వల్ల జీవితంలోని అడ్డంకులు, ఆర్థిక ఇబ్బందులు మరియు ప్రతికూల శక్తులు తొలగిపోతాయి.కానీ




లోతుగా పరిశీలిస్తే, మరింత గంభీరమైన విషయం కనిపిస్తుంది. గౌరీ దేవి స్వయంగా శివునితో తన జీవితాన్ని నిర్మించుకోవడానికి కష్టాలను, సహనాన్ని, తీవ్రమైన కృషిని అనుభవించింది. భక్తి, సహనం, మరియు అంతర్గత బలం అనేవి ఒక అందమైన జీవితానికి నిజమైన పునాదులని ఆమె కథ స్త్రీలకు బోధిస్తుంది.ఈ పండుగ పరాధీనతకు సంబంధించినది కాదు, ఇది దైవిక భాగస్వామ్యం, అంతర్గత స్వచ్ఛత మరియు భక్తితో కూడిన హృదయం యొక్క శక్తికి సంబంధించినది పని ఆమె వివరించారు.

## కల్కి భగవానుని కథ

- **వివరించిన చీకూర్ పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 18....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో నేడు శ్రావణ మాసం మంగళ వారం పుస్కరించుకొని నేడు శ్రీ గురు పీఠం లో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతరం కల్కి జయంతి సందర్భంగా కల్కి భగవానుని గురించి ఇలా వివరించారు.ఈ కథ ప్రధానంగా కల్కి పురాణం నుండి తీసుకోబడింది, దీనిలోని కొన్ని భాగాలు విష్ణు పురాణం మరియు భాగవత పురాణంలో కూడా కనిపిస్తాయి.కలియుగం సాగుతున్న కొద్దీ, ప్రపంచం క్రమంగా అధోగతి పాలవుతుందని గ్రంథాలు వర్ణిస్తాయి: సత్యం అరుదైపోతుంది, పాలకులు అవినీతిపరులవుతారు, మరియు ప్రజలు పవిత్ర కర్తవ్యం పట్ల శ్రద్ధ చూపడం మానేస్తారు. ఆ పతనం ఒక అట్టడుగు స్థాయికి చేరుకున్నప్పుడు, విష్ణువు చివరిసారిగా తిరిగి వస్తాడని ప్రవచించబడింది.అతను శంభల అనే గ్రామంలో, విష్ణుయశ, సుమతి అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించనున్నాడు. ధర్మం ప్రారంభం కావడానికి రాజభవనం అవసరం లేదు.పెద్దవాడయ్యాక, కల్కి దేవదత్త అనే తెల్లని గుర్రంపై స్వారీ చేస్తూ, దాదాపు తోకచుక్కలా ప్రజ్వరిల్లే ఖడ్గాన్ని ధరిస్తాడు. దానితో అతను భూమండలంపై ప్రయాణిస్తూ, అవినీతిపరులైన రాజులను, కపట ప్రవక్తలను ఎదుర్కొంటూ, కలియుగం మిగిల్చిన వాటిని తుడిచిపెడతాడని చెబుతారు. ఆ విధ్వంసం పూర్తయ్యాక, సత్యయుగమైన సత్యయుగం మళ్ళీ ప్రారంభమవుతుంది. స్పష్టంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే. ఇది గ్రంథం. చరిత్ర కాదు. కల్కి ఇప్పటికే ఈ భూమిపై నడిచాడని ఎవరూ చెప్పడం లేదు. ఇక్కడ ఉన్నది చాలా కాలంగా భక్తిని. నైతిక కల్పనను తీర్చిదిద్దిన ఒక సంప్రదాయం. ఇది ఒక రికార్డు అంటే ఒక ప్రపంచం లాంటిది అని తెలియజెప్పారు.



## సర్వాయి పాపన్న ఆశయాలు ఆచరణీయం

- **ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి**
- **బిజినపల్లిలో జయంతి వేడుకలు - కేక్ కట్ చేసి నివాళి**

**బిజినపల్లి, ఆగస్టు 18, వుదయం ప్రతినిధి:**

మండల కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బీసీ మండల సంఘం నాయకులు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ అన్ని వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడని, ప్రజా నాయకుడని తెలిపారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎన్. బాలరాజ్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, రాజేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు మిద్దె రాములు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సత్యశీల సాగర్, ఎండి జాంగిర్, నాయునుల్లా, నరేందర్ గౌడ్, పిట్టల తిరుపతయ్య, నక్క పర్వతాలు యాదవ్, శ్రీనివాసులు, నిరంజన్, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలలో సమస్యలపై అధికారులు స్పందించలి

- **గ్రామల అబివృధి అధికారులతోనే సాధ్యం**
- **నగల్ గిద్ద మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, ఖేడ్ సబ్ కలెక్టర్.**

**నారాయణఖేడ్ ఆగస్ట్ 18(వుదయం)**

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధి లోనినాగల్‌గిద్ద మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి పాల్గొని అధికారులు గ్రామల అ భివృద్ధికి కృషిచేయాలని అన్నరు.ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను, గ్రామ సర్పంచులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యుత్, విద్య, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలపై అధికారులతో సమీక్షించారు.
**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ** గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండలంలోని విద్యుత్ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమమ్మయంతో పని చేయాలని సూచించారు.సమస్యలు పరిష్కారం కోసం అధికారులు తమ పాత్ర పోషిచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కరెంటు కోసం ధర్నా

**ఆందోల్ జోగిపేట్**

వు మంగళవారం ఆందోల్ మండలం అన్నాసాగర్ 11 కె.వి సబ్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై జోగిపేట్ మన సంపల్లి గ్రామ రైతులు ధర్నాకు దిగారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు గత ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందిస్తుంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది గంటలు కూడా ఇవ్వడం లేదంటూ విద్యుత్ అధికారులను నిలదీశారు కరెంటు వేళలో సుచిత లేకపోవడంతో విద్యుత్ సమస్యలపై ఫోన్ చేస్తే అధికారులు కూడా స్పందించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఉచిత విద్యుత్ అంటూ రైతులను ఇబ్బంది పంట పొలాలకు నీళ్లు లేక ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కడాల రాములు మాసాగోని రవి రైతులు పాల్గొన్నారు

## దుర్గుణముల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ

- **3500 మంది విద్యార్థులతో కల్వకుర్తి లో కార్యక్రమం**

**కల్వకుర్తి, ఆగస్టు 18, (వుదయం ప్రతినిధి):**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ స్పందన ఆధ్వర్యంలో మంగళవారం "దుర్గుణముల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ" కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి డీకే బాలయ్య 3500 మంది విద్యార్థిని, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. గత మూడు రోజులుగా "వ్యసన స్వర్ణిమ భారత్" ఉద్యమంలో భాగంగా శ్రీ సరస్వతి శిశు మందిర్, గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల, మిలీనియం ఉన్నత పాఠశాల, జేపీ నగర్ సాంఘిక సంక్షేమ కళాశాల, పాఠశాల, విభీస్ మాంటిసోరి ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది.
8, 9, 10 తరగతి విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, యోగాభ్యాస పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. వారం తర్వాత పరీక్ష నిర్వహించి ప్రతి పాఠశాల నుండి ఇద్దరికి ప్రత్యేక బహుమతులు ఇస్తామని డీకే బాలయ్య తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు శివభగవానుని మెమెంటోలు అందజేశారు.



# నడకకు కొత్తజీవం.. తేలికగా తుంటి మార్పిడి

# చక్కని ఆరోగ్యం



సుకుందాం.పాత పద్ధతుల్లో జరిపే తుంటి శస్త్రచికిత్సల్లో.. కండరాలను లోతుగా కోయాల్సి వచ్చేది. దీనివల్ల రక్తస్రావం అధికంగా ఉండేది. తీవ్రమైన నొప్పి బాధించేది. కానీ, ఇప్పుడు ముందువైపు నుంచి కండరాల మధ్యలోనే శస్త్రచికిత్స (అంటీరియర్ అప్రోచ్) చేయడం వల్ల కండరాలు ఎక్కువగా దెబ్బతినకుండా ఉంటాయి. రక్తస్రావం తక్కువే! అంతేకాకుండా నొప్పి కూడా తక్కువగానే ఉండటం వల్ల రోగులు త్వరగా కోలుకుంటారు. కొంతమంది రోగులు 1–2 వారాల్లోనే ఎలాంటి సపోర్ట్ లేకుండా నడవగలుగుతున్నారు.మిని

తుంటి నొప్పితో నడవలేని స్థితిలో ఉన్న రోగులకు మందులు పనిచేయని పరిస్థితిలో చివరి అవకాశం హిప్ రీప్లేస్‌మెంటే! అయితే ఒకప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అంటే చాలామంది భయపడేవారు. కారణం పెద్ద కోత, తీవ్రమైన నొప్పి, అధిక రక్తస్రావం, వారాల తరబడి దవాఖానలో గడపడం, నెలల తరబడి విశ్రాంతి. ఇవన్నీ రోగిని కంగారుపెట్టేవి. అంతేకాదు కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తేవి. కానీ, గత 10–15 సంవత్సరాల్లో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ (టీహెచ్‌ఆర్) పద్ధతి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. దీనివల్ల రోగి వేగవంతంగా కోలుకునే వెసులుబాటు ఏర్పడింది. అంతేకాకుండా, చిన్నకోత, తకువ నొప్పి, సుమారు 25–30 సంవత్సరాలపాటు మన్నికగా ఉండే ఇంప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధానంతో మోకాళ్లు, నడుము నొప్పులతో బాధపడుతూ జీవన నాణ్యత కోల్పోయినవేలాది మంది రోగులు మరోసారి చురుకైన జీవితాన్ని అందుకోగలుగుతున్నారు. అయితే హిప్ రీప్లేస్‌మెంట్‌లోవచ్చిన ఆధునిక పద్ధతులు, వాటి వల్ల కలిగే లాభాలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలు

మల్లి ఇన్వేసివ్ సర్జరీ (ఎంఐఎస్)గతంలో అయితే 10–12 అంగుళాల కోతలు పెట్టాల్సి వచ్చేది. ఎంఐఎస్ పద్ధతి ద్వారా ఇప్పుడు కేవలం 3 నుంచి 5 అంగుళాల చిన్నపాటి కోతలతోనే సర్జరీ పూర్తి చేస్తున్నారు. ఫలితంగా రక్తస్రావం తగ్గి, గాయం త్వరగా మానిపోవడంతో పాటు దవాఖానలో గడపాల్సిన రోజులు కూడా తగ్గుతున్నాయి.ఈఆర్ఏఎస్ ప్రొటోకాల్స్‌ఎన్‌హాన్స్‌డ్ రికవరీ ఆఫ్టర్ సర్జరీ (ERAS) విధానంలో శస్త్రచికిత్సకు ముందే రోగికి అవగాహన కల్పించడం, ఎకువసేపు ఉపవాసం లేకుండా చూసుకోవడం, సర్జరీ తర్వాత త్వరగా నడక ప్రారంభించడం వంటి చర్యలు ఉంటాయి. గతంలో 4–5 రోజులు దవాఖానలో ఉండాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు చాలామంది రోగులు ఒకే రోజులో లేదా ఒక రాత్రిలోనే దవాఖాన నుంచి డిశ్చార్జ్ అవుతున్నారు. కొంతమంది రోగులకు శస్త్రచికిత్స చేసిన 4–8

గంటల్లోనే ఇంటికి పంపించే స్థాయికి వైద్యరంగం చేరుకుంది. దీనినే ఔట్‌పేషెంట్ హిప్ రీప్లేస్‌మెంట్ అని వ్యవహరిస్తున్నారు. శస్త్రచికిత్స సమయంలోనే ఎక్స్ రే లేదా ఫ్లోరోసోపీ ద్వారా కప్ పొజిషన్, కాలి పొడవు, జాయింట్ స్థిరత్వం సరిగ్గా ఉన్నాయా లేదా అనేది వైద్యులు చెక్ చేస్తున్నారు.కంప్యూటర్ అసిస్టెడ్ సర్జరీ: సెన్సర్లు, డిజిటల్ మానిటర్ల సహాయంతో ఇంప్లాంట్‌ను కచ్చితమైన కోణంలో అమర్చే విధానం అభివృద్ధి చెందింది. దీంతో జాయింట్ డిస్‌లొకేషన్ ప్రమాదం తగ్గుతున్నది.3డీ ప్రీ–ఆపరేటివ్ ప్లానింగ్: రోగి తుంటికి సంబంధించిన సీటీ సాన్ లేదా ఎక్స్–రే ఆధారంగా 3డీ మాడల్ తయారు చేసి, ముందుగానే ఇంప్లాంట్ పరిమాణం, పొజిషన్ ప్లాన్ చేస్తున్నారు. రోబోటిక్ హిప్ రీప్లేస్‌మెంట్‌రోబోటిక్ సర్జరీ అనేది ఇప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నది. రోబో సహాయంతో ఇంప్లాంట్‌ను అత్యంత కచ్చితంగా అమర్చగలుగుతున్నారు. వైద్య, ఆరోగ్యరంగ అధ్యయనాల ప్రకారం, సాధారణ పద్ధతిలో 70–80 శాతం కచ్చితత్వం ఉంటే, రోబోటిక్ విధానంలో ఇది 95 శాతం కంటే ఎక్కువగా ఉంటున్నది.Hip Painఅత్యాధునిక ఇంప్లాంట్లుసిమెంట్ లెస్ ఫిక్సేషన్: టైటానియం పూతతో తయారైన ఇంప్లాంట్లలో ఎముక సహజంగా పెరిగి కలిసిపోతుంది. యువకులు, చురుకైన జీవితం గడిపేవారికి ఇవి ఎకువకాలం మన్నుతాయి.షార్ట్ స్టెమ్స్: ఎముకను ఎకువగా కాపాడే ఈ పద్ధతి భవిష్యత్తులో అవసరమైతే రివిజన్ సర్జరీని సులభతరం చేస్తుంది.డ్యుయల్ మొబిలిటీ కప్స్: కప్‌లో కప్ తరహా డిజైన్‌తో ఉండే ఈ

ఇంప్లాంట్లు డిస్‌లొకేషన్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తాయి.3డీ ప్రింటెడ్ కస్టమ్ ఇంప్లాంట్లు: 3డీ ప్రింటెడ్ కస్టమ్ ఇంప్లాంట్లు అంటే ఎముక నష్టం ఎకువగా ఉన్న రోగులకు లేదా ప్రత్యేక శరీర నిర్మాణం ఉన్నవారికి వ్యక్తిగతంగా సరిపోయే ఇంప్లాంట్లు తయారు చేస్తున్నారు.

# మిక్స్‌డ్ వర్కవుట్లు మరింత మేలు

ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం ఎంత వ్యాయామం చేశాం అన్నది కాదు.. ఎలాంటి వ్యాయామాలు చేశాం అన్నదీ ముఖ్యమే అని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. రోజూ ఒకే వ్యాయామం చేస్తే సరిపోతుంది అనే అభిప్రాయాన్ని ఈ పరిశోధనలు తప్పుబడుతున్నాయి. శరీరాన్ని ఒకే విధంగా కాకుండా విభిన్నంగా కదిలించడం వల్ల గుండె నుంచి మెదడు వరకు అన్ని అవయవాలు చురుకుగా పని చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా మిక్స్‌డ్ వ్యాయామాలు చేసే వారిలో ఆయుష్షు పెరగడం, ఒత్తిడి తగ్గడం, ఇమ్యూనిటీ మెరుగుపడటం లాంటి ప్రయోజనాలు కనిపించాయని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ చేసిన ఈ పరిశోధనలో 1,11,000 మందికి పైగా




వ్యక్తుల ఆరోగ్య, వ్యాయామ అలవాట్లను 30 సంవత్సరాలకు పైగా పరిశీలించారు.ఇందులో ఒకే రకమైన వ్యాయామం చేసే వారితో పోలిస్తే, విభిన్న రకాల వర్కవుట్లు చేసే వారిలో ముందస్తు మరణాల ప్రమాదం 19% వరకు తక్కువగా కనిపించింది. గుండె జబ్బుల వల్ల మరణాల ప్రమాదం 22% తగ్గింది. క్యాన్సర్ కారణంగా మరణించే ప్రమాదం 15% వరకు తక్కువగా కనిపించింది.ఒకే వ్యాయామాన్ని ప్రతిరోజూ చేయడం కాకుండా వివిధ రకాల శారీరక చలనాలను కలిపి చేయడమే మిక్స్‌డ్ ఎక్సర్‌సైజ్. ఉదాహరణకు... వాకింగ్, యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, సైక్లింగ్, మెట్లు ఎక్కడం, గార్డెనింగ్, స్విమ్మింగ్, డ్యాన్స్ లాంటివి మార్చి మార్చి చేయడం వల్ల శరీరంలోని వేర్వేరు వ్యవస్థలు చురుకుగా పనిచేస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇందులో వేగమైన నడక (బ్రిస్క్ వాకింగ్), మెట్లు ఎక్కడం, టెన్నిస్ వంటి రాకెట్ ఆటలు, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేసినవారిలో మరణాల ప్రమాదం గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. విభిన్నమైన వర్కవుట్లు ప్రయత్నించినవారు మంచి ఫలితాలు పొందవచ్చు అన్న మాట.

# జుట్టుకు జలగండం

జుట్టుకు, చర్మానికి హాని చేస్తాయి. ముఖ్యంగా నాలుగు రకాల రసాయనాల వల్ల జరిగే అనర్థాలేమిటో తెలిస్తే.. జుట్టును, చర్మాన్ని కాపాడుకోవచ్చు.క్లోరిన్: నీటి శుద్ధి కోసం క్లోరిన్ ఉపయోగిస్తారు. క్లోరిన్ కలిసిన నీళ్లతో తల స్నానం చేస్తే వెంట్రుకలు చిట్లిపోతాయి. అందువల్ల బలహీనపడిన వెంట్రుకలు తెగిపోయి జుట్టు పలుచబడినట్టుగా కనిపిస్తుంది.ఫ్లోరైడ్: అధిక లోతు నుంచి నీటిని తోడినప్పుడు నీటితోపాటుగా భూమి పొరల్లోని ఫ్లోరైడ్ వస్తుంది. ఈ నీటిని ఉపయోగిస్తే తలపై తేమ తగ్గిపోతుంది. కొన్నాళ్లకు వెంట్రుకలు పలుచబడతాయి.ఐసోప్రొపైల్ ఆల్కహాల్: తలకు రాసే నూనెలు, క్రీముల్లో ఉండే ఐసోప్రొపైల్


నీళ్లు చాలా బాగున్నట్టుగానే కనిపిస్తాయి. మున్సిపాలిటీ నీళ్లు శుద్ధి చేశాకే ఇస్తారు. కాబట్టి వాటితో స్నానం చేస్తే చర్మానికి ఏ హానీ ఉండదని భావిస్తారు. కానీ, మున్సిపాలిటీ ఇచ్చే నీరైనా, బోరు బావి నీరైనా వాటిల్లో కనిపించని రసాయనాలు తెలియకుండానే



ఆల్కహాల్ వల్ల మాడు పొడిబారుతుంది. చర్మ ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావం చూపిస్తుంది. సల్ఫేట్స్: వాడే షాంపుల్లో చాలా వాటిలో సోడియం లారిల్ సల్ఫేట్ (ఎస్ఎల్ఎస్) ఉంటుంది. చర్మంపైన ఇది కఠినమైన డిటర్జెంట్‌గా పని చేస్తుంది. ఇది చర్మాన్ని పొడిగా మార్చడమే కాకుండా వెంట్రుకలకూ నష్టం కలిగిస్తుంది.

# వీటి నుంచి ఉపశమనం

ఎండాకాలంలో బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. మండుటెండల్లో వడదెబ్బ, డీహైడ్రేషన్ సర్వసాధారణం. దీనిని నివారించాలంటే శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం మంచి మార్గం. ఒంట్లో వేడి పెరిగితే కనిపించే లక్షణాలు, శరీరం కూల్ అవ్వాలంటే పాటించాల్సిన చిట్కాలను తెలుసుకుందాం.వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మన శరీరం తన సహజసిద్ధమైన చల్లదనాన్ని కోల్పోతుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు కేవలం చెమట మాత్రమే కాకుండా ఇతర లక్షణాలు కనిపిస్తాయి. అధిక



దాహం, నోరు ఎండిపోవడం, మూత్రం పసుపు రంగులోకి మారడం లేదా మంటగా అనిపించడం, తరచుగా తల తిరగడం, అలసట, కండరాల నొప్పులు, చర్మంపై వేడి కురుపులు లేదా దురద రావడం వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. ఇలాంటి సందర్భంలోనే శరీరాన్ని చల్లబరుచుకోవడానికి కొన్ని మార్పులు తప్పనిసరి. వేసవిలో రోజుకు కనీసం 3– 4 లీటర్ల నీరు తాగాలి. బయటికి వెళ్లేటప్పుడు వెంట నీళ్ల బాటిల్ ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం వల్ల గాలి తగిలి చెమట త్వరగా ఆరిపోతుంది.మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ఎండలో తిరగడం తగ్గించాలి. వీటితోపాటు ప్రకృతి అందించిన ఆహార పదార్థాలతో వేడిని సులభంగా తగ్గించవచ్చు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ అందుతాయి. నీటిలో నానబెట్టిన సబ్జా గింజలు అత్యుత్తమ కూలెంట్‌గా పనిచేస్తాయి. పుచ్చకాయ, దోసకాయ, నిమ్మరసం తీసుకోవడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. అయితే చాలా చల్లగా ఉండే డ్రింక్స్ శరీరాన్ని త్వరగా చల్లబరుస్తాయని అనేకమంది అనుకుంటారు. అది కేవలం అపోహ మాత్రమే.అత్యంత చల్లని ఆహారాలు జీర్ణక్రియను ప్రభావితం చేసి, గొంతుకు చికాకు కలిగిస్తాయి. పప్పు, అన్నం, కూరగాయలు వంటి తేలికపాటి భోజనం చేయడం శరీరానికి మేలు చేస్తుంది. ఎకువగా వేయించిన, మసాలా ఆహారాలకు దూరంగా ఉండటం ఎంతో మంచిది. చివరిగా మీ శరీరం ఇచ్చే సంకేతాల్ని నిర్లక్ష్యం చేయకండి. తల తిరగడం, నీరసంతో పాటు అధిక వేడి వల్ల స్పృహ తప్పడం, విపరీతమైన వాంతులు అవుతుంటే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. నిరంతరం అప్రమత్తంగా ఉండటం ద్వారా వేసవి తాపం నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు.

# చిన్నవయసులోనే వార్ధక్యపు ఛాయలా..?

మనం రోజూ తీసుకునే ఆహారంలో కొన్ని పదార్థాలు చర్మానికి చక్కని ప్రయోజనాలు చేకూరిస్తే.. మరికొన్ని మాత్రం హాని కలిగిస్తుంటాయి. ఫలితంగా చర్మం మీద సన్నని గీతలు.. ముడతలు ఏర్పడడం, పొడిబారిపోవడం, నిర్జీవంగా తయారవడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. వాటి వల్ల చిన్నవయసులోనే వార్ధక్యపు ఛాయలు సైతం కనిపిస్తుంటాయి. ఈ క్రమంలో చర్మ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే మనం తీసుకునే ఆహారం విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. బయట దొరికే జ్యూస్‌లు, మిల్క్‌షేక్స్.. వంటి చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవడం వల్ల హార్మోన్ల అసమతుల్యత, చర్మం ముడతలు పడటం.. వంటి సమస్యలు ఎదురవుతాయట. ఫలితంగా యవ్వనంలోనే వయసు పైబడిన ఛాయలు కనిపిస్తాయట. కాబట్టి, బయట దొరికే వాటికి బదులు ఇంట్లోనే వీటిని ఆరోగ్యకరమైన రీతిలో తయారుచేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. పాలు, పాల సంబంధిత ఉత్పత్తుల నుంచి



ప్రొటీన్లు బాగా అందుతాయి. అవి ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ చీజ్, ఐస్‌క్రీమ్.. మొదలైనవి కొందరిలో మొటిమలు రావడానికి కారణమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. డీప్ ఫ్రై చేసిన పదార్థాలు, చిప్స్, జంక్‌ఫుడ్.. మొదలైన వాటికి పూర్తిగా దూరంగా ఉండడమే శ్రేయస్కరం. క్యాన్డ్ లేదా ప్యాకేజ్డ్ ఫుడ్స్ జోలికి అస్సలు పోకూడదట. ఒకవేళ తప్పనిసరిగా అటువంటి పదార్థాలు తీసుకోవాల్సి వస్తే అందులో సోడియం స్థాయులు తక్కువగా ఉండేలా చూసుకోవాలంటున్నారు. అలాగే ఉప్పు ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిది. లేదంటే ముఖం ఉబ్బినట్లుగా కనిపించడం, కళ్ల కింద వాపు.. వంటి సమస్యలు తలెత్తుతాయట. చక్కెర, సోడా.. మొదలైన వాటికి కూడా దూరంగా ఉండాలంటున్నారు. సరిపడినన్ని నీళ్లు తాగడమే కాకుండా ఆ నీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

# రాగుల్లో దాగున్న ‘ఆరోగ్యం’!

మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్ల కారణంగా చాలామంది చిన్న వయసులోనే పలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. వీటిని దూరం చేసుకోవాలంటే సరైన ఆహార నియమాలు పాటించాలని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా రాగుల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాగుల వల్ల ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి.. రాగుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. అలాగే దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుంది. అందుకే ఎదిగే

చ్చంటున్నారు. అధిక బరువుతో బాధపడే వారు రాగులను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. రాగుల్లో ఫైబర్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటుంది. దానివల్ల రాగులు కొద్ది మొత్తంలో తీసుకున్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఫలితంగా ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలన్న కోరిక దరిచేరదు. అదే సమయంలో శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి. బియ్యం, గోధుమలతో పోలిస్తే రాగుల్లో ‘గ్లైసెమిక్ ఇండెక్స్’ తక్కువగా ఉంటుందట. ఫలితంగా రక్తంలోని గ్లూకోజ్ స్థాయులు అదుపులో ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. రాగుల్లో క్యాల్షియంతో పాటు ఫోలిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రాగుల్లో ఉండే ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే



ఇందులో ఉండే క్యాల్షియం, ఐరన్, అమైనో ఆమ్లాలు పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరగడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. రాగులు కేవలం ఆరోగ్యానికే కాదు.. అందాన్నీ ద్విగుణీకృతం చేస్తాయంటున్నారు నిపుణులు. రాగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫినోలిక్ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి

పిల్లలకు రాగులను క్రమం తప్పకుండా ఇవ్వాలంటున్నారు నిపుణులు. అలాగే వయసు మళ్లిన వారు కూడా రాగులను తీసుకోవడం ద్వారా ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడ

వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా కాపాడతాయట. అలాగే వీటిలో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచి.. చర్మ ఆరోగ్యానికి సహాయం చేస్తాయని చెబుతున్నారు నిపుణులు.

# అధిక బరువు.. మెదడుకు చేటు

ఊబకాయం అంటే ఇన్నాళ్లూ శారీరక సమస్యగానే భావించేవారు. కానీ, అధిక బరువు వల్ల మానసిక ఇబ్బందులు కూడా తలెత్తుతాయని పరిశోధకులు చెబుతున్నారు. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె జబ్బులు, డయాబెటిస్ లాంటి వ్యాధులతోపాటు మెదడు ఆరోగ్యానికీ ముప్పేనని హెచ్చరిస్తున్నారు. ఇజ్రాయెల్‌లోని బెన్–గురియన్ యూనివర్సిటీ ఆఫ్ ది నెగెవ్ తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం.. అధిక బరువు వల్ల మెదడుకు కలిగే ముప్పును బయటపెట్టింది. ఊబకాయంతో ముడిపడి ఉన్న కొన్ని కొవ్వు అణువులు శరీర కణజాలాల నుంచి మెదడుకు చేరుతున్నాయట. అక్కడ మెదడు కణాల మధ్య సమాచార మార్పిడికి అంతరాయం కలిగించి.. డిమెన్షియా, అల్జీమర్స్ లాంటి సమస్యలకు కారణం అవుతున్నాయట.అల్జీమర్స్‌తో బాధపడుతున్న ఊబకాయుల ఎంఆర్ఐ రిపోర్టులను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాత ఈ విషయాన్ని తేల్చినట్లు పరిశోధకులు వెల్లడించారు. పొట్ట భాగంలో అంతర్గత కొవ్వు పెరిగే కొద్దీ మెదడు పరిమాణం క్షీణిస్తుందని, మెదడు వృద్ధాప్యం వేగవంతం అవుతుందని వారు గుర్తించారు. ఫలితంగా, వారిలో జ్ఞాపకశక్తి తగ్గడం, ఇతర ఆలోచనాత్మక లోపాలు వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. అయితే, బరువు తగ్గడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చట. ‘గ్రీన్ మెడిటరేనియన్ డైట్’ లాంటి ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని పాటించడం ద్వారా మెదడు ఆరోగ్యం మళ్లీ మెరుగుపడుతుందని అంటున్నారు. పొట్ట దగ్గర కొవ్వును తగ్గించుకుంటే, మెదడు క్షీణత ప్రక్రియ కూడా మందగిస్తుందని చెబుతున్నారు.



## విద్యుత్ సీప్లేన్‌లకు నార్వే పరిజ్ఞానం



దేశంలో ప్రాంతీయ విమానయాన రవాణా సేవలను విస్తరించే లక్ష్యంతో సీప్లేన్ ఆపరేటర్ స్కైహాప్ ఏవియేషన్, నార్వే సంస్థ నోమి ఏరోస్పేస్ అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. భారత్‌తో పాటు దక్షిణాసియాలో విద్యుత్ సీప్లేన్ సేవలను ప్రవేశ పెట్టడంపై ఇరు సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేయనున్నాయి. 2029–30 నాటికి కొనుగోలు లేదా లీజు పద్ధతిలో నోమి ఏరోస్పేస్ నుంచి 10 విద్యుత్ సీప్లేన్‌లను స్కైహాప్ కొనుగోలు చేస్తుంది. పనితీరు ఆధారంగా ఆ తర్వాత మరో 5 విమానాలను తీసుకునే అవకాశం ఉంది. 2030 నాటికి మొత్తం 40 విమానాలు సమకూర్చుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకోగా, అందులో 20–25% విద్యుత్, హైబ్రిడ్ సీప్లేన్‌లు ఉండనున్నాయి.




# యూట్యూబ్‌లో వ్యూస్ లెక్కించే విధానంలో మార్పు..




గూగుల్‌కు చెందిన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ (Youtube) వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు తీసుకురాబోతోంది. వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే ఇకపై వీడియో వ్యూ కౌంట్ ప్రారంభవుతుంది. అన్ని ఫార్మాట్లకు వ్యూస్ లెక్కింపు విధానంలో ఏకరూపత ఉండాలన్న ఉద్దేశంతో ఈ మార్పు చేపడుతోంది. ఆగస్టు 24 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం అమల్లోకి రానుంది. యూట్యూబ్‌లో ప్రస్తుతం లాంగ్ ఫార్మాట్ వీడియోలను ఎవరైనా 30 సెకన్లు పాటు వీక్షిస్తేనే వ్యూగా లెక్కిస్తున్నారు. ఇకపై వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే వ్యూగా కౌంట్ చేస్తారు. యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ విధానాన్ని యూట్యూబ్ ఇప్పటికే అమలు చేస్తోంది. కొత్తగా లాంగ్ ఫార్మాట్ వీడియోలకూ వర్తింపజేయనుంది. వీడియో ప్లే అయిన వెంటనే, లేదా ఎవరైనా లైవ్‌స్ట్రీమ్‌లోకి ప్రవేశించిన వెంటనే ఇకపై పబ్లిక్ వ్యూ నమోదవుతుంది. కేవలం వీడియో ప్లే అయిన తర్వాత చూసి వెళ్లిపోయిన వారిని, ఎక్కువ సమయం చూసిన వారిని వేర్వేరుగా చూపించేందుకు యూట్యూబ్ అనలిటిక్స్‌లో 'ఎంగేజ్డ్ వ్యూస్' ఆప్షన్‌ను ఉంటుంది. దీనిద్వారా నిజంగా తమ కంటెంట్‌ను ఎంతమంది చూస్తున్నారో క్రియేటర్లు తెలుసుకోగలుగుతారు. అయితే, ఈ మార్పు వల్ల ఆదాయం, మానిటైజేషన్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోదని యూట్యూబ్ స్పష్టంచేసింది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌ను అనుసరించే చెల్లింపులు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ఈ మార్పు వల్ల యూజర్లకు వచ్చే ప్రయోజనం ఏమీ లేనప్పటికీ.. క్రియేటర్లకు మాత్రం ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

భారత స్టాక్ మార్కెట్‌ను కొల్లగొట్టి దేశంలో నిషేధం ఎదుర్కొన్న ఈ జేన్‌స్ట్రీట్‌కు.. వాల్‌స్ట్రీట్‌లో తాజాగా గట్టి షాక్ తగిలింది. నేరుగా ఈ కంపెనీ నష్టపోనప్పటికీ.. నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ హెడ్జ్‌ఫండ్ భారీగా నష్టపోవడంతో జేన్‌స్ట్రీట్‌కూ భారీగానే నష్టం వాటిల్లింది. వక్రమార్గంలో భారత స్టాక్ మార్కెట్‌ను మోసం చేసిన ఈ సంస్థకు.. ఏడాది తిరగకముందే అంతకు రెండు, మూడింతలు నష్టపోవడం గమనార్హం. ఇంతకీ ఏం జరిగిందంటే? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడైన 24 ఏళ్ల లియోపోల్డ్ ఆస్చెన్‌బ్రెన్నర్ ఆస్చెన్‌బ్రెన్నర్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ పేరిట హెడ్జ్




ఫండ్‌ను స్థాపించాడు. 19 ఏళ్లకే కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడైన ఈయన.. గతంలో ఎఫ్‌టీఎక్స్, ఓపెన్‌ఏఐలలో పనిచేశాడు. అయితే, సెమీకండక్టర్ షేర్లపై సిట్యువేషనల్ అవేర్‌నెస్ పెట్టిన పెట్టుబడులు బెడిసికొట్టడంతో ఈ సంస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. దీంతో ఈ హెడ్జ్ ఫండ్‌లో పెట్టుబడులు కలిగిన జేన్‌స్ట్రీట్‌కూ భారీగా నష్టం వాటిల్లింది. సిట్యువేషనల్ అవేర్‌నెస్ సంస్థ జూన్ నెలలో శాన్‌డిస్క్‌లో 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్లు చొప్పున పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర కుప్పకూలాయి. దీంతో కేవలం ఒక్క నెలలోనే పోర్ట్‌ఫోలియో విలువ దాదాపు 67 శాతం ఆవిరైంది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 10 శాతం వాటా కలిగిన బ్లూమ్ ఎనర్జీ షేర్లు కూడా అదే నెలలో 31 శాతం పడిపోయాయి. టీఎస్ఎంసీ, నెబియస్ షేర్లలో పెట్టిన పెట్టుబడులు కూడా నష్టాలను మిగిల్చాయి. ఫలితంగా 45 బిలియన్లుగా ఉన్న ఫండ్ విలువ దాదాపు 10 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ పతనం కారణంగా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ దాదాపు 15 బిలియన్ డాలర్లు నష్టపోయినట్లు తెలిసింది. అంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.1.25 లక్షల కోట్లకు పైమాటే.
మన స్టాక్‌మార్కెట్‌లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించినట్లు తేలడంతో గతేడాది జులైలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. స్టాక్‌మార్కెట్లో ఇండెక్స్ (ఆయా రంగాల సూచీ) ధరలను ప్రభావితం చేసి, మదుపరుల సొమ్మును ఈ సంస్థ కొల్లగొట్టింది. దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ నిర్ధారించింది. కొన్నింట్లో వచ్చిన నష్టాలను మినహాయిస్తే నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించింది. దీంతో రూ.4,843 కోట్లు జరిమానాగా చెల్లించాలని సెబీ ఆదేశించింది.

## సన్‌షైన్ పిక్చర్స్ ఐపీఓ.. 90 నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి




ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ విపుల్ షాకు చెందిన సన్‌షైన్ పిక్చర్స్‌కు మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చిన తొలి 90 నిమిషాల్లో బిడ్డింగ్ పూర్తయింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 54.59 లక్షల షేర్లకు గానూ.. 54.86 లక్షల బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ కోటా 1.49 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 1.16 రెట్లు చొప్పున సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.84.64 కోట్ల నిధులను సమీకరించింది. సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల నిధుల లక్ష్యంతో మంగళవారం ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 20న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.342–360గా కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. విపుల్ అమృతలాల్ షా, షెఫాలీ విపుల్ షా ప్రమోటర్లుగా తమ వాటాలను ఆఫర్ ఫర్ సేల్‌లో విక్రయిస్తున్నారు. ఈ కంపెనీ షేర్లు ఆగస్టు 25న స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి.

18 శాతం ప్రీమియంతో మిల్కీమిస్ట్ లిస్టింగ్

డెయిరీ ఉత్పత్తులు తయారు చేసే మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ కంపెనీ మదుపర్లకు లిస్టింగ్ లాభాలను అందించింది. మంగళవారం దాదాపు 18 శాతం ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.140 కాగా.. దాదాపు 18 శాతం లాభంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.165 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఓ దశలో 29.60 శాతం పెరిగి 181.45 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.13,968.81 కోట్లకు చేరింది. ఈ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. చివరి రోజు నాటికి 56.12 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదు చేసింది. రూ.1,553 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 11న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు రాగా.. 13న ముగిసింది.

# పెరగనున్న కోల్గేట్ ధరలు!




ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ కోల్గేట్–పామోలివ్ తన ఉత్పత్తుల ధరలను పెంచే యోచనలో ఉంది. రానున్న త్రైమాసికాల్లో ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముడిసరుకుల వ్యయం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకొనేందుకు ఈ ధరల పెంపు అనివార్యమైందని కంపెనీ పేర్కొన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. "గతేడాది జీఎస్టీ సవరణ వల్ల ఉత్పత్తుల బరువును పెంచాం. ప్రస్తుతం రూ.10, రూ.20 నుంచే కోల్గేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులతో ముడి సరుకుల సరఫరాపై ప్రభావం పడుతోంది. ఇప్పుడు ధరలు పెంచకపోతే భవిష్యత్తులో ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని కంపెనీ సీఈవో అండ్ ఎండీ ప్రభా నరసింహన్ తెలిపారు. అలాగే, కంపెనీ టూత్ బ్రష్, టూత్ పేస్ట్ రెండింటిలోనూ ప్రీమియం ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కోల్గేట్–పామోలివ్‌కు చెందిన పర్సనల్ కేర్ బ్రాండ్ పామోలివ్ మార్కెట్ పనితీరుపై ప్రభా నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకునేందుకు బాంబే షేవింగ్ కంపెనీతో జట్టు కట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ పతాంజలి, హెలియోన్ కంపెనీకి చెందిన సెన్సోడైన్, హిందూస్థాన్ యునిలీవర్‌కు చెందిన పెప్సోడెంట్ ఉత్పత్తులతో పోటీపడుతోంది.

# చరిత్రలో తొలిసారి టాటా సన్స్ ఏజీఎం వాయిదా..




టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం అనుకున్నట్లుగానే వాయిదా పడింది. తగినంత కోరమ్ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. టాటా గ్రూపు కంపెనీలకు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. మళ్లీ ఎప్పుడు ఏజీఎం నిర్వహించాలనే అంశంపై బోర్డు సభ్యులతో ఛైర్మన్ సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోనున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18న బాంబే హౌస్‌లో నిర్వహించ తలపెట్టిన ఏజీఎంకు ఛైర్మన్ చంద్రశేఖరన్, కొందరు బోర్డు సభ్యులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. నోయల్ టాటా, మెహ్లీ మిస్త్రీ సహా మరికొందరు సైతం ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. అయితే, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నిషేధం కారణంగా టాటా సన్స్‌లో కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) తన ప్రతినిధిని నామినేట్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ట్రస్ట్ ప్రతినిధి గైర్హాజరీతో కోరమ్ లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఇదే విషయాన్ని మరో ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ ముందుగానే టాటా సన్స్‌కు తెలియజేసింది. దీంతో ఏజీఎం వాయిదా ముందుగా ఊహించినదే. వాస్తవానికి ఈ సమావేశంలో టాటా సన్స్‌కు ప్రస్తుత చంద్రశేఖరన్‌ను డైరెక్టర్‌గా రీనామినేట్ చేసే అంశం పరిశీలనతో పాటు, 2025–26 ఆర్థిక సంవత్సర స్టాండలోన్, ఏకీకృత ఖాతాలను పరిశీలించి, ఆమోదించాల్సి ఉంది. డివిడెండునూ ప్రకటించాల్సి ఉంది.




## విలియమ్స్ సిస్టర్స్ రీఎంట్రీలో మళ్లీ ఓటమే..



నాలుగేళ్ల తర్వాత ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి అడుగు పెట్టిన అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఇటీవల సింగిల్స్‌లో ఓటమిని చవిచూసిన ఆమె.. తాజాగా తన సిస్టర్ వీనస్‌తో కలిసి బరిలోకి దిగిన డబుల్స్‌లోనూ ఓటమి తప్పలేదు. సిన్సినాటి ఓపెన్ డబుల్స్‌లో సెరెనా – వీనస్ జోడీ చివరి వరకూ పోరాడినా 2–6, 6–1, 8–10 తేడాతో మోర్తా కోత్సుయక్–స్టీర్న్స్ చేతిలో ఓడిపోయింది. గత వింబుల్డన్‌లో సెరెనాకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. 44 ఏళ్ల సెరెనాకు ఓటమి తప్పలేదు. ఆస్ట్రేలియాకు చెందిన యువ ప్లేయర్ మాయా జాయింట్ చేతిలో 3–6, 7–6 (8–6), 3–6 తేడాతో పరాజయం చవిచూసింది. ఇప్పుడు డబుల్స్‌లోనూ సెరెనా ఓటమిపాలైంది. తన సింగిల్స్ కెరీర్‌లో 23 గ్రాండ్‌స్లామ్‌లను నెగ్గిన సెరెనా.. డబుల్స్‌లోనూ 14 టైటిళ్లను సాధించింది. తన అక్కతో కలిసే వీటన్నింటినీ నెగ్గడం గమనార్హం.

# దూసుకుపోతున్న పుల్లెల గాయత్రి

భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది పుల్లెల గాయత్రి. ట్రీసా జాలీ జంటగా అంతర్జాతీయ స్థాయిలో స్థిరంగా రాణిస్తోంది. గాయత్రి నిలకడగా మంచి ప్రదర్శనలు చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను తాజాగా అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గాయత్రి కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను ఓసారి పరిశీలిస్తే.. గాయత్రి బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కుమార్తె అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆమె తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ బ్యాడ్మింటన్‌లో దూసుకుపోతోంది. ట్రీసా జాలీతో కలిసి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ 2022లో మహిళల డబుల్స్ సెమీ ఫైనల్‌కు చేరడంతో గాయత్రి బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అప్పట్నుంచి వరుస విజయాలతో అంచెలంచెలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటోంది. తండ్రి బ్యాడ్మింటన్ ప్లేయర్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆటపై ఆసక్తిని పెంచుకుంది. గోపీచంద్ అకాడమీలో స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి.సింధులను గమనించి వారితో కలిసి శిక్షణ పొంది తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది. గాయత్రి వివిధ జూనియర్ అంతర్జాతీయ టోర్నమెంట్లలో రాణించి 15 ఏళ్ల వయసులోనే అండర్–17 విభాగంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. దేశవాళీ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో అద్భుత విజయాలు సాధిస్తూ 15 ఏళ్లకే జకార్తా 2018 ఆసియా క్రీడల కోసం భారత బ్యాడ్మింటన్ జట్టులో చోటు దక్కించుకుని సంచలనం సృష్టించింది. ఆసియా క్రీడలలోని అనుభవంతో గాయత్రి 2019లో సీనియర్ స్థాయి పోటీల్లో అడుగుపెట్టి నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించింది. కొవిడ్ మహమ్మారితో 2020 ఏడాది వృథా కాగా.. 2021 సంవత్సరం గాయత్రి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. అప్పటివరకు ప్రధానంగా సింగిల్స్ క్రీడాకారిణిగా ఉన్న గాయత్రి.. తండ్రి గోపీచంద్, కోచ్ అరుణ్ విష్ణు ప్రోత్సాహంతో డబుల్స్ విభాగంలోనూ ప్రయత్నించాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో గోపీచంద్ అకాడమీలో ట్రీసా జాలీ రూపంలో గాయత్రికి సరైన జోడీ దొరికింది. ఈ జంట 2021లో 'ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్'లో స్వర్ణ పతకాన్ని సాధించగా.. ఆ తర్వాత వెల్ష్ ఇంటర్నేషనల్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 2022లో గాయత్రి, ట్రీసా జాలీ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ ఫైనల్‌కు చేరడంతో పాటు ఒడిశా ఓపెన్‌లో తమ తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సొంతం చేసుకున్నారు. ఈ జోడీ వరుసగా రెండుసార్లు (2024, 2025) సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించింది.



భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఎన్నో అద్భుత విజయాలు సాధించి దిగ్గజ ఆటగాడిగా గుర్తింపు పొందిన గోపీచంద్ తన కుమార్తె ఏ రంగం వైపు వెళ్లాలనే విషయంలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చానని ఓ సందర్భంలో అన్నారు. 'బ్యాడ్మింటన్ ఆడాలనేది ఆమె నిర్ణయమే. ఒకవేళ ఆడటం ఇష్టం లేకపోతే ఫర్వాలేదని నేను ఎప్పుడూ చెబుతూనే వచ్చాను. కానీ నాకంటే ఆమెకే దీనిపై ఎక్కువ ఆసక్తి ఉంది. దీనికి నేను చాలా సంతోషిస్తున్నాను'' అని గోపీచంద్ తెలిపారు.

# నాలుగు వికెట్లు కోల్పోయిన శ్రీలంక



భారత్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక నాలుగో వికెట్ కోల్పోయింది. ఆ జట్టు 47 పరుగుల వద్ద ఉండగా లాహిరు ఉదార (16)ని మానవ్ సుతార్ ఔట్ చేశాడు. గల్లీలో జురెల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఉదార వెనుదిరగక తప్పలేదు. 22 ఓవర్లకు శ్రీలంక స్కోరు 49/4. ధనంజయ డిసిల్వా (20), సోనల్ దినూష (1) క్రీజులో ఉన్నారు. లంక విజయ లక్ష్యం 372. భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాటపడుతున్నారు. 372 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక 21 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. నిషాన్ మదుశంక (6)ను సిరాజ్ వెనక్కి పంపాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో పసిందు సూర్యబండార (0) తాను ఎదుర్కొన్న తొలి బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. కమిందు మెండిస్ (2)ని ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేశాడు. 12 ఓవర్లకు శ్రీలంక స్కోరు 23/3. లాహిరు ఉదార (13), ధనుంజయ డిసిల్వా (0) క్రీజులో ఉన్నారు. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 193 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని భారత్ మొత్తం 371 రన్స్ లీడ్‌ను సాధించింది.

# ఓపెనర్‌ను మార్చేసిన ఆసీస్



ప్రత్యర్థులను తన ఆటతో కంగారు పెట్టించే ఆస్ట్రేలియా వెనుకడుగు వేసింది. బంగ్లాదేశ్ చేతిలో ఘోర ఓటమితో విమర్శలు ఎదుర్కొంది. దీంతో కీలక నిర్ణయం తీసుకుంది. ఫలితం ఎలా ఉన్నా స్క్వాడ్‌ను మార్చేందుకు ఆసీస్ మొగ్గు చూపదు. కానీ, బంగ్లాతో రెండు టెస్టుల సిరీస్‌లో 0–1తో ఆసీస్ వెనుకంజలో ఉంది. రెండో టెస్టులోనైనా గెలిచి సిరీస్‌నను కోల్పోకుండా ఉండాలనేది ఆసీస్ ఆలోచన. అందుకోసం సెకండ్ టెస్టు కోసం తన తుది జట్టులో మార్పులు చేసింది. ఓపెనర్‌గా వచ్చిన జేక్ వెదర్లాడ్‌ను తప్పించింది. పాత ఓపెనర్ మాథ్యూ రెన్‌షా కు అవకాశం ఇచ్చింది. వెదర్లాడ్ తొలి టెస్టులో 23, 0కే పెవిలియన్ చేరాడు. దీంతో అతడిపై వేటుపడింది. వెదర్లాడ్ స్థానంలో వచ్చిన రెన్‌షా చివరిసారిగా ఆసీస్ తరపున మూడేళ్ల కిందట టెస్టు మ్యాచ్ ఆడటం గమనార్హం. దిల్లీ వేదికగా భారత్‌తో 2023లో రెన్‌షా టెస్టు మ్యాచ్ ఆడాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అవకాశాలు రాకపోయినా.. పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టులో మాత్రం ప్లేస్ సంపాదిస్తున్నాడు. మరోవైపు బంగ్లాతో తొలి టెస్టు విఫలమైన స్టార్ ఆటగాడు మార్నస్ లబుషేన్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఆగస్టు 22 నుంచి ఆస్ట్రేలియా – బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. రెండో టెస్టు కోసం ఆసీస్ స్క్వాడ్: పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బొలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్, నాథన్ లయన్, మాథ్యూ రెన్‌షా, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్.

# భారత టెస్టు చరిత్రలో తొలి బ్యాటర్‌గా రిషభ్ పంత్ రికార్డు

టీమ్‌ఇండియా డాషింగ్ ఆటగాడు రిషభ్ పంత్ చరిత్ర సృష్టించాడు. భారత టెస్టు చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు. ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కాని ఫీట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. అదేనండి.. టెస్టుల్లో భారత్ తరపున శత సిక్స్‌ల వీరుడిగా నిలిచాడు. శ్రీలంకతో జరుగుతోన్న తొలి టెస్టులో పంత్ 66 పరుగులు చేశాడు. ఇందులో రెండు సిక్స్‌లు ఉన్నాయి. దీంతో 100 సిక్స్‌లు కొట్టిన తొలి భారత బ్యాటర్‌గా అవతరించాడు. అతడి తర్వాత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ (90), రోహిత్ శర్మ (88) ఉన్నారు.



ప్రస్తుతం భారత్ తరఫున ఆడుతున్నవారిలో రవీంద్ర జడేజా (82) మాత్రమే కాస్త దగ్గరగా ఉన్నాడు. యువ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్ (47), యశస్వి జైస్వాల్ (45)కు ఈ మార్క్‌ను అందుకొనే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా రిషభ్ పంత్ కంటే ముందు ముగ్గురు మాత్రమే ఈ ఫీట్‌ను సాధించారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ (122 టెస్టుల్లో 138 సిక్స్‌లు), బ్రెండన్ మెక్‌కల్లమ్ (101 మ్యాచుల్లో 108), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (96 టెస్టుల్లో 100) వంద సిక్స్‌ల మైలురాయిని దాటారు. అత్యంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించిన బ్యాటర్ మాత్రం రిషభ్ పంత్‌నే. అతడు కేవలం 51వ టెస్టుల్లోనే నమోదు చేశాడు. మున్ముందు మెక్‌కల్లమ్‌తోపాటు బెన్ స్టోక్స్ అత్యధిక సిక్స్‌ల రికార్డును పంత్ బద్దలు కొట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

వుదయం సినిమా MOVIE TIME!

# #Mega158 / #ChiruBobby2.. 40 రోజుల షూటింగ్ పూర్తి



**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత మరోసారి కలిసి ప్రస్తుతం #Mega158 / #ChiruBobby2 చేస్తున్నారు. ఈ సినిమాను KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాబీ కొల్లి తన విజన్‌ను తెరపైకి తీసుకురావడానికి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి పూర్తి సపోర్ట్‌తో, టీమ్ అంతా ఒకే స్పీడ్‌లో పనిచేస్తుండటంతో సినిమా షూటింగ్ ఇప్పటికే 40 రోజులు పూర్తి చేసుకుంది. ఇంత తక్కువ సమయంలో ఇంత కీలకమైన ప్రోగ్రెస్ సాధించడం సినిమాను ఏ స్థాయిలో తెరకెక్కిస్తున్నారో స్పష్టం అవుతుంది.సినిమా ఫస్ట్ హాఫ్ దాదాపు లాక్ అయింది. ఇప్పటివరకు తీసిన ఔట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. కథలో ఇంటెన్సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, యాక్షన్ అన్నీ సరైన బ్యాలెన్స్‌లో ఉండేలా సినిమా రూపొందుతోంది. ఇటీవల షూట్ చేసిన ఇంటర్వెల్ ఫైట్ సినిమాకు మరో ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. భారీ స్థాయిలో డిజైన్ చేసి తెరకెక్కించిన ఈ యాక్షన్ బ్లాక్ ఫస్ట్ హాఫ్‌కు పవర్‌ఫుల్ హైలైట్‌గా ఉండబోతోంది. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌కు బాబీ కొల్లి మార్క్ మాస్ ఎలివేషన్స్ తోడవడంతో ఈ ఇంటర్వెల్ సీక్వెన్స్ థియేటర్లలో గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంటుందని తెలుస్తోంది.ఆగస్టు 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా భారీ అప్‌డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ స్పెషల్ అప్‌డేట్ కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ స్మూత్‌గా కొనసాగుతుండటంతో పాటు ఫస్ట్ హాఫ్ ఎడిట్ కూడా దాదాపు పూర్తవ్వడంతో ప్రొడక్షన్ నెక్స్ట్ ఫేజ్‌లోకి వెళ్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.ఈ సినిమాలో అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్, ఆంటోనీ ఎల్. రూబెన్ ఎడిటింగ్. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషనల్ స్క్రీన్ ప్లే రైటర్స్‌గా పనిచేస్తున్నారు.

# 'ఇరుముడి'లో చాలా కొత్త రవితేజని చూస్తారు..

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం గ్లింప్స్, ట్రైలర్, పాటలతో ఇప్పటికే భారీ అంచనాలు రేకెత్తించింది.



దర్శకుడు శివ నిర్వాణ

**రామ్ చరణ్ ఈ సినిమాలో కనిపిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. నిజంగా ఆయన కనిపిస్తారా?**

–లేదండి. అది సోషల్ మీడియా ప్రచారం మాత్రమే. రామ్ చరణ్ గారు అయ్యప్ప భక్తులు. ఆయనకు ఆ వైబ్ వుంటుంది. బహుశా అభిమానులు అలా కోరుకున్నారేమో. కానీ ఇందులో చరణ్ గారు కనిపిస్తారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. ఈ సినిమా రామ్ చరణ్ గారికి నచ్చాలని కోరుకుంటున్నా.

**రవితేజని చాలా కొత్తగా చూపించారు. ఆయనను అలా చూపించడానికి మీరు చేసిన ప్రిపరేషన్ ఏమిటి?**

–ఎప్పుడైనా ఎవరూ టచ్ చేయని పాయింట్ చెప్తున్నప్పుడు ఒక యాక్టర్ చేస్తే ఒకలా ఉంటుంది. అదే స్టార్ చేస్తే దాని రీచ్ మరోలా ఉంటుంది. అయ్యప్ప స్వామిమాల నేపథ్యం, అందులో ఫ్యామిలీ, అలాగే కొత్త సెటప్. ఇలాంటి కథని రవితేజ గారి లాంటి స్టార్ హీరోతో చేసినప్పుడు ఆ కథ ప్రతి ఇంటికి చేరుతుంది.

**ఫస్ట్ లుక్ రిలీజ్ అయిన తర్వాత మలయాళ మాలికాపురం తో పోలిక వచ్చింది కదా? ఎలా అనిపించింది మీకు?**

–అయ్యప్ప స్వామి బ్యాక్‌గ్రౌండ్‌లో, ముఖ్యంగా సౌత్‌లో చాలా తక్కువ సినిమాలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడో ఒకసారి 'అయ్యప్ప స్వామి మహత్యం' అనే సినిమా వచ్చింది.

**అయ్యప్ప స్వామి మాల నేపథ్యంలో కథ ఉంటుంది కదా? దీని గురించి మీరు ఎలాంటి హోంవర్క్ చేశారు?**

–నేను ఈ కథ అనుకున్న తర్వాత అయ్యప్ప స్వామి మాల గురించి చాలామందిని అడిగి అన్ని విషయాలు తెలుసుకున్నాను. అయితే ఎంతమందిని, ఎన్ని విషయాలు అడిగినా సరే ఏదో ఒక అసంతృప్తి ఉండేది. నేను ఈ సినిమా కోసం మాల కూడా వేశాను. ఫిలింనగర్ పడిపూజలకు వెళ్లాను. గురుస్వాములను కలిశాను. అంతకుముందు దర్శకుడు హను రాఘవపూడి గారితో శబరిమల కూడా వెళ్లాను. ఇందులో మంగళహారతులు, భజనలు, రుద్రాక్షలు వేసుకునే విధానం... అన్నీ చాలా ప్రామాణికంగా ఉంటాయి.

**ఈ కథ అనుకున్నప్పుడే రవితేజ ని అనుకున్నారా?**

–ఈ కథ అనుకున్నప్పుడు ఎవరినీ మనసులో అనుకోలేదు. కాకపోతే ఇది రవితేజకి చెప్పిన తర్వాత ఈ పాత్రకి పర్ఫెక్ట్‌గా సరిపోతారు అనిపించింది. ఆయన గడ్డం, ఆయన తేజస్సు ఈ పాత్రకి అద్భుతంగా సరిపోయాయి.

**'మల్లెపూల పల్లకి' పాట గురించి?**

–'మల్లెపూల పల్లకి' పాటకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. విడుదలైన రెండు రోజుల్లోనే 9 మిలియన్స్ వ్యూస్ క్రాస్ చేసింది. ఇది అయ్యప్ప స్వామి మాల నేపథ్యంలో జరిగే కథ కాబట్టి ఇందులో భజనలు, పాటలు ఉంటాయి. సీలేరు ప్రాంతంలో అయ్యప్ప స్వామి భక్తులు ఎక్కువగా పాడుకునే పాట ఏదని ఒక స్వామిని అడిగాను. ఆయన 'మల్లెపూల పల్లకి' పాట గురించి చెప్పారు. ఆ పాటతో షూటింగ్ చేశాము. ఆ తర్వాత చాలామంది ఈ పాట గురించి రిక్వెస్ట్ చేశారు. మేము అనుకున్నది, అభిమానులు కోరుకుంటుంది ఒకటే అని హ్యాపీగా అనిపించింది.

# అక్టోబర్ 2న 'సిగ్మా' గ్రాండ్ రిలీజ్



**వుదయం సినిమా:** సందీప్ కిషన్ హీరోగా, జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న యాక్షన్ అడ్వెంచర్ 'సిగ్మా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు విడుదలైన టీజర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా, తొలి రెండు సింగిల్స్ కూడా చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.తాజాగా మేకర్స్ 'సిగ్మా' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. గాంధీ జయంతి హాలిడేతో పాటు ఆ తర్వాత వీకెండ్ కూడా కలిసిరావడంతో ఈ రిలీజ్ డేట్ సినిమాకు మంచి అడ్వాంటేజ్ కానుంది. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సందీప్ కిషన్ ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. వార్మ్ లైటింగ్‌తో ఉన్న ఇంటీరియర్‌లో ఓ డాగ్ పక్కన నిలబడి, కిటికీ నుంచి వస్తున్న గోల్డెన్ సన్‌లైట్ మధ్య కనిపిస్తున్న ఆయన లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్ రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు థమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. క్రిష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్. హరిహరసుతన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ నా వర్క్ చూసి పర్సనల్‌గా పిలిచి మాట్లాడారు..

**వుదయం సినిమా:** 'ఆయ్', 'సేవ్ ది టైగర్స్', 'వికటకవి', 'గుర్తుకొస్తున్నాయి' వంటి అద్భుతమైన ప్రాజెక్ట్‌లతో సంగీత దర్శకుడిగా అజయ్ అరసాడ తెలుగు ప్రేక్షకుల్లో ఓ ముద్ర వేశారు. వరస ఆఫర్లతో మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతోన్న అజయ్ అరసాడ తన సినీ జర్నీని పంచుకున్నారు. ఈ క్రమంలో ఆయన ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..



సంగీత దర్శకుడు అజయ్ అరసాడ

**'మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మా ఫ్యామిలీ, నా రక్తంలోనే ఆర్ట్, మ్యూజిక్ ఉంది. మాది వైజాగ్. టీసీఎస్‌లో ఉద్యోగం కూడా చేశాను. ఏడేళ్లు జాబ్ చేశాను. అలా జాబ్ చేస్తుండగానే రెండు సినిమాలకు పని చేశాను. నాకు దేవీ శ్రీ ప్రసాద్ స్ఫూర్తి. మా అమ్మ, భార్య సపోర్ట్ వల్లే నేను ఈ ఇండస్ట్రీలోకి రాగలిగాను.

**చిన్న చిత్రాల్ని చేస్తుండటంలో మీరు ఎదుర్కొన్న ఛాలెంజెస్ ఏంటి?**

చిన్న చిత్రాలకు పని చేయడం వల్ల నాకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు. మంచి ప్రొడక్షన్స్ కావడం వల్ల ఎప్పుడూ కూడా పేమెంట్స్ విషయంలో తేడా రాలేదు. ఈ క్రమంలో నాకు ఎలాంటి ఛాలెంజెస్ ఎదురు కాలేదు.

**మీకంటూ ఓ ప్రత్యేకత ఏర్పడాలని ప్రయత్నిస్తున్నారా?** అన్ని రకాల జానర్లు, కథల్ని చేయాలని అనుకుంటున్నాను. నా వద్దకు వచ్చిన కథకు న్యాయం చేయాలని చూస్తాను. నా వద్దకు మాస్ కథ వస్తే.. మాస్ మ్యూజిక్ వస్తుంది. తమిళ్ నుంచి వస్తే కొత్తగా ఇస్తాడు, మలయాళం నుంచి వస్తే ఫ్రెష్‌గా ఇస్తారని ఇక్కడ కొంత మంది నమ్ముతారు.

**బడ్జెట్‌ను పట్టి మ్యూజిక్ మారుతుందా?**

ఒక్కో సింగర్ ఒక్కోలా ఛార్జ్ చేస్తారు. నా పాటకు ఎవరు సెట్ అవుతారు అని అనుకుంటే వారితోనే ప్రొసీడ్ అవుతాను. ఎందుకంటే ఫైనల్‌గా అది నా పాట. జీవితాంతం నిలిచే పోయే పాటగా ఉండాలని చూస్తాను. కెరీర్ స్టార్టింగ్‌లో అనురాగ్ కులకర్ణితో పాడిస్తా అని అంటే ఓ నిర్మాత వద్దని అన్నాడు. ఇప్పుడు ఆ నిర్మాతే అనురాగ్‌తో పాడించుకునే స్థాయిలో లేడు (నవ్వుతూ).

**మ్యూజిక్ మీద ఏఐ ప్రభావం ఎంత వరకు ఉంటుంది?** మ్యూజిక్ మీద ఏఐ ఎలాంటి ప్రభావాన్ని చూపించ లేదు. ఏఐలో ఎంత ప్రాంప్టింగ్ ఇచ్చినా కూడా ఒకేలా ఉంటాయి. కొంత మంది నిర్మాతలు ఏఐ నుంచి ట్రాక్స్ పంపి.. ఇలా కావాలని అంటారు. అలాంటప్పుడు మేం ఎందుకు మీరే కొట్టుకోండి అన్నట్టుగా అనిపిస్తుంది (నవ్వుతూ).

# 28న 'గీతాంజలి' వరల్డ్‌వైడ్ రీ-రిలీజ్

**వుదయం సినిమా:** కింగ్ నాగార్జున ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటి 'గీతాంజలి'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన ఈ క్లాసిక్ లవ్‌స్టోరీ ఇప్పుడు మరోసారి థియేటర్లలో తన మ్యాజిక్‌ను చూపించడానికి రెడీ అవుతోంది. ఆగస్టు 28న నాగార్జున బర్త్‌డే సందర్భంగా 'గీతాంజలి' తెలుగు, తమిళ భాషల్లో 4K ఫార్మాట్‌లో ప్రపంచ వ్యాప్తంగా రీ–



రిలీజ్ కానుంది. రక్షాబంధన్ స్పెషల్ కూడా కావడంతో ఈ రీ–రిలీజ్ మరింత ప్రత్యేకంగా మారింది. శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్‌పై బూర్లె శివ ప్రసాద్ ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను లేటెస్ట్ టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.'గీతాంజలి' అంటే ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తొచ్చేది అందమైన ప్రేమకథ, మనసును తాకే సంగీతం, అద్భుతమైన విజువల్స్, గుర్తుండిపోయే పెర్ఫార్మెన్స్. నాగార్జునను ఎంతో చార్మింగ్‌గా, ఎమోషనల్‌గా చూపించిన ఈ సినిమా ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. మణిరత్నం తనదైన స్టోరీటెల్లింగ్‌తో ఈ ప్రేమకథను ఒక అందమైన కవితలా తెరకెక్కించారు. ఇళయరాజా అందించిన సంగీతం సినిమాకు మరో బలంగా నిలిచి 'గీతాంజలి'ని క్లాసిక్‌గా మార్చింది. నాగార్జున సరసన గిరిజ హీరోయిన్‌గా నటించారు.ఈసారి 4K ఫార్మాట్‌లో 'గీతాంజలి'ని చూడటం ఈ రీ–రిలీజ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది. మరింత క్లారిటీ, డీటెయిలింగ్‌తో విజువల్స్‌ను ప్రేక్షకులు కొత్త అనుభూతితో ఎక్స్‌పీరియన్స్ చేయబోతున్నారు. అప్పట్లో థియేటర్లలో 'గీతాంజలి'ని చూసిన వారికి ఇది మరోసారి ఆ రోజులను గుర్తుచేసే నాస్టాల్జిక్ జర్నీ కానుంది. ఇక ఈ సినిమాను థియేటర్లలో చూడని నేటి జనరేషన్‌కు మాత్రం ఒక ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేసే అవకాశం దక్కనుంది. ఆగస్టు 28న 4Kలో 'గీతాంజలి' మరోసారి థియేటర్లలో మ్యాజిక్ క్రియేట్ చేయనుంది.

# 'ది రెడ్ బ్యాగ్' అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునేలా ఉంటుంది :

**వుదయం సినిమా:** మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే ఈ మూవీని రవి కుమార్ సీరపు తెరకెక్కించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశి కీలక పాత్రలు పోషించారు.



ఈ చిత్రాన్ని పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఆగస్ట్ 21న భారీ ఎత్తున విడుదల చేయబోతోంది. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ .. 'మా 'రెడ్ బ్యాగ్' చిత్రానికి మంచి హైప్ ఏర్పడింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్‌కి మంచి ఆదరణ దక్కింది. గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా యూట్యూబ్‌లో ట్రెండ్ అయ్యాయి. మా కంటెంట్‌కి అన్ని వైపుల నుంచి ప్రశంసలు దక్కాయి. మా సినిమా చాలా స్టైలిష్‌గా ఉందని, యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉన్నాయని అంతా ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. ఇప్పటి వరకు చూసిన కంటెంట్ కంటే సినిమా పది రెట్లు ఎక్కువగా ఇంపాక్ట్ క్రియేట్ చేసేలా ఉంటుంది. ఈ చిత్రంలోని ట్విస్ట్‌ల్ని ఎవ్వరూ గెస్ చేయలేరు.చివరి వరకు ఉత్కంఠ భరితంగానే సాగుతుంది. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం.యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ఆర్టిస్టులు, టెక్నికల్ టీం అంతా కూడా మాకు సహకరించారు. ఇక ఆగస్ట్ 21న సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నాం. మాకు విడుదల విషయంలో పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ వారు అద్భుతంగా సపోర్ట్ ఇస్తున్నారు. వారి సహకారంతోనే ఎక్కువ స్క్రీన్‌లలో మూవీని రిలీజ్ చేయగల్గుతున్నాం. మా చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

# ప్రేక్షకులను అలరించిన చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'




**వుదయం సినిమా:** ఫస్ట్ లవ్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తూ, హృదయాన్ని హత్తుకునే కథనంతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'చెన్నై లవ్ స్టోరీ' ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ఈ రొమాంటిక్ డ్రామా ఆగస్టు 21న సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. హృదయాన్ని హత్తుకునే కథనం, మనసుకు హాయినిచ్చే సంగీతం, ఆకట్టుకునే నటీనటుల పెర్ఫార్మెన్స్‌తో థియేటర్లలో ప్రేక్షకులను మెప్పించిన ఈ సినిమా రూ.60 కోట్లకు పైగా గ్రాస్‌ను సాధించింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. రవి నంబూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి రవి నంబూరి, సాయి రాజేష్ నీలం స్క్రీన్‌ప్లే అందించారు. సాయి రాజేష్ కథను అందించగా.. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్లపై ఎస్‌కేఎన్, సాయి రాజేష్ నీలం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటించారు. చెన్నై సిటీ బ్యాగ్రౌండ్ లో రూపొందిన ఈ కమింగ్ ఆఫ్ ఏజ్ రొమాంటిక్ డ్రామా ఇద్దరు యువ హృదయాల చుట్టూ తిరుగుతుంది.

# 'ఇట్లు అర్జున' నుంచి సాంగ్ రిలీజ్

**వుదయం సినిమా:** స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా, అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాతో మహేష్ ఉప్పల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్, ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ఆసక్తి పెంచుకున్న ఈ సినిమా నుంచి తాజాగా రెండో సింగిల్ 'చిన్ని చిన్ని'ను మేకర్స్ విడుదల చేశారు.ఎస్. థమన్ కంపోజ్ చేసి, ప్రోగ్రామ్ చేసి, అరేంజ్ చేసిన ఈ పాట ఫ్రెష్, మెలోడీయస్ రొమాంటిక్ నంబర్‌గా ఆకట్టుకుంటోంది. అకౌస్టిక్ సౌండ్స్‌కు ఎనర్జిటిక్ ఎలక్ట్రానిక్ బీట్స్‌ను జోడించిన థమన్.. ఎలక్ట్రిక్ మాండలిన్, రిథమ్ గిటార్స్, సాఫ్ట్ సింథ్స్‌తో పాటకు మంచి రిచ్ సౌండ్ తీసుకొచ్చారు. మోహిత్ చౌహాన్ తన సిగ్నేచర్ వాయిస్‌తో పాటకు నాస్టాల్జిక్ ఫీల్ తీసుకొచ్చారు. కళ్యాణ్ చక్రవర్తి రాసిన లిరిక్స్ ప్రేమలో పడినప్పుడు కలిగే ఆ చిన్న చిన్న ఆనందాలు, రోజువారీ క్షణాల్లో పుట్టే ప్రేమను అందంగా చెబుతున్నాయి.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.